
సృజన

ఆధునిక సాహిత్యవేదిక మాసపత్రిక



శ్రమ జీవుల రక్తంతో
జెండా నెగరేసాము
మృతవీరుల ఆశలతో
ముందుముందుకు పోతాము

—సుబ్బారావు పాణిగ్రాహి

111
జనవరి 1981

ఈ సంచిక రు. 2

మీరు రక్షించుకోలేకపోతే

రెండు మూడు నెలల్లో సృజన ఆగిపోతుంది ... ...

అవును, రెండు మూడు నెలల్లో సృజన ఆగిపోవలసిన పరిస్థితి వస్తోంది.

ప్రస్తుతం సృజన ఐదువేల రూపాయల అప్పుతో వుంది.

బకాయిలు చెల్లించని ఏజెంట్లూ, చందాలు సక్రమంగా చెల్లించని అభిమానులూ, పెరుగుతున్న పేపర్ ధరలూ, ప్రింటింగ్ ఛార్జీలూ ఇందుకు కారణం,

డబ్బు బకాయివున్న ఏజెంట్లకు సృజన పంపకుండా వుందామని కాపీలు తగ్గించినా అప్పు పెరుగుతూనే వుంది. ఒక్కొక్క సంచికకు దాదాపు రు. 2000-00 ఖర్చవుతున్నది. దాదాపు 100 కాపీలు జైళ్ళలోవున్న కామ్రేడ్స్‌కు, ఏ పారితోషికమూ లేకుండా సృజనకు రచనలు చేస్తున్న రచయితలకు, ఇతర మిత్రులకు ఉచితంగా పంపవలసి వుంటుంది. మిగిలిన కాపీల్లో దాదాపు 400 చందాలు. ఈ 400 కాపీల్లోనూ సరిగా డబ్బు చెల్లించినవీ, సృజన వద్ద నికరంగా డబ్బు వున్నవీ చాలా తక్కువ.

దాదాపు రు. 2000-00 ల ఖర్చుకు బదులుగా ప్రతినెలా దాదాపు రు. 600-00 వసూలవుతున్నాయి. రు. 1000-00 చందాల బాపతు డబ్బో, పుస్తకాలమ్మిన డబ్బో కలిసినా ప్రతినెలా రు. 400-00 లోటు వస్తున్నది.

ఇక ఈ పత్రికను రక్షించుకోవలసింది మీరే –

* ప్రతి జిల్లాలోనూ కనీసం 100 చందాలు చేర్పించండి.
* ప్రతి చిన్న పట్టణంలోనూ సృజనకు ఏజెన్సీ ఏర్పాటు చేయించండి

సృజన మీపత్రిక సృజన ప్రజల పత్రిక

సృజనను రక్షించుకోండి –

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

111 మాసపత్రిక జనవరి **1981**

కవర్ పేజ్ : కామ్రేడ్స్ భూమయ్య, కిష్టాగౌడ్ ల, ఆదిలాబాదు, కరీంనగర్ రైతాంగ పోరాట మృతవీరుల సంస్మరణ చిహ్నంగా గోదావరి తీరాన కరీంనగర్ జిల్లా పెద్దపల్లి తాలూకా కుక్కలగూడూరులో నిర్మించిన స్థూపం 23.12.1979.

SRJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh, Hyd. Vide Ref. No. 182/A4/67. Dated 22-9-1967.

Edited, printed & published by P. Hemalatha for 'Sahithee Mithrulu'. Printed at Natyakala Press Hyderabad for Venkataramana Mudranalayam, Warangal.

Working Editor ; Varavara Rao.

'ప్రజాపాణి'

సవరలు, జాతాపులు పోడు చేసుకున్న నేలలోకి వాళ్ళనెత్తుర్లు ఇంకి వాళ్ళ పొలాల్లో వాళ్ళే కంబార్లు అయిన సత్యానికి శ్రీకాకుళ అడవి సాక్ష్యం. వాళ్ళ తేనె హృదయాలను తేనెటీగలవంటి వడ్డీ వ్యాపారులు, భూస్వాములు పీల్చివేసి, వాళ్ళ ఇప్పపూల పరిమళాలవంటి మనసులను గిరిజన కార్పొరేషన్లు మధనపెట్టి వాళ్ళు వాళ్ళ నేలలో పరాయిలుగా బతికిన చరిత్రకు తూర్పు కనుమలు సాక్షి. వాళ్ళ కన్నీళ్ళకు, కోపాగ్నికి సముద్రము, దాని గర్భంలోని బడబాగ్ని సాక్షి.

ఒరిస్సా ఆంధ్ర సరిహద్దుల జీవిస్తున్న గిరిజనుల అణగారిన జీవితాలకే కాదు శాస్త్రీయమైన రంగుల స్వప్నానికి కూడ రంగమెటియా కొండలు సాక్షి. కోయంటే కోయన్న, ధీయంటే ధీయన్న కోరన్న మంగన్నలు చిందించిన నెత్తుర్లు భూస్వామ్య విధానాన్ని కూకటి వేళ్ళతో పెకిలించడానికి తెలుగు ప్రజలు కట్టిన నూతన ప్రజాస్వామిక వ్యావసాయిక విప్లవంలోని తొలి చాళ్ళు. గిరిజనుడి వింటి నారి శబ్దం జముకై, గిరిజనుడి గుండెలోని ఘోష భాషై, గిరిజనుడి వర్గపోరాట దీక్ష తన చిందై, గిరిజనుడి విముక్తి ఆకాంక్ష తన గీతమై, జనపదాల పాటకు, ఆటకు, మాటకు, చేతకు విప్లవావిష్కరణ చేసిన సుబ్బారావు పాణిగ్రాహి డిసెంబర్ 21/22 రాత్రి వేగుచుక్కయ్యాడు. విప్లవకళాసాహిత్యరంగాలకు అరుణతారయ్యాడు. 'దిక్కు మొక్కులేని జనం ఒక్కొక్కరు అగ్నికణం' అని నినదించిన కవికంఠం మూగవోయింది గానీ, 'వేయి కంఠనాదాలతో నినదిస్తార'ని ఆయన చేసిన హెచ్చరిక వేలవేల కంఠాలుగా ఇవ్వాళ దేశం నాలుగు చెరగులా వినవస్తున్నది. అందుకే ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల పీడితప్రజల ఐక్యతతో చెరపిన పాణిగ్రాహి రక్తపు వారసత్వం ఒక దశాబ్దంగడిచేప్పటికి ప్రాణహిత నదివిడదీసిన మహారాష్ట్ర-ఆంధ్ర సరిహద్దులను చెరపింది. ధర్మపురి చిత్తూరు జిల్లాలను కలిపింది. 'మృతవీరుల ఆశలతో మునుముందుకె పోతామని'ని ప్రకటించిన నాడు విప్లవోద్యమంలో ప్రాణాలు అర్పించడానికి తాను మొదటివాడూ కాదు, ఆఖరివాడూ కాదని పాణిగ్రాహికితెలుసు. తనకన్న ముందు పంచాది కృష్ణమూర్తి, 'బంగారుబాబు' చినబాబు, నరుడో భాస్కరుడు ఆ బాటన నడిచారు. పంచాది చేరిన ఆకాశాన్ని పంచుకోడానికి నిర్మల పయనించింది. తనబాట సత్యం కైలాసాలు నాడు- శంకర్, కన్నమణిలు నేడు.

పోరాటం నాలుగు చెరగుల వ్యాపించే వరకూ పాణిగ్రాహి పాటకు మరింత బలము, పాణిగ్రాహి విప్లవసాహిత్య కళావారసత్వాలకు మరింత వ్యాప్తి కలిగాయి. విప్లవకారులను పట్టుకొని కాల్చివేసి 'ఎదురుకాల్పుల్లో' మరణించారని ప్రకటించే దుర్మార్గపు రాజనీతికూడ తెలుగుదేశంనుంచి ఇటు తమిళనాడుకు అటుమహారాష్ట్రకు వ్యాపించింది. కళాకారులు, విద్యార్థులు, మేధావులు, రైతాంగం, కార్మికులు విప్లవోద్యమం పట్ల ప్రాణం పెట్టిన ప్రతిఒక్కరినీ ప్రాణాలతో వదలని ఫాసిస్టు దమనకాండను పన్నెండేళ్ళుగా అమలు చేస్తున్నది ప్రభుత్వం.

ఎక్కిన కొండలు, దాచినపొదలు, నడిచిన బాటలు, తెలిసిన మాటులు విప్లవకారులవి. మరి ఎదురు కాల్పులే అయితే విప్లవకారులు మాత్రమే ఎందుకు మరణిస్తున్నారు? రోడ్డుతప్ప దిగలేని జీపులు, ప్రాణాల మీది తీపులు, లోతు తెలియని నదులు, భయంతప్ప దారలేని అడవులు పోలీసులు గాయమైనా కాకుండా బతికి పోతున్నారు. మృతవీరుల సంఖ్య నాలుగు పందలకు పెరుగుతున్నది. ప్రాణాలకు తెగించి పోరాడుతున్న విప్లవకారులు 'ఎదురు కాల్పుల్లో' మరణిస్తున్నారు. ప్రాణం కాపాడుకోవడంతప్ప ఆశయంలేని పోలీసులు కదా చిత్తుగా తప్ప సినిమాల్లోని హీరోల్లాగా మిగిలిపోతున్నారు. అంటే ఇవి ఎదురు కాల్పులేనా? అనే అనుమానం పదేళ్ళయినా కలగకుండా వున్నవాడు ఈ దేశంలో ప్రజాస్వామ్యవాది సంగతి అలావుంచి కనీసం మెడకాయ మీద తలకాయ వున్నవాడు కూడ కాజాలడు. మరి ఈ విప్లవకారులంతా విప్లవపోరాటంలో వున్న వాళ్ళుకాదా? సాయుధ పోరాట పంథాను ఎంచుకున్న వాళ్ళుకాదా? నిశ్చయంగా అవును. కాని వీరంతా ఈ 'ఎదురుకాల్పుల' సంఘటనల్లో మరణించిన సమయాన సాయుధులా? సాయుధులైతే పోలీసులపై కాల్పులు జరిపారా? పోలీసులు ఆత్మరక్షణ కోసమే కాల్పులు జరిపారా? ఏ శిక్షాస్మృతి ప్రకారం ఇది సమర్థనీయం? భారతరాజ్యాంగం ప్రకటించుకున్న నీతి కంటికి కన్ను పంటికి పన్నేనా? అసలిది ప్రభుత్వము, దీనికొక శిక్షాస్మృతి వున్నాయా? లేవని, వున్నా అవి పాలకవర్గాల ప్రయోజనాలకే కాని ప్రజల కొరకు కాదని పాణిగ్రాహి సంస్మరణ మళ్ళీ మన స్మరణకు తెచ్చి మన కర్తవ్య నిర్వహణకు పురికొల్పుతున్నది.

15-1-81 —సంపాదకుడు

ఈ బతుకు ఇక దుర్లభమురా

(ఈపాట కట్టిన కవి నిరక్షరాస్యుడు)

తె. స్వామి

ఈ బతుకు ఇకదుర్లభమురా
హోరీ హోరా హోరున
పోరూ జోరూగ జెయరా ॥ఈ॥

ఎట్టి తట్టలు మోసి
ఏండ్ల కేండ్లు గడిసె
బువ్వలేక బుగ్గిలేక
అగ్గజాము దాటిపాయె
బొక్కలన్ని ఎండిపాయె
డొక్కలన్ని మాడిపాయె ॥ఈ॥

పెల్ల మీద పెల్ల పెడితె
తల్లడిల్లి తట్టమోస్తివి
కడుపునిండ బువ్వలేక
కండ్లుపెయ్యి తిరిగినాయి
గుండె నరములన్ని గుంజి
గంజి లేక సచ్చినావు ॥ఈ॥

పగలనక రాత్రనక
రాత్రనక పగలనక
పానాలు బోవంగా
పస్తులుండి సదివి
పట్టాలు బొందినా
కట్లాలు బోకపాయె ॥ఈ॥

బతుకూ దెరువు కోసం
భారీ రాజ్యం బోతె
బారెడంత చీర
మూరెడంత రైక
భార్యకు దొరకకపాయె
బతుకు మారక పాయె ॥ఈ॥

పట్ట పగటీలి
పాలేరంటు పోయి
నిట్టుటెండ లోనా
నీడయనకా చేస్తె
పొట్టానిండక పాయె
బట్టా దొరకక పాయె ॥ఈ॥

పండుగొస్తె పబ్బమొస్తె
పట్టెడన్న లేకపాయె
పని పాట జేయబోతె
పానగండ మాయె
పట్వార్లు పాటేండ్లు
పీక్క తినుడేనాయె ॥ఈ॥

పనిపాట జెయనోడు
పట్టు పరుపుల బండబట్టె
పేదోల్ల దోసుకుంటూ
పరమాన్నం తినబట్టె
మేడమీద మేడగట్టె
మిద్దెమీద మిద్దెగట్టె
కాలినడక నడవకుంట
కార్లల్ల తిరుగ వట్టె
కాయ కష్టం చేసినాను
కడుపు కన్నం కరువాయె
కారణాలు తెలుసుకోని
కదనాన దూకకుంటె ॥ఈ॥

బతుకులన్ని మారుటకు
బాధలన్ని దీరుటకు
కూడుగుడ్డ దొరకాలంటే
కూడి సంగం బెట్టుకోని
బందూకు బట్టుకోని
బరిగీసి నిలువన్న ॥ఈ॥

"శత్రు శిబిరమునైన..."

పథిక్

అక్కడ ఆకాశం
ప్రాణాంతక విద్యుదాఘాతాల
వలయ కుడ్యాల మీద ఆగిపోతుంది-
అక్కడ గాలి
బురుజు గోడల్లో చిక్కుకొని
రొద పెడుతుంది-
అక్కడ సూర్యుని వెలుగూ చంద్రుని వెన్నెలా
కటకటాల కవతల తారట్లాడుతూ
మనిషిదరికి చేరడానికి
మథన పడుతుంటయి-
అక్కడ స్వేచ్ఛ చిన్నది-
జీవితం చిన్నది-
అన్నిటికన్నా చీకటి పెద్దది,
అక్కడ ప్రశాంతి అవలిస్తుంటుంది-
నిశ్శబ్దం!
నిశ్శబ్దం భద్రంగా వుందనే అరుపులు తప్ప
అక్కడ బతుకంతా నిశ్శబ్దం-
అక్కడే
మెదళ్ళ పొలాలు దున్నబడుతయి.
అక్కడి చీకట్ల ఆకాశం కిందనే
నిశ్శబ్దపు మెదళ్ళలో
సంకెళ్ళు బద్ధలై
ఆలోచనలు సాగు జేయబడుతయి.
తొలకరి కోసం నెర్రెలు విచ్చినబీళ్ళలో
ఆశల చిగుళ్ళు పూస్తయి.
ఎర్రపూల వనంలో
ఆలోచనల కత్తులు మెరుస్తయి.
బందిఖానలో వెలుగుతున్న బాలచంద్రుడు

చీకటిని రద్దుచేస్తడు.
సూర్యుని వెలుగూ చంద్రుని వెన్నెలా
అందరికీ అందుతయి.

(శత్రు నిర్బంధంలో సైతం సడలని దీక్షతో పోరాటం పట్ల, విప్లవోద్యమం పట్ల ఆలోచనలు రగుల్చుతున్న కామ్రేడ్స్‌కు)

మలయాళీ కవిత

మౌనం

కె. జి. శంకర పిళ్ళై

నిర్మానుష్య మైన నా పూర్వీకుల ఇంట్లో
పోగొట్టుకున్న చిన్నతనపు సాయంకాలాలలో
ఒంటరిగా నేను—
అప్పుడు నాకు మౌనానికర్థం పచ్చికమీద పడుకొన్న కుక్కపిల్ల,
అప్పుడు నాకు మౌనాని కర్థం ఇంకోలోకం నుంచొచ్చిన నల్లపిల్లి,
అప్పుడు నాకు మౌనాని కర్థం తక్కువ కులం వాణ్ని ప్రేమించిన
నేరానికి తన యింట్లోనే బంధించబడ్డ మా మేనత్త

మొగ్గవైపు, తేనెవైపు, పాటవైపు
రుతువులో తిరిగి వచ్చిన పక్షివలె
పట్టణపు హాస్టల్ నుంచి ఇంటికి తిరిగొచ్చే శనివారాలు—
అప్పుడు నాకు మౌనాని కర్థం నెచ్చెలికీ నాకూ మధ్య
గడచిన దాన్నంతా గమనిస్తూ నిజం కోసం నిరీక్షిస్తూ
పేవ్‌మెంట్ మీద నిలబడి మధ్యవర్తిత్వం నెరపుతున్న
పోస్ట్‌బాక్స్.
అప్పుడు నాకు మౌనానికర్థం
ముద్దుకు ముందు మూతబడ్డ కళ్ళు

ఇంటర్వ్యూ కార్డ్ పట్టుకొని
మద్రాసు, బొంబాయి, కలకత్తావీధుల్లో తిరుగుతున్నప్పుడు

అప్పుడు నాకు మౌనానికర్థం
రైలు పట్టాల అనంతత్వం -
కాళ్ళకింది భూమిలో పెరుగుతున్న వేడి.

2

ఇవాళ నేను తెలుసుకోవాలనుకుంటున్నాను
మౌనమంటే ఏమిటి ?
గ్రామాల్లో పగటిపూట ఆకలితో జోకొట్టబడ్డ శిశువు.
గత పవిత్ర వైదిక సంస్కృతి,
కేదారనాథ్ ఫల్లూాలు,
స్వేచ్ఛ,
కటకటాలవెనుకవున్న కళంకంలేని యువకులు,
అహింస తయారుచేసిన లోటుబడ్జెట్,
వారానికి దొరికే బియ్యాన్నీ గోధుమల్నీ
తీసుకోవడానికి తన చనిపోయిన శిశువును
ఎత్తుకుని నిలబడ్డతల్లి,
పుస్తకాల అలమరలో భగవద్గీత -
మౌనమంటే ఏమిటి ?
ఏ భారతీయ అహంకారాన్ని మౌనమనాలి[1] ?

కులం, మతం, సోమరితనం, అసూయ,
నిరర్థకత్వం, బాధ, శంకలతోనిండిన పాలకుల వారసత్వాలు
నిజంపట్ల చెవిటితనం, పిరికితనం,
పవిత్రద్వారానికావల వుంచబడ్డ సంతాల్ లు-
వివేకవంతుల ఏకీర్తిని మౌనమనాలి[1] ?
ఇవాళ నేను తెలుసుకోవాలనుకుంటున్నాను.
మౌనమంటే ఏమిటి ?
అది తపసుచేస్తున్న బుద్ధుని శిరస్సా ?
వానలో తడిసిన సమాధిమీది శిలువా ?
వీధుల్లో మూగగా పడివున్న గాంధీయా ?

మౌనమంటే ఏమిటి ?

3

భూమిమీద మౌనం సృష్టించగల
రహస్యార్థాలు ఇవాళ నాకు తెలుసు
మౌనమంటే పేవ్‌మెంట్ మీది పోస్ట్‌బాక్స్ కాదు.
మౌనమంటే ఆస్పత్రివరండాలోని 'నిశ్శబ్దం' బోర్డు కాదు.
మౌనమంటే గాంధీ మౌనవ్రతం కాదు.
అది
యమునానదిని చుడుతున్న
రాక్షస సర్పపు భయంకర మౌనం.[2]
దాని ప్రతి అధికారపు పడగలోనూ
చంపేసే విషపూరిత మౌనం.
మారుమూల గ్రామాల వీధుల్లోకి సైతం
ఈ విషపూరిత మౌనం చొరబారుతుంది.
అధికపన్నులు, అంతులేని పేదరికం,
నిరాకరించబడిన శవాలు, అజ్ఞానం, నిరాశ,
ఆవేదనల ముసుగులో
ప్రతి చేతినీ, మాటనూ, ఆలోచననూ,
రక్తంకోసం పరితపిస్తున్న ఆక్రోశాన్ని
బంధించే లెక్కలేనన్ని గొలుసులు.
మారుమూల గ్రామాల వీధుల్లోకి సైతం
ఈ విషపూరిత మౌనం చొరబారుతుంది.
మౌనం వెంటాడే గూఢచారి —
మౌనం చుట్టేసే ప్రలోభం
మౌనం శిలువ వేసే ద్రోహి-
ఇవాళ నాకు తెలుసు.
ప్రశ్నించేవాడి స్థానం ఖాళీచేసే మౌనం ఇవాళ నాకు తెలుసు
మర్నాడు తన కొడుకును కోల్పోయే అతని తల్లి మౌనం
ఇవాళ నాకు తెలుసు.

అతని వితంతు భార్య మౌనం,
బల్లమీద ఎదురు చూస్తున్న పాలుకలపని కాఫీ మౌనం,
పచ్చిక మీద గెంతుతున్న ఎర్రపూల మౌనం
ఇవాళ నాకు తెలుసు.
మన ప్రతి ఒక్కరి జీవిత ఆద్యంతాల్లో
ఇవాళ మౌనం నివసిస్తున్నది.
మనందరమూ విషాదంగా నిట్టూర్పులు విడుస్తాం.
కాని
మనలోలోపల
మన జాతి మనకిచ్చిన గొప్పశక్తులున్నాయి.
మనం, ఆకలితో చంపబడ్డ వాళ్ళ వారసులం,
మనం, ఉరితీయబడ్డ వాళ్ళ పిల్లలం.
దుర్మార్గ శతాబ్దాల భయంకర మరణ శాసనం.
మన కళ్ళలో గడ్డకట్టిన కన్నీళ్ళకఠిన మౌనం
కత్తి అంచుమీది పదునులా
మన మనసుల్లో మహత్తర ప్రతిజ్ఞవల్ల వచ్చిన కఠిన మౌనం.
మౌనయుగపు లోతుల్లో వసంత మేఘగర్జన,
నిరాశా పూరిత కూడళ్ళలో ప్రాణంలేకుండా ఆగిపోయిన
మీ గడియారాలు సరిచేసుకోండి.
విషసర్పాలు కదలనీ, సొమ్మసిల్లనీ,
జైళ్ళు పగలనీ,
ఆకులు లేని కొమ్మలు రక్తం పుష్పించనీ-
త్వర పడండి
చాలా సేపటికింద ఆగిపోయిన
మీ గడియారాలు సరిచేసుకోండి.

1. "మౌనం వివేకవంతుడి కీర్తి"- ఒక సామెత
2. పార్లమెంట్ భవనం

మలయాళం నుంచి ఇంగ్లీషు : సచ్చిదానందన్, ఎంవి వర్గీస్
ఇంగ్లీషు నుంచి : వేణు.

తిరుగుబాటు

పెద్దకథ

ఎస్. రాములు

(గత సంచిక తరువాయి)

*   *   *   *

చీకటైంది. చుట్టలంటుకున్నయి. అవి రాయలసీమవాళ్ల గజంనర ఎత్తున్న గుడిసెల గుంపులు.

"వారం రోజులాయెనే జరమచ్చి!...అసలే సాతనైతలేదు. తిండిగుడ సయిపుత లేదు. సక్కగ పన్జేత్తలేరని మేస్త్రి ఎల్లయ్య బండబూతులు తిట్టవట్టె. ఆని బండబూతులకు బయపడి పనిజేత్తున్న గని సలీరంల ఈసమెత్తు తాకతులేదే" నర్సయ్య అన్నడు.

"నర్సన్నా ! యింటిమీదికి పానం గొట్టుకుంటాందే. ఇల్లిడిసచ్చి నాల్నెల్లాయె. మందుమాకులు లేకుంట ఇంక గిట్లనే యింకో అరం పదిరోజులు ఈన్నే ఉంటె, యిక్కన్నుంచి మన పీన్గులే ఎల్లెటట్టున్నయే. మనం మన ఊరికోదామే"

"ఔనే ! ఈడన్నది నిజమేనే ఆని తిట్లకు బయపడి పనిజేత్తన్నంగని ఎపల సలీరంల ఈసమెత్తన్న తాకతున్నాదే? నిన్న చక్కరచ్చి అడ్డంబడితె నాగరీకం దొబ్బుతున్నవేందిర అని తిట్టలేదె? పనిజెయ్యకపంటె తిండి నీ తాతపెడ్తడా అనవట్టె"

"ఔ! ఔనె! బతికుంటె బలుసాకు తినచ్చు ఇంటికి వోదామే" లోపలికి ఎండుకుపోయి తేలిన బరిబత్త బొక్కలను ఎంచుకుంట అన్నడు అగయ్య.

"మనకు అచ్చేకాడికి పైసలు లెక్కగట్టి యిమ్మనాలె"

"ఇంక వాడేం పైసలిత్తడుర ! పైసలమీద ఆసవెట్టుకున్నావ్ యింక ! ఇంక ఆడే మనకిచ్చిన అడ్వాన్సులకెల్లి నాకే పైసలు దేల్తయని లెక్కలు దీత్తడు. దబాయిత్తడు.

అదిగాక మనం బోతున్నట్టు దెలిత్తె బొక్కలిరుగదంతరు. మనం బోయేది పురుగుకు గూడ తెల్వొద్దు."

"అవునె! రేపు రాత్రికి ఉన్నకాడికి అన్ని సదురుకొని పోదాం."

"మనం ఈడ సామాను సదురుకుంట జేత్తె ఆ లోపల అల్లచ్చి మెత్తగదంతరు. అదిగాక మనకున్న సామానేందె రెండన్నందినే గిన్నెలేగదనే! పీకితె పీకని ! అంతగొడ్తె అయిదార్రూపాల సామానుగాదు."

"పానం కన్న ఎక్కువనా ! సామాను ఈన్నే పారేసిపోదాం"

"అవు ! నువు జెప్పింది మంచిగున్నది." కనుకవ్వ అన్నది.

* * *

అది అందరూ నిద్రవోయిన యాల్ల. గడియారంల ఎంతైతాందో తెలిసి నట్టు లేదు అల్లకు.

కాల్లతో కాలాన్ని దాటేస్తూ కిలోమీటరు దూరం పైగానే పిల్లాజెల్లా సంక నెత్తుకొని వడివడిగ నడిసిన్రు.

"అరేయి ! ఎటువోతున్నరా !" అని కుశలమడిగిండు ఏజెంటు సైకిలు మోటారు మీదినుంచి దిగకుంటనే.

"అయ్యా ! ఏదో ఆడివోరగాండ్లు సీనిమ్మకోదామని రోజు మొత్తుకుంటె కొంచెం తీరిందని రెండో ఆటకు పోదామని బయలెల్లినం సారు." మనిషికింత మూటగట్టిన ధైర్యంతో మంచిగనే జవాబిచ్చిన్రు.

"ఇపుడేం సిన్మానయా ! రాత్రి పదకొండున్నరైంది. మీరు ఆడికివోయె టాల్లకే ఒంటిగంటైతది. మరి యీ ముచ్చట ముందే జెప్తె మిమ్ముల్నందర్ని టిప్పర్ల పంపకపోదునా ! రాత్రి బాగైంది గుడిసెలకోని."

ఏదో పనిఉన్నవానితీర్గ సైకిలుమోటారు మీద బంట్లతో పదిగజాలు దూసుకు పోయి సీకట్ల యింజన్ బందుచేసి దారికాసి నిలబడ్డట్టున్నడు.

సైకిలుమోటారు సప్పుడు ఒకటేసారి బందయ్యేసరికి ఏజెంటు, బంట్లు ఎక్క డున్నరో ఊహించినట్టున్నరు. ఎనుకకు మర్లిన్రు.

సాతగాని పానాలతో ఏంజేయలేక ఉసూరుమన్నట్టున్నరు.

తెల్లవారింది. గోడ పర్రెల్లోంచి ఎలుగు అలాఅలా దూరం పాకినటు ఈ వార్త సైటంతా పాకింది.

అన్ని యూనిట్ల లేబరు ఎసలకు వాల్లు గుసగుసలు పెడుతున్నరు.

సైటంత ప్రశాంతంగా ఉంది, రేపుపేలే అగ్నిపర్వతంలా.

* * *

రోజులు గడుస్తున్నయి, వాల్ల జీవితాల్లాగనె బరువుగ.

''ఎప్పుడు చెప్పిపంపుతె ఎప్పుడు కలుత్తున్నరు మీరు. నాకేమొ మీదగ్గరికి వచ్చుటానికి వీలుగాదాయె.'' అన్నడు సురేందరు.

''మేం మీరు చెప్పంపక ముందట్నుంచే మిమ్ములను గలుద్దాం అనుకుంటే ఆనాట్నుంచి మమ్ములనెటు కదలనిత్తలేరాయె. ఏంజెయ్యి మంటారు సారు! సావన్నరాకపాయె!''

''ఇదిగో నర్సన్నా! ఇగమీకు ఈడ ఉండబుద్దిగానపుడు మీకు పంచ బచ్చ

పరమాన్నాలు పెట్టినా సయిపడి. ఎట్లైనారు మీరంత పీనుగులోలె'' టిప్పరు స్పీడు పెంచిండు సురేందరు.

''ఏంజెయ్యాలె సారు! మీరే ఏదన్న ఉపాయం జెప్పు(ని. ఏదో ఉపాయం జెయ్యవోతె మాడి పొరకపాయె. ఇగమీరె ఎట్లన్న జేసి మేమందరం అవుతలపడే ఉపాయం జెప్పు(ని. ఈన్నుంచవుతలపడ్తె అవుతల ఎట్లనన్న జేసి యింటికివోతం! అఖరికి బిచ్చమడుక్కోని తినుకుంటనైన ఇంటికి జేర్తం. ఈడమాత్రం బతికెటట్టు లేం'' కలుగుతున్న బాధను లోపల్లోపలే కుక్కుకొంటున్న వాల్లను చూస్తే కండ్లకు నీరచ్చింది సురేందరుకు.

''మీరు జిల్లా కలక్టరుకు మీ పరిస్థితి ఉన్నదున్నట్టురాసి, యింటికి వోత మంటె పోనిస్తలేరని, జ్వరాలస్తె మందులిస్తలేరని...అన్ని వివరంగ రాసి దరకాస్తు దీసికొనిపోయి కలువు(ని''.

''అల్లకు దెలిస్తె మమ్ములనరికి కాల్వకట్టకు పాతరవెట్టరా''

''అట్లేం జరగది మీరు దరకాస్తు రాసినట్టు ఎవరికి తెలువనీయకపోతె ఏం గాదు.''

''మరి మావోల్లందర్ని యిసారిచ్చు కోవాల! ఏమంటరో మరి!'' ,

''సరె యియ్యాల రాత్రి విచారించుకో(ని. రేపు పగలు నేను తాలుకాకు మల్లవోయే పనున్నది. మీలో ఎవరన్న యిద్దరు ఎవరికి తెల్వకుంట తుమ్మచెట్టు కాడికి రా(ని! తోలుకువోత!''

* * *

''రండి. కూర్చోండి. వీళ్ళు నిన్న వచ్చారట. నాకు యిపుడే కలిశారు. నిన్న నేను టూర్ పోయానని తెల్సి ఎలాగైనా నన్ను కలువాలని రాత్రంతా బస్టాండులో ఉండి, ఉదయమే వచ్చారిక్కడికి. అందుకే ఫోన్‌చేసి మిమ్ముల‌ను పిలి పించానిక్కడికి. వీళ్ళకు ఏ సౌకర్యాలు లేవని, యిపుడు యింటికి వెళ్ళిపోతామని, పోదామంటే పోనీయడం లేదని చెప్పారు. వీళ్ళేమీ బాండెడ్ లేబర్ కాదు. మనం బాండెడ్ లేబరునే విడిపిస్తున్నాం కదా! వీళ్ళకు రావల్సిన కూలిపైకం కూడ ఎకౌంట్సు చేసి యిప్పించి వీళ్ళని వీళ్ళ యిండ్లల్లకు పంపించే ఏర్పాటు చేయిం చండి.''

జిల్లా కలక్టరు వాళ్ళిచ్చిన దరకాస్తుమీద తొందరగ చర్యతీసుకొమ్మని ఆదే శించి, రాసి అతని చేతికిచ్చాడు.

లేబరాఫీసరు ఆ అన్యాయాల గురించి అపుడే వింటున్నట్టు బాధపడి పోయిండు !

* * *

"నమస్తే సార్" అంటు పలుకరించిందు ఏజెంటు.

అది పట్టపగలు.

లేబరు, లేబరాఫీసరు ఒకే జీపు నుంచి దిగుతుండడం చూసిన ఏజెంటుకు, పట్ట పగలే సూర్యుడు చుక్కలు కలిసి కనిపించినట్లైంది.

"నేనేదో మనసులో పెట్టుకొని యిలా చేశాననుకోకండి నా ప్రమేయం చాలా తక్కువ. ఇది కొత్త కలక్టరు చేశాడు. దీని మీద యాక్షన్ తీసికొమ్మని నాకు రాసాడు యిదిగో చూడు" అంటూ చూపించిందు.

"ఈ కలెక్టరుకు మీ గుత్తెదారు విషయం యింకా తెలియనట్టున్నది. సేయం మనిషిని ముట్టుకొనేంత ధైర్యం ఈ కలెక్టరుగారికెక్కడిది. ఏదో యింకా తెలియనట్టుంది.

ఇంగ్లీషు యితరులెవరికి అర్థంగాకుండ వాళ్ళిద్దరు స్వేచ్ఛగ మాట్లాడుకోవడానికి అవకాశం యిచ్చినందుకు మనసులోనే కృతజ్ఞతలు తెలుపుకున్నరు.

దరఖాస్తులోని చేతి రాత చూసి దూరంగ నిలబడ్డ సురేందర్ వేపు ఎందుకో అదో రకంగా చూసిండు ఏజెంట్.

"రాయలసీమ వాళ్ళను రమ్మంటె అందరచ్చిన్రేంది. ఇదేమన్న చోద్యమా? పనిచేసుకోపొండి" అన్నడు ఏజెంటు.

"అవును! మిగతా వాళ్ళంతా ఎవరి పని వాళ్ళు చూసుకొంటి." అన్నడు లేబరాఫీసరు.

"అందరూ వెళిపోయినట్టేనా?" అడిగిండు ఆఫీసరు ఏజెంటును పది నిమిషాల తర్వాత.

"ఆఁ!" అన్నడు ఏజెంటు.

"ఈ దరఖాస్తు ఇచ్చింది మీరేనా" అడిగిండు ఆఫీసరు అందర్ని కలియజూసుకుంటు.

''అవునయ్యా'' అన్నరు అందరు ఒకేసారి.

''మంచినీల్లు తెద్దాం రాన్రి'' అన్నడు మేస్త్రి ఎల్లయ్య ఆడోల్లనుఉద్దేశించి. వాల్లు తటపటాయిస్తున్నరు.

"ఫర్లేదు! మీరెళ్ళండి మీరందరు వచ్చేవరకు యిక్కడే ఉంటాను'' నమ్మబలికిండు ఆఫీసరు.

అయిష్టంగానే కదిలిన్రి ఆడోల్లు.

"మీకు మందులు, సెలవులు యిస్తూలేరని మంచి తిండిపెట్టడం లేదని మీకోసం వేసిన

రాశారు మీరిందులో! నిజమేనా?"

"అయ్యా! మీరు జూస్తలేర! మేం ఎట్లున్నమో! మా గుడిసెలెట్లున్నయో! కన ప[illegible]!''

"అయితే యికనుండి మీరు కోరిన సౌకర్యాలన్నీ కల్పిస్తే పని చేసుకొంటు ఇక్కడే ఉంటారా!'' అడిగిండు ఆఫీసరు.

"మీరేమన్న జెయ్యున్రి గని మేం మాత్రం యింటికే వోతం''

అరగంటసేపు ఎందుకు అని, ఉండమని యక్షప్రశ్నలతో గుచ్చి గుచ్చి అడిగి గుత్తెదారు తరపు వకాల్తాలో ఓడిపోయినట్టు మొకం బెట్టిండు ఆఫీసరు.

"సరే మీయిష్టం! మీకు తేలవలసిన కూలీ పైకం లెక్కచెయ్యాలి గదా! ఎంతసేపని నిలబడ్తరు! అలా కూర్చొండి'' అన్నడు ఆఫీసరు.

ఏజెంటూ, మేస్త్రీ, ఆఫీసరూ కలిసి అరగంటదాక ఏదేదో లెక్కలు చేసిన్రు "మీకు ఒక్క పైసాగూడ తేలలేదు. మీరే కొందరు కొంతపైకం ఎక్కువ వాడుకున్నరు.''

"అయితే మీరు దూరం పోవాల్సినవాళ్ళని మీ మేస్త్రీని, ఏజెంటును సముదాయించి చెరిసగం భరించుమని చెప్పి నేను వీళ్ళద్దర్ని సముదాయించి తలాపదిరూపాయలు యిప్పిస్తున్నా తీసికొండి" అన్నడు ఆఫీసరు.

రానికాడ 'రాయి' అయినా వచ్చిందని అందరు సరే అని సంతోషపడ్డరు.

"ఇక వెళ్తాను నేను" చేతిల చేయిగలిపి ఏజెంటుకు చెప్పి జీపెక్కిండు.

లేబరు జీపెనుకే నిలబడ్డరు.

"మీకోసం వండిన అన్నం పాడైతది. తినిపోన్రి" అన్నడు మేస్త్రీ ఎల్లయ్య. అది చివరి బాణమో ఏమోమరి.

"మాకు తిండివద్దు! తిప్పలువద్దు! అయ్యా! లేబరాఫీసరు సారూ! మీరు కొంచెం ఆగున్రి. మీరు ఎనుక ఉండున్రి మేం ముంగట నడుత్తం'' అన్నరు.

"వీళ్ళని టిప్పర్లో జిల్లాపట్టణం దాక పంపించండి.'' "ఈ జీపులో కూడా కొందరు ఎక్కండి టిప్పర్లో పట్టకపోతే" కొరకరాని కొయ్యలైన ఆ లేబర్ను ఏం చేయాలో తెలీక అన్నడు లేబరాఫీసరు.

టిప్పరు క్యాబిన్లో నర్సయ్య, సాయిలు కూర్చున్నరు. పేరు పేరున కృతజ్ఞతలు చెప్పుకున్నరు సురేందరుకు.

టిప్పరే ముందునడిచింది. జీపు వెనక వచ్చింది.

'అవుసార్! ఆఫీసరత్తె ఏజంటు గట్లెందుకు భయపడ్డడుసారు. మేస్త్రీ ఎల్లయ్యను ఎందుకెను కేసుకచ్చిండు.' అడిగిన్రి.

'మేస్త్రీ ఎల్లయ్య కాదుగద గుత్త పట్టింది. మీరు ఏ ఫిర్యాదు చేసినా ఎవల మీద చేసినా రూలు ప్రకారం ప్రభుత్వం గుత్తెదారు మీదనే చర్య తీసికొంటుండి. అందుకే ఆ కంగారు.' అన్నడు సురేందరు.

'గుత్తెదారుకు ఏమన్నయితే వాన్నొకరి గుత్తెదారు పీకేత్తడని వాని భయం వానిది' అన్నడు మల్ల.

'ఒకూరి యాతాలకు యింకో వూరి జీతాలకు పొత్తు కుదరదని, ఉన్న వూల్లనే యాతాలకు జీతాలు గుదిరి కూలి పెంచుకోవాల్నని పుట్టి పెరిగిన టిఁల్లల్లకు వోతున్నట్టు' చెప్పుకున్నరు సురేందరుకు.

పాలమూరు, ఒరియా లేబరు మాత్రం పనిచేసుకుంట కాల్వ మీదనే ఉన్నరు. వాల్లది తమ విజయమే అన్నట్లు చాటుకున్నరు. అంతవరకు కనుసైగల భాషణ, గుసగుసల భాషగా ఉన్న వాల్ల బాధల భాష గులకరాల్ల భాషగ గల గల పారింది.

* * *

"ఇదిగో ఈ సైకిల్ మోటర్ మీద వెళ్ళి ఒక పెట్టె బీర్లు, రెండు విస్కీ బాటీల్సు తీసుక రా పో" అన్నడు ఏజెంటు.

"వెనుక బీర్లు గట్టుకొని నాకు తేరాదు. నారాయనను నా తోటి తోలియ్యిన్రి. వెనుక కూర్చుండి పట్టుకొంటడు."

''ఛ! ఛ! నీకు ఏ పని జెప్పినా యింతే. నీకు జెప్తే నీ తోకకు జెప్తవు. వాడు సురేందరే మంచిగుండె. అంత చదువు చదివినా గర్వం లేకుండె. ఏ పనంటె ఆ పని సక్కగ జేస్తుండె. రాత్రంటె రాత్రి, పగలంటె పగలు ఎప్పుడైనా పని జేస్తుండె. నీ తీర్గ ఎన్నడు వంకలు పెట్టక పోవు. గుత్తెదారుకు జెప్పివాన్ని దీసే యింటుడు తప్పైంది... ఇగ దొబ్బుపో! వంటాలస్యమైతే కానీ. ఏంజెయ్యాల'' విసుక్కున్నడు ఏజెంటు.

''మల్లయ్యా! నువు పక్క పల్లెలకోయి రెండు కోల్లు జాద దీస్కరా'' అన్నడు ఉన్న ఒక బంటుతో.

''నారిగాన్ని అటు తోలెయ్యవద్దిరి. నేను కోల్లకు వోలె ఇగ మసాల లెప్పుడు నూర్తరు. బగారెప్పుడైతది? ఇల్లిల్లు ఎవడు దిరుగాలె?'' అనుకున్నడో ఏమో.

''అయితే చిన రాజయ్య మేస్త్రిని ఇక్కడికి రమ్మను''

చిన రాజం వచ్చినంక ''ఇదిగో రాజం! ఈ పక్క పల్లెల కోయి రెండు కోల్లు జాద దీస్కరా'' అన్నడు ఏజెంటు.

''నేను కోల్లకు దిరుగ వోతె సైటు మీద ఎవడు పని జెయ్యడు. కావాలంటె యిద్దరు లేబర్ను దోల్త''

గాలికి బోయే కంప తనకెందు కనుకున్నాడో ఏమో.

''తొందరగ పంపించు'' అసహనంతొ అన్నడు ఏజెంటు

పది నిమిషాలు గడిసినయి.

గాలన్న షెడ్డు దగ్గరున్న డీజెల్ డ్రమ్ముకానుకొని నిలబడ్డడు. పందిరి గుంజ సాటుకు పీరయ్య.

అచ్చిన పని ఆల్లే చెత్తరనుకున్నట్టున్నరు.

''అరేయి మీరిద్దరు గల్సి పోయి ఈ పక్క పల్లెల రెండు కోల్లు జూడదీస్కరాన్రి. ఓ రూపాయి ఎక్కువ పెట్టయినా తీస్కరాన్రి. అదిదాక వోయి ఉత్త చేతు లొట్టి ఊక్కుంట రాకుండ్రి.'' జేబులోంచి పది రూపాయల నోట్లు నాల్గు తీసి చేతిలో పట్టుకొని తీసికొమ్మని వాళ్ళ వైపు చూసిండు.

పైసలు దీసుకునుటానికి ఎవలు ముందుకు కదల్లేదు.

అంతవరకున్న అసహనం కోపంగ మారినట్టుంది.

''అరేయి లంజకొడుక చెప్పేది మీక్కాదుర! చెప్తె చెవులిన పడ్తలేవుర!... ...ఎవడు కదలడేంర!'' అంటూ నోట్లు పట్టుకొన్న చెయితో గాలన్నను పిలిచిండు రమ్మని.

దగ్గరికచ్చిండు గాలన్న. అయినా చెయి జాపి నోట్లు అందుకోలేదు. అట్లనే నిలబడ్డడు.

అయిదున్నర అడుగుల పైనే ఎత్తున్న గాలన్న దగ్గరి కచ్చి అలా మాట్లాడ కుంట నిలబడేసరికి కుర్చీలో కూర్చుండి ఉన్న ఏజెంటుకు కొట్టెతందుకు వచ్చిండా అని మనసులనే ఒక్కసారి ఉలిక్కి పడ్డడు. అయినా తమాయించుకొన్నడు, అది అసందర్భపు ఆలోచన అని.

గాలన్న పెయి మీద అంగి లేదు. మడి పంచెలా కట్టిన ముద్ది పంచె బిల్ల గోసి పెట్టి కట్టిండు. ఆ పంచె సల్లగ జిడ్డుగున్నది. దాని తెల్లదనం కోల్పోయి కాయ వట్టినట్టున్నది.

నేలచూపు చూస్తున్న గాలన్న నిలేసిన గడ్డపారలా కన్పించిండు.

"చెప్తె చెవులినపడ్తలేవుర" మల్ల అన్నడు. అక్కన్నేవున్న సూపరువైజరు, యింజనీరు మవునంగ ఆశ్చర్యంగా చూస్తూ, అక్కడున్న పత్రికలు తిరగేస్తున్నరు.

"అవుర ! అని పిలిస్తె ఎవుర్నో అనుకున్న" గాలన్న శాంతంగ.

"నీ పేరు నాకేమెర్కాటుర లంజకొడుక ! అవుర అని పిల్వక యింక

నిన్నేమని పిలవాలెర" కోపం తారస్థాయినందుకున్నట్టున్నది. గొంతు పెరిగింది.

"నా పేరు లంజకొడుకు గాదు, గాలన్న" కోపాన్ని బిగపట్టినా అయినా మాటగట్టిగనే వచ్చింది.

అవాక్కయి పోయిండు ఏజెంటు అనుకోని జవాబుకు. అటుయిటు చూసిండు బీర్లకోయిన టిప్పరు డ్రైవరు బంటుగాడు రానట్టున్నరు. ఉన్న ఒక్కడు షెడ్డు లోపల ఏదో నూరుతున్నట్టున్నడు.

లోపల నూరుతున్నట్టె పండ్లు నూరినట్టున్నడు ఏజెంటు అంత జరిగినంక గాలన్నకు పైసలిచ్చి పని చెప్పటానికి మనసొప్పలేదు.

'ఆని పేరేంది' అన్నడు.

'ఆయన పేరు వీరయ్య' అన్నడు గాలన్న. ఏజంటుకు మళ్ళీ అహం దెబ్బతిన్నది.

"వీరయ్యా! మీరిద్దరు గల్సి, పల్లెకుపోయి తొందరగ కోలు జాడదీస్కరాన్రి" అని నోట్లు చేతిల పెట్టిండు. వాల్లు ఎల్లిపోయిన్రు.

''లేబరు పూర్వంలా లేనట్టున్నరు. బాగ తెలివి మీరిపోయినట్టున్నరు అరేయి అంటే పడుతలేరు.'' అన్నడు సూపర్వైజర్.

''నేను నాగార్జునసాగర్‌డాం లో జేయీ గా అపాయింటయినపుడు యిలా ఎవరైనా మాట్లాడితే మరుసటిరోజు వాడి అడ్రసు కన్పించకపోవు. ఇపుడు ఎవర్ని ఏమీ అనొచ్చేట్టు లేదు. బుజ్జగించి పని చెప్పాల్సి వొస్తోంది.''అన్నాడు యింజనీరు. ఈఈ గా ప్రమోషన్ రావాల్సినా ఎపనికి పెట్టకుంట ఉన్నదంత తనే దోసుకు తినే తత్వంగలవాడు కావడంవల్ల పై అధికార్లకు ఏమి ముట్టజెప్పక పోయేసరికి 'కాన్ఫిడెన్షియల్ రిపోర్టు' సరిగ్గాలేక ప్రమోషన్ ఆగిపోయి ఏఈ గానే ఉండిపోయిండు.

'' సరే!... మేం ఈ ప్రక్కనున్న సైటుకూడా చూసొస్తాం''అని లేసిన్రు

''తొందరగ వస్తే బాగుండు'' అన్నడు ఏజెంటు.

''ఎంతసేపు? అరగంట! అలావెళ్ళి యిలా వచ్చేస్తాం'' వాల్లుపోయిన్రు.

'వీల్లు పోయినంక ఇట్ల జరిగినా బాగుండు. వాల్లముందు ఉన్న పరువు పాయె' అనుకొన్నడు ఏజెంటు.

* * *

ఎర్రజెండాలు పట్టుకోని అటుయిటూ ఊపుతున్నరు. నీటి పాయలో పలుగు పారతో ఎవరూ పని చెయ్యటం లేదు.

అల్లంత దూరంల చెట్లకింద అందరు జమైన్రు. అట్ల అందరు ఒక కాడ జమగావటం అరుదైన సంగతి. వాల్లంత కాలుటానికి తయారు అన్నట్టున్న నల్ల బంగారం వోలె ఉన్నరు. ముడి పంచెతప్ప ఎవరి పెయిమీద అంగీలు లేవు. మాసి

పోయిన తలలు, లేసిపోయిన గుంట్రుకలు, చెమటలు కారిన శరీరాలు, చినిగిపోయిన చీరలు, అన్నీ కలిసిపోయి 'ఒకే రంగులో' కన్పిస్తున్నరు.

పొలికేక...

రాజయ్య, పెంటయ్య వీరయ్య, గాలన్న మొదలైనవాళ్ళు ఏడెనిమిది మంది దాక నీటి పాయలోకి నడిసిన్రు.

మరో పొలికేక......

ఆ కేక విని గబగబా దబదబా దూరంగ ఉరికిన్రు. అలా క్షణం గడిచిందో లేదో భూమి దద్దరిల్లినట్లు ధ్వని వినిపించింది వాళ్లకు. ప్రాణాలు పోయినట్టే నసుకొని పరిగెత్తిన్రు. అయినా లాభం లేక పోయింది. పట్టున పగిలి ఆకాశంలకు ఎగిరిన బండలు రాజయ్య, పెంటయ్య లిద్దరి మీద బడ్డయి. బిగ్గరగా ఆర్తనాదం చేస్తూ పరిగెత్తుకుంటనే పడిపోయిన్రు.

అంతవరకు విశ్రాంతిగా వున్న వాతావరణంలో కల కలం మొదలైంది.

ముందుగా ముందుకు ఉరికిన వీరయ్య, గాలన్న మొదలయిన వాళ్లు ఆర్తనాదం విని ప్రాణాలు పోయినాసరే నసుకున్నట్టున్నరు. వడివడిగా వెనుదిరిగి పడిపోయినోల్లను మోసుకొచ్చిన్రు.

అయ్యో! అయ్యో! అంటున్నరు. ఏమవుతుందోనని ప్రాణాలు బిగవట్టి చూస్తున్నారంత. రాళ్లకు వెట్టిన బత్తీలు రెండు ప్రమాదవశాత్తు తొందరగ పేలి క్షణాలమీద ప్రమాదం జర్గిపోయింది.

* * *

డాక్టరు కన్సల్టింగు రూంల కూర్చున్నడు, చేతులు తుడుసుకోని. గాలన్న, వీరయ్య, ఏంజెప్తడో అన్నట్టు ఎదురుసూసుకుంట డాక్టరు ఎదురుంగనే వంగి నిలబడ్డరు చేతులు కట్టుకోని.

ఏడుపులు గట్టిగ వినపడుతున్నయి డాక్టరుకు.

"ఆ ఏడుపులు ఆపమనండి. బయటకు పంపించండి లేకపోతే" అన్నడు డాక్టరు.

"రాజయ్య తల పగిలింది. వెన్నుపూస కదిలింది. ఇంకా చిన్న చిన్న గాయాలు చాల అయ్యాయి. పెంటయ్య కండలన్నీ దెబ్బదిన్నయి. వెన్నుపూస విరిగింది. దెబ్బలు కూడా బాగానే తాకాయి. చాలా రక్తం కారిపోయింది. ఇపుడు శరీరంలో రక్తం చాలా తక్కువగా ఉంది. గ్లూకోజులు యింకా రెండుమూడు రోజుల వరకూ ప్రతి గంటకూ ఎక్కించాల్సి ఉంటుంది. వీరికి రెండు మాసాలు విశ్రాంతి అవసరం. ఒక నెల మాత్రం ఈ హాస్పిటల్లోనే వుండాల్సి వుంటుంది. మీరెవరూ అలా పూరికే మాట్లాడించకండి. మాట్లాడిస్తే తల కండరాలన్నీ కదులు

తాయి. కుట్లు కుదురుకోవు మరి. మీరు వెత్తె వెళ్ళండి. వీళ్ళని కనిపెట్టుకు ఉండడానికి వీళ్ళ భార్యల్ని వెంట ఉండమనండి. కాని ఆ ఏడ్పులు పెడబొబ్బలు మాత్రం వద్దని చెప్పండి. వాళ్ళని ఊరికే మందలించొద్దని చెప్పండి.”

ఎర్రని రక్తం మరుకలున్న ప్రతిచోట తెల్ల పట్టిలు పడ్డయి. ఇద్దరికీ పెయి నిండా తెల్లపట్టిలే అయినయి.

నల్లని మనుషులను తెల్లపట్టీల్తో చూస్తే కడుపులో పేగులు దేవుకువచ్చినట్టయి నయి ఎల్లయ్యకు, లచ్చవ్వకు.

ఖోరుమన్నరు. డాక్టరు కోప్పడితే కుంపటోలె బాధను కడుపులనే కుక్కుకున్నరు.

★ ★ ★ ★

‘‘అల్లను నెలరోజులు దాక దావకాన్లనే ఉంచుమన్నడు డాక్టరు. మరి కర్సులకు పైసలియ్యన్రి’’ అడిగిండు గాలన్న.

‘‘యిపుడు పైసలు ఎక్కువలేవు. వారంరోజుల కోసం యీ పైసలు యిచ్చి రాపోన్రి. అలోపలనేను అటువోయే పనిగూడ వున్నది. అటువోయినపుడు నేను రాంగ అక్కన్నే పైసలు యిచ్చివస్త. అట్లనే ఒకసారి చూసినటు గూడ ఉంటది. అని ఏజెంటు కొంత పైకం చేతిలపెట్టిండు గాలన్నకు.

★ ★ ★ ★

ఏజెంటు పైసలు యిచ్చి పరామర్శించి వచ్చే బదులు, ఎందుకోగాని, డాక్టర్ను కలిసి, ఏదో మాట్లాడి, వాళ్ళను టిప్పర్లో వేయించుకొని, సైటుకు తెచ్చిండు.

‘వాయ్యో ! అంటు విలవిలాలాడిన్రు’ టిప్పర్లో సడుములు ఎత్తేసి.

రెండుమూడ్రోజులు విశ్రాంతి దొరికింది.

పనిచేసిన పానానికి అందరిని చూస్తూ కూలిపోతున్నదని విలవిలలాడిండ్రు. తిండి సయిపక కొట్టుకున్నడు. పనిజేత్తె ఏదన్న కొనుక్కొని తినచ్చని ఆశపడ్డరు.

★ ★ ★ ★

విశ్రాంతి తీసికొమ్మన్నా తీసికోక ఆరోజు మెల్లమెల్లగ పనిచేసిండు రాజయ్య.

మూడో రోజు ఉదయం రాజయ్య లేవకుంటయ్యిండు. లచ్చవ్వకు దావకాన్నుంచి తోలుకచ్చిన కాన్నుంచి బిక్కుబిక్కుమంటనే ఉన్నది. ఆరోజు రాజయ్య విడిసి పనికి పోబుద్దిగాలేదు లచ్చవ్వకు.

‘అంత ఎట్లనో అయితాంది’ అన్నడు రాజయ్య. లచ్చవ్వ మరింత భయ పడ్డది.

అందరు పనిమీదికి పోయిన్రు. అడివిల ఉన్నట్లనిపించింది లచ్చవ్వకు.

కాల్లు చేతులు విలవిల తన్నుకున్నడు రాజయ్య. మెడ లంకర పెట్టిండు. నాలుక కొరుక్కున్నడు.

ఏం చెయ్యాల్నో తెల్వక లచ్చవ్వ నెత్తంత కొట్టుకుంటు సైటుకెయి గావు కేకలు పెట్టింది.

తల్లితో పిల్లలు ఏడుపు అందుకొన్నరు.

అది విని వచ్చి 'అయ్యో! అయ్యో' అని దావకాన్లకు తోల్కపోదామని తయారవుతున్నరు గాలన్న, వీరయ్యలు,

వాల్లు చూస్తుండంగనే కాల్లుసేతులు బిగపట్టి, వనుకుతుండగ, మెడలువంకర తిరుగంగ, నాలుక్కరుచుకొని, కండ్లు తేలేసి వాళ్ళనే చూస్తూ ప్రాణం ఇసిండు రాజయ్య. టెటానస్ రాజయ్య ప్రాణం తీసింది.

'డాక్టరు వద్దనంగ ఏజెంటు తోలుకచ్చిండు'.

లచ్చవ్వ ఘోరుమంది. పిల్లలు గొల్లుమన్నరు.

లచ్చవ్వ ఏడుస్తుంటే వాల్ల కండ్లల్ల నీళ్ల తిరిగినయి. దుక్కంతో వాళ్ళ హృదయాలు బరువెక్కినై. నల్లనిరాల్లోలె నిలబడిపోయిన్రు.

వాల్లకండ్లల్ల తమవైపే చూస్తూ ప్రాణాలు విడుస్తున్న రాజయ్యనే కన్పిస్తున్నడు యింకా......

బరువైన నిశ్శబ్దంలో లచ్చవ్వ, పిల్లల ఏడుపు తప్ప ఏమీ లేదు. ఆ ఏడుపు సైటంతా యినపడుతున్నది.

అందరూ గుడిసె షెడ్డుకెయి చూసిన్రు.

సుడి గుండం లాంటి ఆ చూపులు తప్పించు కొనేటందుకే అన్నట్టు ఏజెంటు ఆ రోజు ఉనయమే పని పేరుమీద ఎటో వెళ్ళిండు.

* * * *

రాత్రి పొద్దువోయేదాక ఎవ్వరు నిద్రవోలేదు.

ఏజెంటు వత్తదేమోనని ఎదురు చూసిన్రు. ఆ చీకటిరాత్రి ఆ ఎదిరిచూసుడు తోనే గడిసిపోయింది. వాల్ల కండ్లల్ల కాలేసిన రాజయ్యనే మెదులుతాండు.

'అగో! ఆడే నన్ను జంపింది' అని రాజయ్య చూపులు వాల్లకు చెబుతున్నట్టని పించింది. లచ్చవ్వ ఏడ్పు వాల్లకు చెవులల్ల యింకా యినిపిత్తున్నట్టే ఉన్నది. తల్లి వెంటపిల్లలు యింకా బావురుమని ఏడుస్తున్నట్టే వాల్లమనుసుల్లో కనిపిస్తాంది. ఏం జెయ్యాలనేది ఆలోచించుకుంటనే మాగన్ను నిద్రవోయిన్రు. చీకటి పోలేదు ఇంకా తెల్లారలేదు. ఉలికిపడి లేసిండు గాలన్న మాగన్ను నిద్రనుంచి ఏదో

మర్సిపోయినట్టు.

అందర్ని లేపిండు.

'ఎన్ని రోజులే ఈపాడువడ్డ బతుకులు? నిన్నరాజన్న జచ్చిండు. యియ్యాల నేను జత్త. రేపునువ్వు జత్తవు. దీనికి యిరుగుడు మందు జూడాలె'

'ఏం జేద్దా మంటవె'

'మనకు సురేందరు సారు మునుపు జెప్పలేద! ఆసార్ జెప్పినట్టు చెయ్యక పోతే యిగ గుడిరేటట్టు లేదే.'

'ఏం తిండే అది? ఆ తిండి మనకు వట్టది. ఆ పైసలు కోసుడు వట్టది. మన పైసలు మనకు వారెయ్యాలె. మేమే అండుక తింటం అని జెప్పాలి.

"మనగ్గూడ యూనిట్ల సొప్పున కూలి గట్టియ్యాలె' 'ఎంత మొత్తుకున్నా ఈ కాన్నుంచి ఏడుగంటలకంటె ఎక్కువ పని జెయ్యద్దు."

'గీ పల్లెల కూలోల్ల తీర్గ కొట్లాడాలె. ఆల్లు సతెం మనకు మద్దతుయిత్తరు'.

పాడై పోయిన బత్తీలను సపలై చేసినోల్లను జేల్లెయ్యాలె''

''రేకుల షెడ్లు యెయ్యకున్నా యేసినట్టు, మందులియ్యకున్నా యిచ్చినట్టు, రాసి సంతుకం బెట్టే ఈ యింజనీర్ల దవురుజెన్నం యిగ సాగనిచ్చేది లేదు''

''ఆడు లేబరాఫీసరు ఆని తరపున్నే మాట్లాడె. అన్ని సక్కగ జెయ్యాలె.''

''మనవంటె గడ్డపారలు సతెం బెదురుతాన్నయి, యినాం లేకుంట పొడిసి పొడిసి సంపుతున్నరనిగని, ఈల్లు ఏడ బెదిరెటట్టున్నరు పాషానంగాల్లు''

''పాషానాలు సతెం మనకు బెదిరి పలుగుతాన్నయిగాని ఈల్లను కరుగ దీసుడైత లేదు.''

''గడ్డపారలతోటె యిగ ఆల్లను కరుగదియ్యాలె. పలుగ జీరాలె.''

''కలిసికట్టు గుండాల్నె యిగ''

''ఒక మాట మీద నిలవడాలె''

''ఏవన్నయితె అందరం గల్సి పని బందువెట్టాలె''

''చేసుకుంటె కుండగాలె లేకపోతెగు...గాలె ఎట్లనె''

''పుట్టిందోనాడు, సచ్చిందోనాడు, గద్దప్పతాది ఎన్ని దప్పినా సత్తె జత్తిమి. పోంగ ఏం గొంచవోతన్నం తియి! సచ్చేదాక కడుపు తిప్పలేనాయె. ఇగ సుకపడ్డదెన్నడు. గీ పాడువడ్డ బతుకులకు అపుడు సత్తేంది ఇపుడు జత్తేంది?''

''మనయి మొండి జీవాలు గాదె. గట్ల జచ్చేదుంటె ఎన్నడో సద్దుం గీ కటాలకు''

''మరి ఏమంటవె గాలన్న?''

"నేననేదేంది? మీరన్నదే నేనంటన్న.''

''కూలీలు పెంచాలె. మందులిప్పియ్యాలె. దెబ్బలు దాకుతె మంచిగయ్యేదాక దావ ఖాన్లనే ఉంచాలె. ఆ కర్సు ఆల్లే పెట్టుకోవాలె. పెంటన్ని మల్ల దావఖానకు దోల్కపోవాలె. అడ ఉన్నన్ని రోజులు, కూలి సతెం గట్టియ్యాలె"

''మంచి షెడ్డు ఏపియ్యాలె. ఆరానికో సీనిమ్మ జూపియ్యాలె."

గిట్ల రాజన్నాలె ఈకాన్నుంచి ఎవలు సావకుంట జూడాలె."

''యిపుడు రాజన్న పిలగాండ్లకు యిరువై ముప్పయి వేలు యియ్యాలె. ఆధారం జూపియ్యాలె.''

''రేపెవలన్న జత్తె గూడ ఆని పెండ్లాం పిల్లలకు యిరువై ముప్పయి వేలిచ్చి ఆదారం జూపియ్యాలె''

"ఎవలదాల్లను సంతం అందుకోనియ్యాలె''

"ఎవలి పైసలు అల్లకు అంగడి రేపనంగబట్వాడ వంచాలె."

''దేనిగ్గూడ పైసలు పట్టుకోవద్దు''

''జరమచ్చి పంటె కూలి గట్టియ్యాలె.''

''ఎవన్ని వెళ్లేది లేదు. కొట్టేది లేదు. అదోటి ఇదోటి మనకు పని జెప్పద్దు ఎంగిలి తలెలు గడుగు మనద్దు''

''జీపులల్ల యింజనీర్లు పెండ్లాలను దోలుకోని సినిమ్మలకోవుడు గాదు. ఆరానికోసారి అచ్చి మనమెట్లున్నమో జూడాలె''

కోడికూర తోటి, బీరుకేసులు, బిరండీ కేసులు కాలి జేసినట్లుగాదు. లంచాలు దినుకుంట, బరఫ్ మిషిని, పంకాలు, పట్టుచీరెలు, సైకిలుమోటర్లు కొన్నట్టుగాదు. బంగ్లాలు కట్టినట్టు గాదు. ఈ కాన్నుంచి గట్లజేత్తె ఊకునేది లేదు. యిదివారకు దిన్నదంత కక్కియ్యాలె.''

''గుత్తెదారుగాడు దెబ్బకు దిగిరావాలె మన దగ్గరికి మనం పని బందువెడ్తె.

ఒరిసోల్లు గూడ పని బందువెడ్తనన్నరు. ఇగ గట్లయితె మొత్తం పనే వంటది. పక్క పల్లెల్లోల్లు గూడ డబలు కూలిత్తనన్నా 'మీరు పని బందువెడ్తె గిట్ట పనికిరమ్మంటె పోం' అని మాటిచ్చిన్రు.''

''ఇగ గుత్తెదారుగాడు, యింజనీరు గాల్లు గాదు అల్ల తాతలు గూడ దిగి వత్తరు మనకాడికి"

"ఎవడచ్చినా మనను యిగ ఎవడేం జేయలేడు."

"తెగినోనికి తెడ్డే లింగం. యిగ ఎవడ త్తడో జూత్త మనను ఆపుటానికి"
"అదీగి నయన్ని యిచ్చేదాక పన్జేసేది లేదు. యింకోల్లను జెయ్యనిచ్చేది లేదు"
"కాల్వమీది లేబరు సంగం"

"వర్థిల్లాలె"
"కూలీలంతా"
"ఒక్కటే"
"గుత్తెదార్ల యింజనీర్ల దవురుజెన్నం, దోసుడు"
"నశించాలె"

కాల్వమీది లేబరు జీవితాల్లో తొలిసారిగ తొంగిచూసినట్టు ఆల్ల గుడిసెల మీది ఆకాశం ఎర్రపడ్డది.

—అయిపోయింది—

పిచ్చుక

మద్దూరు శ్రీనివాసులు

సరుకు
కొట్లోంచి, గూట్లోకి మళ్ళించారు
అడిగితే
అయిపోయిందంటున్నారు
'బ్లాకు'లో కొనడానికి స్తోమత లేదు
కొనకుండా బతకడం సాధ్యంకాదు.
ఏం చేయాలి పిచ్చుకా ?! ...
....
మేమేం చేయాలి ?
పిచ్చుక బదులు పలుక లేదు.
కిందున్న వడ్లగింజను పొడిచి
బియ్యపు గింజను ముక్కున కరచి
తుర్రుమని వెళ్ళిపోయింది.

కథలు:

గంగజిమ్మ

కాంతి

పచ్చగా ఒక గీత గీసినట్లు కన్పిస్తున్నది ఆవలివడ్డు - బీరమాయ గుట్ట కింది ప్రదేశం. గోదావరి నది ఇక్కడ ఆవలి వడ్డుకు ఈవలి వడ్డుకు నడుమ దాదాపు మైలున్నర దూరం వుంటుంది. బీరమాయ గుట్టకు కుడిచేతి వైపు వరుసగా మద్దిగూడెం, గంగపల్లి, రాళ్ళపేట వూర్లు వున్నాయి. ఈవలి వడ్డుమీద నుండి చూస్తే ఆ గ్రామాలు బొమ్మరిళ్ల లాగా కనిపిస్తున్నాయి. గుట్టమీద నుండి పోయె తోవకటీటు[1] పల్సగా వున్నచెట్లు - దిట్టంగా[2] పెరిగిన అడివి మ్యధన తోవ వున్నట్లు సాటి చెప్పుతున్నై.

ఇక్కడ గోదావరి పెద్దమలుపు తిరిగింది. పడమటి నుండి వస్తున్న గోదావరి ఎగువన మూడు మైళ్ల పైకిపోతే వూరెన్క గుట్ట, దుర్గం గుట్టలు రెండు దిక్కుల నుండి అడ్డం వచ్చినందుకు ఇరుకులో[3] పడి ఉత్తరంవైపు తిరిగి ఈ బీరమాయ గుట్టకు తాకి మళ్ళీ దక్షిణానికి మరలింది గోదావరి. వానా కాలంలో దుర్గం గుట్ట, ఊరెన్క గుట్టల నడుమ పెద్ద పెద్ద సుడులు తిరుగుతుంటై.

ఐతే ఈ సలికాలంలో గోదావరి నీరు తగ్గి సగమే పారుతుంది. దుర్గం గుట్టకు, బీరమాయ గుట్టకు నడుమ పెద్ద మడుగు[4] ఇప్పుడే కాదు ఎండా కాలంలో కూడా అంతే లోతువుంటుంది. ఈ మాగిలో[5] పొద్దుగాల బీరమాయ గుట్టమీంచి సూర్యుడు మీదికి వస్తుంటే ఆ వెలుగు గోదావరి నీళ్ళలో పడినప్పుడు ఆ నీళ్ల అద్దం లాగా మెరుస్తుంటయి.

గోదావరి బీరమాయకు తాకి దక్షణానికి తిరిగిన కాడ[6] ఈవలి వడ్డుకు అడివి నిటారుగా దిగిపోయిన వడ్డు కాడి నుండి దిగువకు పోయిన కొద్ది దూరం జరిగింది. అక్కడికి దగ్గర దగ్గర మైలున్నర దక్షిణానికి పోతే దంపాయ గ్రామం వుంటుంది. ఇది చాలా చిన్నవూరు. మొత్తం ఎనభై గుడిసెలుంటై. ఒడ్డుకు అడివికి చెరిసగాన[7] చాకలి వొర్రె పక్కకు ఎత్తు బోరు[8]- మాదిగబోరు, ఏడెనిమిది గుడిసెలుంటై. దాని ఎడమ పక్కకు కుంట కాలువ ఒర్రెతో కలిసే కాడా బోరు మీద మూడు బజార్లకటూ ఇటూ దాదాపు నలభై గుడిసెలు, ఉత్తరం బాజుకు[9] పెద్దచింత కింది దాకనే ఎక్కువ వుంటై. గోదావరి వొడ్డుకు - అడివికైను ఈవల రెండు చిన్న గుట్టల నడుమ కట్టిన చెరువుకుంటకు అడ్డంగా పదిగాల గుడిసెలుంటై. అక్కడిక ఫర్లాంగు దూరాన నిలువుగా దిగిపోయిన గోదావరి వొడెంబడి నిండుగా

---

1. దారికి అటు ఇటు ప్రక్కన 2. దట్టంగా, ఒత్తుగా 3. సన్నము 4. నీటిగుంట, 5. చలికాలము 6. వద్ద 7. మధ్యలో 8. మట్టిదిబ్బ 9. దిక్కుకు

గోదావరి పారుతున్నప్పుడు వానా కాలంలో ఒడ్డుజారితే ఆ గుడిసెలు ఎట్లుంటయో?- అనిపించేటట్లు వొడ్డుకు ఆస్ పదిహేను గుడిసెలు వున్నై. ఇవన్ని దొరచట్టపోల్ల[1] ఇండ్లె. చింతక్రింది కెల్లి బోరుమీదికి వస్తుంటే సర్కారు బాయి దాటినాక ఈమధ్య పెట్టిన ఆశ్రమ స్కూలు, మూడు బజార్లకాడవుంది. దానికి అటు ఇటూ పంతుల్లు వుంటున్నరు.

గోదారి వడ్డుకు అడివిలైనుకు నడుమ గోదావరి మలుపు కాడికెల్లి నిలబడి చూస్తే ఎంతదూరం చూసినా ఒకమైలు దాక పైలాయించిన[2] చేన్లే అగుపడ్తయి. ఒడ్డు పొడుగూత బైలే.[3] లైను అవల చిన్న చిన్న గుట్టబోర్లు, బైలావల గోదావరి. దానవతల మల్లికొంత దూరం బైలు మల్లి కొండలు-అడివి.

2

మాగిల ఒకరోజు బలుసంఖ చేల[4] కావచ్చు, పసులు అడివి జేరుకుంటున్నై. నిలివెడెత్తు పెరిగిన ఖింజొన్న[5] కర్రలు కనబడే కాడికి గోదావరొడ్డెంబడి వున్నై. వూరు చుట్టూ పెరిగిన జొన్నచేండ్లు వూరు కానరాకుండా జేసినై. అక్కడక్కడ గుడిసెల నుండి పొగఎల్లుతుంచే వూరున్నట్లు తెలుస్తుంది. నీళ్ళింకిపోయిన కుంట కింద యాబై ఎకురాల వరిచేండ్లు బీటలుబారి వున్నకాడా ఒకరిద్దరు తిరుగుతున్నరు. ఇది తప్ప పెద్ద అలికిడి[6] లేదు.

దాదాపు పదహారు - పదిహేడేండ్ల పిల్లవాడొకడు కుంట దాటి అడివిలో కొచ్చిండు. కొండ గొర్రెలాగా బెదురు కండ్లతో అటు ఇటు చూస్తూ ఎడమ చేతి దిక్కు అగుపడుతున్న[7] కచ్చడాల బాటెంబడి[8] వురుకు తున్నంతవేగిరంగా[9] నడుస్తున్నడు. పెద్దరాళ్ళ గుట్టకిందికొచ్చి ఒక్కనిముష మాగి అన్ని దిక్కుల ఒక్కతడువ[10] జూసుక్కున్నడు. అలికిడి లేదని చూసుకొని పిట్ట మాదిరిగా ఈల కొట్టిండు. కాసేపే అలికిడి లేదు. ఈ సారి ఇంకా గట్టిగా ఈల వేసి ఆగిండు.

గుట్ట లొద్దులో[11] కెల్లి ఈ సారి అటువంటి ఈలే యినొచ్చింది...కాదు, గుట్టలకు తాకి తిరిగొచ్చిన తన ఈల కాదు - ఇది తన ఈలకు జవాబు గొచ్చిన సైగే నని తెలుసు కొన్నంక లొద్దిలోకి నడిచిండు.

ఏడెనిమిది మంది పరికి పండ్ల తీగెల పొదల్లో ముదురాకు పచ్చబట్టలు - 'డ్రెస్సులు' వేసుకొని కూకున్నరు. ఒకాయన రెండొందల గజాల దూరంల కాలిబాట పక్కకు చెట్లచాటున రైఫిలు బుజాన బెట్టి తనకెయ్యి[12] చూస్తున్నడు. గుర్తు

---

1. కోయలలో ఒక తెగ 2. విస్తరించి 3. మైదానం 4. ఉదయం పదిగంటల సమయం 5. తెల్లజొన్న 6. శబ్దం. 7. కనిపిస్తున్న 8. బండ్లబాట 9. తొందరగా 10. ఒకసారి 11. గుట్ట లోయల్లో 12. తనవైపు

పట్టిండు - ఈరన్న... సెంట్రీగున్నడు. దళంలోని మిగతావాళ్ళు తను ఈరన్న పక్కపొంటి నడిసొస్తుంటే నవ్వి పలకరిస్తున్నరు. వాళ్ళు తెల్లందన్కా[1] నడిచినట్లు వున్నరు. అందరి మొఖాలలో అలుసటగుపడుతుంది.

ఇది చిన్నన్న దళం. దగ్గర కొచ్చినాంక చిన్నన్న పరుపుబండ మీద కూకున్నోడు లేచి కావలించు కొన్నడు పావురంగా.[2]

పల్కరించిండు "ఏం కామ్రేడ్ పాపన్న! ఏం సంగతి?"

బాబన్న ఒక పక్కకు కూసోని రైఫిల్ తుడుచుకుంటూ వున్నడు. పాపన్న (వచ్చినతన్ని) ను చూసి నల్లగా మసి అంటిన కుడి చేయి ఎత్తి పిడికిలి గట్టిగా బిగించి "లాల్ సలాం" అన్నడు. కడమోల్లు[3] కూడా 'లాల్‌సలామ్' చేసిండ్రు దానికి జవాబుగా పాపన్న అందరికి లాల్‌సలామ్ చేసి చిన్నన్నను ఒక పక్కకు తీసుకొనిపోయి ఏదో చెప్పిండు. చిన్నన్న తిరిగి దళం దగ్గరకు వచ్చి; "కామ్రేడ్స్ మన పాపన్న చాలా అవసరముండి వచ్చిండు. నేనువెంటనే ఆయనతో వెళ్ళాలి. మన అంకమ్మ చెల్లెలు దాదాపు మూడు వారాలకుపైన జబ్బుతో మంచం పట్టిందంట. మనం వచ్చినట్లు తెల్సి అవ్వ పాపన్నను నన్ను తోలుక రమ్మని పంపింది. ఇవ్వాల పొద్దటి నుంచి అంకులు అసలు కండ్లు తెరవనే లేదట! నేను మన చెల్లెను చూసి రావటం చాలా అవసరం మీరే మంటారు కామ్రేడ్స్?" అని అడిగిండు.

బాబన్నకు అంకులు చెల్లె ఆరోజు కట్టిచ్చిన సద్దిమూట యాదికి వచ్చింది. నడిజాము రాత్రిలేసి ఆ చెల్లి గట్కపిండి కల్పి రొట్టెలు చేసి, తనసులేపి, మొఖము కడగనీకి నీళ్ళ చెంబందించి ఎంతో పావురంగా రాత్రి మిగిలిన సద్దిబువ్వ కారం తొక్కుతో బెట్టి తినమని - నీళ్ళుతాపి తన దళంలో మిగిలిన వారికని రొట్టెలు పాత పేల్కలో కట్టిచ్చింది. తల్లి లాంటి ఆ చెల్లెకు ఏ జబ్బు పట్టుకుందోనని చాలా బాదపడ్డడు. ఈరన్న, వహీదు, సోమన్న, భీమన్నలకు కూడా ఈ సంగతి విని గుండెలవిసినట్లయింది.

సిమాంట[4] ఈపూరు వచ్చినప్పుడు అంకులే కదా క్యాంపోల్లు అట్లాయించినా[5]- వీల్లు తన పెద్దయ్య కొడుకులేనని చెప్పి - నమ్మించి ఊరు దాటించి చెరువవుతలి కందిచేను కాడికి తీసుకొచ్చి కూకోబెట్టి మల్లి కాసేపటికి బట్టలమూటలో బుర్ర[6] దాచి పట్టుకొచ్చి కడుపునిండా అంబలి పోసి-బద్రంగా తోలింది. ఆ చెల్లి సుడిబడ్డదని[7] తెలిసి చానా బాధనిపించింది. అందరూ చిన్నన్నవైపు చూసిండ్రు.

---

1. తెల్లవార్లు 2. ప్రేమగా 3. మిగతావారు 4. మొట్టమొదటి సారి 5. ఆపినా, అడ్డగించినా, 6. సొరకాయ ఎండిన తరువాత-దానిలోని గుజ్జుతీసివేసి పాత్రలా వాడుకుంటారు. 7. జబ్బుపడ్డది.

భీమన్న 'ఐతే కా|మేడ్ చిన్నన్న, ఈ నిర్బంధపు రోజుల్లో పట్టపగలు అదీ మనకు బాగా సంబంధమున్నదని శతృవుకు తెల్సిన వూరికి వెళ్ళడం |ప్రమాద కరమేమోనని నా కనిపిస్తుంది. అదయిన శతృక్యాంపు వున్నకాడికి అంత దగ్గరలో!' అనుమానంగా అన్నాడు.

ఒక్కక్షణం నిశబ్దంగా గడిచింది.

''అ మాట నిజమే! ఐనా కా|మేడ్ భీమన్నె అన్నట్లు ఆ |గ్రామంతో మనకు గట్టి సంబంధాలు వున్నై, పోతే పగలు వెళ్ళటంలో |ప్రమాదమున్నందుకు నా అభి|ప్రాయంలో రా|త్రిదాక ఆగి వెళ్ళటం మంచిది.'' సోమన్న తన సలహా చెప్పిండు. 'మీరేమంటారు కా|మేడ్ పాపన్న?' పాపన్నవైపు చూస్తూ.

'జబ్బు నా చెల్లెకే అయినా కా|మేడ్ చిన్నన్న లాంటోని మాటకొచ్చేసరికి అన్ని దిక్కులనుండి కొట్టిచూసి అప్పుడు ఏదోఒకటి చెయ్యాలి. తొందర చేస్తే నష్టమైనా ఐతది.' అని పాపన్న ఆగి ఆగి చెప్పిండు. కీడెంచి మేలెంచాలనే దోరణిలో.

వీరన్న లేచినిలబడి 'నిర్భంధ ముందని మన |ప్రజలను వదిలిపెట్టలేము కదా! మన అంకులు, కా|మేడ్ పాపన్న చెల్లె మన వుద్యమంలో ఈ చిన్నప్పుడే ఎంతో ఉత్సాహంగా ముందుకొచ్చేది, మనం మరిచిపోలేము. అంతకైతే కా|మేడ్ చిన్నన్నతో కల్సి ఇంకొకరు పోవచ్చు, పోవాలి! నేనే వెళ్ళివస్తా చిన్నన్నకు తోడుగా' ఉత్తేజంగా చెప్పి టక్కున కూర్చున్నాడు. కిందపెట్టిన తనసంచి వీపుపై పెట్టుకుంటూ అప్పుడే బయలుదేరాలన్న తన అభి|ప్రాయానికి కార్యరూపం ఇవ్వబోతున్నట్టు.

చిన్నన్న ఇంతవరకు ఏమి మాట్లాడకుండా వున్నాడు. |ప్రజలకోసమే పార్టీ-పార్టీదే దళం, ఆ దళం బాధ్యత తన మీద వుంచింది పార్టీ. దంపాయ |గ్రామం పార్టీకి గతకొద్ది సంవత్సరాలుగా పెట్టని కోటగా వుంది. ఈ |ప్రాంతంలో పార్టీ విస్తరణకే కాదు మొత్తం ఉద్యమానికే కేం|ద్రంగా వుంటూ వచ్చింది. అందులో పాపన్న కుటుంబం కృషి ఎంతో వుంది. యువజనోద్యమంలో అతి చురుకైన వారు... ఆర్థిక రాజకీయ తదితర రంగాలతోపాటు వైద్య అవసరాలలో కూడా |ప్రజల బాధ్యత పార్టీదే అవుతుంది. |ప్రస్తుత పరిస్థితిలో ఎంత చిన్న స్థాయిలోనైనా ఆ రకమైన సహాయం అందించడం తన కర్తవ్యం...నిర్బంధం వుంది, శతృ క్యాంపుకు అతి దగ్గరకు వెళ్ళాలి. పగటి సమయం! దాదాపు ముప్పావు మైలు మైదానం దాటి !!...

...|ప్రజలే విప్లవకారులు, విప్లవకారుల పాలిటి శిక్షణ కవచం! ఈ విధంగా రెండు విరుద్ధమైన ఆలోచనల నుండి చిన్నన్న |క్రమంగా తేలుకుంటూ ఒక నిర్ణయానికి వస్తున్న సమయానికి కా|మేడ్ వహీద్ తన అభి|ప్రాయం చెప్పాడు.

'చిన్నన్న ఇప్పుడే కామ్రేడ్ ఈరన్న చెప్పినట్లు ఇద్దరు వెళ్ళాల్సిన అవసరం నాకు కనిపించటంలేదు. వైద్యునిగా మీరేవెళ్ళాలి. కాని ఎటువంటి నష్టం జరగకుండా తిరిగి రాగలరా అనేదే నా అనుమానం.'

"ఒకవేళ నష్టమే జరిగితే పార్టీకీ-మీరు సేవ చేయాలనుకున్న ప్రజలకు నష్టమే కదా!— కాబట్టి చాల తూచి అడుగు వేయాలి" ఆఖరిగా బాబన్న అన్నాడు.

అప్పుడు చిన్నన్న "ఔను కామ్రేడ్స్! మీ అభిప్రాయాల సాయంతో నాకు అనిపించిందేమిటంటే నేను వెళ్ళవలసిన బాధ్యత వుంది. ఒంటరిగానే వెళ్ళాలి. ఎందుకంటే పగలు పోవాలి! ఏదైనా సమస్య ఎదురైతే జరిగే నష్టాన్ని సాధ్యమైనంత తక్కువయ్యేటట్లు ప్రయత్నించాలి. అన్నివైపులనుండి ఆలోచించినాంక ప్రజల సేవ కోసం కొద్దిపాటి ప్రమాదాల నెదిరించక తప్పదు అనిపిస్తుంది. అందుకే నేనొక్కన్నే వెళ్ళాలి. గ్రామంలో మనకు పూర్తి సహకారం వుంది. శతృవు ఎవ్వరూ లేరు. పైగా పైగ్రామంలో శతృవు నా రాక తెల్సుకొని వచ్చేలోగా ప్రజలకున్న వేలాది కండ్లు - చెవులు మెలుకువ వహిస్తూ పసికట్టగలవు. నాకు రక్షణ ఇవ్వగలవు. విప్లవ చైతన్యమున్న ప్రజలు అన్ని సాంకేతిక - ఆధునిక సౌకర్యాలు కలిగిన అభివృద్ధి నిరోధక శతృవుకన్నా చాలా బలవంతులు. నాకున్న ఇతర బాధ్యతలను మరవకుండానే ఈ విషయాలన్ని ఆలోచించి నేను కామ్రేడ్ పాపన్నతో ఒంటరిగానే వెళ్ళాలనుకుంటున్నాను. వీటిని దృష్టిలో వుంచుకొని మనమొక నిర్ణయానికి రావాలి" అని తన ఆలోచనలను అభిప్రాయాలను తనతోటి దళ సభ్యుల ముందు వుంచిండు.

కొద్దిసేపటిలోనే చిన్నన్న ఒక్కడే, అప్పుడే పాపన్నతో బయలుదేరాలనే నిర్ణయం తీసుకోబడింది. చిన్నన్నపోతూ "నేనువెళ్ళి సాయంత్రంకల్లా తిరిగివస్తాను. మీరు జాగ్రతగా వుండండి. కామ్రేడ్ బాబన్నా ! దళం బాధ్యత ఇకమీదే. నేను తిరిగి రావటం ఆలస్యమైతే కొంతదూరం వెళ్ళి నా కోసం ఆగండి. మన అంకమ్మ చెల్లి కాన్ప కోలుకోగానే ఈ సాయంత్రం వరకు అంతకైతే తెల్లవారే వరకు నేను వచ్చేస్తాను. ఇక వెలుతున్నాను. రెడ్ సల్యూట్స్!" అన్నాడు. తరువాత పాపన్నతోకల్సి "కిట్"(మందులసంచి) దీసుకొని, రివాల్వర్ నడుముకు కట్టి పైనంగా [1]అంగి [2]జారిడిచి [3]బయలుదేరిండు.

3

చెరువు కట్ట పక్కెంబడి నడుసుకుంటూ ఇప్పచెట్టు కిందికొచ్చి ఒకసారి ఆగి అన్నిదిక్కులు చూచి అంతా సరిగానే వుందని చూచుకొని పాపన్న ముంగట, చిన్నన్న వెంబడి నడువసాగాడు. వరిచేన్లు బీటలు బారి వున్నాయి. గట్లెంబడి ఇప్ప చెట్లు ఎండకు బిక్కు బిక్కుమంటున్నట్లు అక్కడక్కడా నిలబడి వున్నయి.

---

1. మీదుగా 2, చొక్కా 3. తొడిగి

ఊరు కడకు ఉత్తరం దిక్కు మూడు నాల్గుగుడిసెలు - జొన్నచేండ్ల గల్లెంబడి అటోటిటోటి[1] క్రర మొలిసినట్లు, వూరెన్క గుట్టకు కొంతదూరాన తేరాను బండ[2] ఉన్నట్టు, గొడ్లమంద పక్కకు మొండెడ్లు అటీటు తిరుగుతున్నట్లు, దళ వోల్లు పన్నకాడికి కొంతదూరంగా సెంత్రీ నిలుచున్నట్లుగా - ఆ గుడిసెలు వూరు పక్కకు ఉన్నై. అవిదాటి వాళ్ళు చింతచెట్టు కిందికెళ్ళి సర్కారు బావిదాక ఉన్న సందుకు అటీటు వున్న గుడిసెల్లో కడదాంట్లో కెళ్ళిరు.

చిన్న నాలుగు దూలాల పందిరి చుట్టు వున్న ఎనుగుకు[3] గుజ్జుకొయ్యలు[4] దీసి పాపన్న వాకిటిలోకి అడుగు బెట్టిండు. చిన్నన్న గవల[5] కాడ ఆగి ఒకసారి అటు ఇటూ చూసుకొన్నడు. లోపలికెల్లి వాకిట్లో ఒక మూలకున్న నీళ్ళ బడ్డి[6] కాడ పాపన్న కాళ్ళు కడుగుతున్నడు. చిన్నన్న కిట్ కిందబెట్టి అక్కడికిపోయి పాపన్న చేతి చెంబందుకొని తను కాళ్ళు కడిగిండు. కండువతో మొకం తుడుచుకుంటూ వచ్చి కిట్ అందుకొని పాపన్న తడక జరపగా లోపలి కొచ్చిండు. పాపన్న కన్నా పెద్ద వాడైన సర్సన్న తన భార్యా బిడ్డలతో కల్సి ఆ గుడిసెలోని మూడవ వంతు వరకు తడకలు కట్టి విడిగా వుంటున్నాడు. పాపన్నకు ఇంకా పెండ్లి కాలేదు. తల్లి, ఇద్దరు చెల్లెండ్లు, తనూ నాల్గవ వంతు ఐన తమ భాగంలో వుంటున్నారు. ఇంటెన్క నుండి తడకలు కట్టి ఆరేడు మూరల ఆ అర్రను[7] అన్న ఉంటున్న భాగం నుండి వేరు జేసుకున్నరు.

లోన చీకటి. అందులోనే ఒక మూలకు చిన్నపొయివుంది. చిన్న సులక మంచం వేసి వుంది లోపలిగోడ కానించి. మంచం పటంగా రెండు మూరలజాగే మిగిలింది. పాత సులక మంచంలో లొట్టబోయిన[8] కండ్లు మూతబడి చాలా బల హీనంగా తయారైన అంకమ్మ చినిగిన చెద్దరు కప్పుకొని పడివుంది. చిన్నన్న జప్పున[9] బ్యాగ్ తీసి ఆల[10] తీసిండు. నడుముకున్న వాచి తీసి చేతికి పెట్టుకుంటూ గబగబా పరీక్షించిండు. మట్ట[11] బట్టి నాడి పరీక్షించిండు. తరువాత ఆల మెడకు ఏల్లాడదీసి చేత్తో అంకులు చెల్లెలు డొక్కలో ఒత్తొత్తి జూసిండు. సంకలో మీటర్ (థర్మామీటర్) బెట్టి కాసేపాగి దీసి చూసిండు. జాడిచ్చి మల్లా డబ్బల బెట్టిండు. ఆ చెల్లెని ఎల్కల[12] పండుకోబెట్టి మోకాల్లకాడికి కాల్లుమలిచి పడుకోబెట్టి మల్లి డొక్కలో ఎడమబాజు, కుడిబాజుకు తన చేతి ఏల్ల తోని పొడిచి పొడిచి చూసిండు. బోర్లపడుకోబెట్టి మల్లి ఆల చెవులకు బెట్టి ఏదో

---

1. అటు ఇటు 2. ఊరుపక్కకు ఉన్న ఒక పెద్దరాయి పేరు 3. కంచెకు 4. వాకిలి తలుపుకు బదులుగా వాడే ఒక పక్కకు జరుపుకునే కొయ్యలు 5. కడప 6. నీళ్ళ కుండలు పెట్టెటందుకు చేసిన స్టాండు 7. గది 8. లోతుకు పోయిన 9. తొందరగా 10. స్టెతస్కోపు 11. మణికట్టు దగ్గర 12. వెల్లకిల

ఇనుకుంటూ జరుపుతూ, తీస్తూ వున్నడు. తన ఎడమచేతి ఏల్లను అంకమ్మ ఈపుపై పెట్టి తాపుకొకసారి ఎడమబాజుకు ఒకసారి కుడి బాజుకు సంతలో కుండను కొట్టిచూసినట్లు కుడి చేతి చూపుడేల్లతో కొట్టి కొట్టి చూసిండు. కొట్టిచూడంగా ఏదో ఇన్నడు. చెయ్యి చెద్దరు కిందికెల్లి తీసి గోర్లొత్తి చూసిండు. కంటిరెప్పలు కిందివి కిందికి ఒత్తిచూసిండు. సంచిల బ్యాట్రిలైట్ తీసి కండ్లల్ల గొట్టి అటిటు జరుపుకుంటు చూసిండు. అరిపాదాలు ముందుకు వత్తి చూసిండు. మల్లి ఆలబెట్టి గుండె చప్పుడు ఇన్నడు.

గిర్రున తిరిగి సంచిల చెయ్యిపెట్టి సూదుల పెట్టె తీసిండు. పాపన్నను పిలిచి ఒక తెల్లగంజు[1]లో మంచినీల్లు పట్కరమ్మన్నడు. పాపన్న ఉర్కిపోయి నీల్లు పట్టుకొచ్చిండు.

చిన్నన్న పెట్టెమూత తీసి సూదులు పిచకారి[2] వేరువేరు చేసి గిన్నె నీల్లలో ముంచి గిన్నెకు మూతబెట్టి ఇగ పొయిమీద పెట్టమన్నట్లు సైగజేసిండు. ముసలి తల్లి పొయ్యి ఊదబట్టింది.

చిన్నన్న సంచిలకెల్లి ఇంకేంటెంటియో సీసాలు డబ్బాలు బయటకు తీసిండు. బాగా మసిలిన తరువాత సూదులు పటకారు[3]తో బట్టి తీసిండు. ఏవోరెండు సీసాల మందులు అండ్ల గుంజిండు. సూది ఇచ్చిండు. ఇంతసేపు సైసప్పుడు చెయ్యని అంకులు ఏదో మూల్గినట్టుచేసింది.

బారెడు పొద్దుండంగ అంకులుకు చెమటలు పోసినయి. రెండు మూడు సూదులు ఏసినంక పెంకోలె కాల్తున్న పెయ్యి[4] చల్లబడ్డది. ఆలబట్టి చూస్తున్నడు చిన్నన్న.

మల్ల ఏదో సూదిచ్చిండు. అప్పుడు తేరిపారి జూస్తే గడపలకాడ శానమంది నిలుసున్నరు. అతనికి కూడా చెమట బట్టింది. కండువకు తుడ్సుకున్నడు. గడపలకాడ కూడిన జనం అతనటు వస్తుంటే అటీటు జరిగిండ్రు. కొద్దిగా గాలాడింది. అతడు లేచి బయట కొచ్చిండు.

"ఆసం చిన్నవ్వో... ఓ యాలమ్మొదినో! మీరంత గడపల కాడికెల్లి జరుగుండ్లి." వస్తూ వస్తూనే అన్నడు నర్సిగాడు. చిన్నన్న "నిజమే మనోడు చెప్పేది అంకులుకు గాలి ఆడకుండా చెయ్యకండి" అనివచ్చి యింటి బయట అరుగు మీద అందరి మధ్యలో కూకున్నడు.

"నిజమే నాయన నీ కడుపు సల్లగుండ! మేమంత నీ కోసం రోజు చూసుకుంటూనే వున్నాం ఇగ వత్తావని. ఇన్నాల్ల కొత్తివి. ఇగ మాకేఫికరు[5] లేదు. నీ

---

1. అల్యూమినియం గిన్నె 2. సిరంజి 3. ఫోర్‌సెప్ 4. శరీరం 5. చింత (విచారం)

చేతుల బడ్డది. ఇగ అంకులు సావదు" అనుకుంటు ఆసమోల్ల చిన్నవ్వ చిన్న చిన్న పిల్లగాండ్లను జరుపుకుంటూ చిన్నన్న పక్కకొచ్చి కూలబడ్డది.

ఇంతలో ఏదో గ్యాపకం వచ్చినట్టు అలమోల్ల నర్సిగాడు ముందుకొచ్చి తన మెడ మీద బల్లుచ్ఛ (తామర) చూపెట్టిఒత్తుడుకీస[1] మందు చిన్నన్న ఇస్తె అకు డొప్పలో బట్టుకున్నడు.

"మనకిదేం చచ్చేకాలమొచ్చింది చిన్న? నీ జాడ జెప్పమని మల్లారం క్యాంపోల్లు పొద్దుగూకులు ఊర్మీనబడి సంపక తింటండ్రు. మొన్ననే బడె సత్తయ్యను బట్కపోయి నీజాడ జెప్పమని ఆరం రోజులు కేంపులుంచి సత్తయ్య కొడుకు కర్రమీద దుబ్బగుడెం పోయి సంపాయించుకొచ్చిన ఇన్నూరి త్తె[2] ఇడసబెట్టింద్రు. సిమాంట దళమొచ్చినప్పుడు బువ్వపెట్టినమని చెప్పి హరిగోస బెట్టిన సంగతి నీకెరుకేనాయె. గప్పుడు ఇంటికి ఐదు రూపాయలు పసూలు జేసింద్రు. ఆరంరోజుల కింద కమ్మరి మల్లయ్య పెద్దమేకపోతు మందతో తిరిగి రాలేదు. కేంపోల్లు కోసుక తిన్నరని తెల్సి అడగబోతే తన్ని ఎల్లగొట్టింద్రు. తల్సుకుంటే కడుపు బగ్గుమంటది. మేమైతే చిన్నా, కోసినా నీ జాడ, దళంజాడ చెప్పలేమనుకో. మీరు శేబట్టి ముత్యం చుక్కయ్య చేండ్లల్లకెల్లి తిప్పనపల్లిబోయే కచ్చులాల బాట మనకు దక్కింది. వాని కంచె తీకి బండ్లు నడిపినప్పటి సంది పొగాకు తోటలల్ల పోయెటోల్లకు జీతాలు బెరిగె. మీరు లేకుంటే ఆ సైకోని[3] మాముల్లు పుల్లెర, నాగటిపన్ను కట్టలేక సచ్చేది..." అంది యాలమ్మొదిన.

"అడివి నరికి మన బొక్కదొర కుంటల ముప్పయి ఏండ్ల తర్వాత మనం దున్నుకోగలిగేదొదినా?... మనూళ్ళ ఆ సైకోడు కస బిస[4] పండ్లు కొరికిండు. కట్టెబండ్లు పట్టుకుంటా నన్నడు...రేంజర్ని తోల్కచ్చిండు - పోలీసుల దెచ్చిండు. ఎన్నో జేసిండు. కాని చిన్నన్న దళ పోల్లొచ్చి వాడ్ని ఒకసారి పట్కపోయి పెయ్యి కున్న కొవ్వు కరిగేదాంక అడవిలో కట్టేసెసర్కి, మనమంత గల్సి పట్టిచీరిన మాభూమి ఒదలమని ప్లాంటేసను పీకి యాభై అరకలు ఏకం గట్టి నిలుసుండేసరికి వానికి బుద్దొచ్చింది—గది చెప్పరాదొదిన" అని నర్సిగాడందుకుండు.

నర్సిగాడు చెప్పుతున్నప్పుడు బయట బజార్ల సైకిల్ గంటి మోతినచ్చింది. ఆ ఘంటి ముంగటికెల్లి సాలెసాంబయ్య ఝుయిమని సైకిలెక్కి ఎస్క బట్టలమూట బెట్టుకొని నింషంల దాటిపొయిండు.

చిన్నన్న లేచి ఇంట్లకుపోయి అంకులు కండ్లు తెరిసి మిట మిట జూస్తుంటే "ఇప్పుడెట్లున్నది చెల్లి!" అని పల్కరించిండు. పాలిపోయిన మొఖం మీద నన్నగా

1. మందుట్యూబ్ 2. రెండుపందలు 3. చౌకిదారు, ఫారెస్టుగార్డు 4. పటపట

నవ్వు—దూరం బీరమాయ గుట్టమీద చెట్ల సందులకెల్లి అగుపడే కచ్చులాల బాట తీర్గ, నడిగోదాట్ల దూరంగా చిన్నగ కండ్లబడే సూరన్న నావలాగ, ఆకురాలంగ నిలుసున్న బరిబాత చెట్లల్ల అక్కడోటి అక్కడోటి మోదుగులకున్న ఎర్రటి మొగ్గ ల్లాగ, దుక్కిబట్టిన నడిపన్న నల్లటి పెయిమీద మెరిసే చెమట తీర్గ ఆ నవ్వు వెలి గింది. "మంచిగున్నన్న" సన్నగ పల్కింది అంకమ్మ.

చిన్నన్న అవ్వనుపిల్చి దగ్గరకూకోబెట్టి సంచిల డబ్బుల వెత్కి తగురాల మాతర్లు తెల్లటివి, నల్లటివి, ఎర్రటివి రంగురంగుల గోలీలు మూడు నాల్గురకాలై అవ్వచేతికిచ్చి "ఇదోటి ఇదోటి ఇదోటి పొద్దటీలి-ఈ మూడు, పగటీలి-మూడు, మాపటీల నిదురబోయే ముందు ఐద్దినాల దన్క వర్సతప్పకుండా ఇవ్వాలి. ఈ మాతర్లు ఈ రాత్రి కొద్దిగా బువ్వ తినిపించి అటెన్క ఇచ్చెయి. ఇవన్నీ అయిపోయి నంక ఈ నల్లటి మందుగోలీలు పద్దినాల్ దన్క రోజుకు మూడు ఇవ్వాలి. ఇవ్వేగాలి తగలకుండా చూసుకోవాలి. ఇదిగో ఈ సీసల బెట్టిచ్చిన గోలీ ఇచ్చినప్పుడు దీసి మల్ల గట్టిగా మూతబెట్టుంచు."

అవ్వ మర్చిపోకుండా రెండు మూడుసార్లు జెప్పిండు.

మంచం మీద పడుకున్న అంకమ్మ చెద్దరుమీదబడి ఇంకాపైకిపోతూ ఇక్కడ ఆగనంటున్నట్లు దగ్గరేసిన తడక సందుల్లకెల్లి సన్నగా ముగ్గేసినట్లు అవత లి గోడ మీద పడుతుంది- ఎర్రటి వెలుగు. చిన్నన్న బయటికివచ్చి చూసిండు. పచ్చగా చెర్వుకటీటు చెర్వేనక ఎంత దూరం జూసినా కనిపించే అడివిలో తలెత్తి నిల్చున్న ఊరెన్క గుట్టసాటుకు సూర్యుడు పడమటికి జారిపోతున్నడు.

4

చెర్వు కట్టకాడ దుమ్ము లేచింది. గొడ్లు మర్లినయా?

కాదు.

కాకి బట్టలు- చిప్ప టోపీలు- పోలీసులు

ఆ దుమ్ము భూమి డొక్కలో రాక్షసుల బూటు తన్నులతో లేచింది. ఎర్రని సూర్యుడు ఒంటరి వాడైనట్లు అడివి దిక్కు గుట్ట చాటుకు దాగాలని ప్రయ త్నిస్తున్నట్లు వున్నడు. అటు మాదిగ గుడిసెల తోవ పొంటి ఇంకో గుంపు రెండు దిక్కుల కెల్లి ఊర్లె కొచ్చిన్రు. టక టక బూట్ల చప్పుడు. అంతెత్తు లేచే దుమ్ములో కూడా వాల్ల చేతుల్లోని తుపాకులకున్న బయనెట్లు తల్కున మెరుస్తున్నయి.

మూడు బజార్ల కాడ బడి దగ్గర రెండు గుంపులు కల్సినయి. మొత్తం ఇర్వయి మంది వుంటరు. మూడు పట్టీల మేజర్‌గాడు బాగా తాగివున్నట్లు వున్నడు.

కండ్లు ఎఱ్ఱగున్నై, మాటలు ముద్దబడుతున్నై. బొఱ్ఱమీద బెల్టు నిగ్గి[1] కట్టిండు. నోట్ల సురుగు పెదిమల కొసల కాడికి కారుతుంది.

ఆ వూరు దొర చట్టపోల్ల వూరు.

దొర చట్టపోల్లు

దొరలే రైతులు-రైతులే దొరలు. దొరలే పెద్దలు. చేతి బలం కొద్ది ఐదెకురాలో పదెకురాలో అడివి కొట్టి బయలు జేస్కున్నరు. చేతైన కష్టం జేస్తారు. పండింది తింటరు అయిపోతే అడివి పడ్తరు. ఇప్పపువ్వు, తునికిపండ్లు ఏర్క తింటరు. పై వూరి సాపుకార్లు- ముత్యం చుక్కయ్య లాంటి భూస్వాముల, పెత్తందార్ల కాడికి కూలికెల్లినా ఇంతవరకు వారికి లొంగిపోలేదు. పెత్తందార్ల ప్రభావం నుండి ఆ అమాయకులు తప్పుకోవటమెలా? ఇప్పుడిప్పుడే తెల్సుకుంటున్నారు.

అదో చిన్న వూరు. పెత్తందార్లులేని వూరు. అందుకే ఈ వూరంటే క్యాంపు కమాండర్ హవల్దార్ మేజర్‌కు ఒల్లు మంట. దిక్కులేని అడివి మనుషుల- 'మర్యాద' తెలియని జంగ్లి పసుల వూరని అతని అభిప్రాయం.

"ఖైన్‌కే-లా...గాల్లు! ఎటు బోయిన్రు రా అంతా? హరాంకా బచ్చా" ఉరిమిండు మేజర్. పనులనుండి తిరిగొస్తున్న బుడ్డగోసి గోండు జనం ఒక్కొక్కరే వచ్చి జేరుతున్రు మూడు బజార్లకాడ. పెద్ద మనుషులు ఏల్లే- అడివి బిడ్డలు.

మాంజి[2] చెప్తె ఉర్కిపోయి మంచందెచ్చి బజార్లో ఏసిండు బొక్యన్న. మేజరు కూకున్నడు- కూకున్నడో కూలబడ్డడో అందులో

"నక్సలైట్లను దాస్తున్నార్రా? బడివె కోర్లు మీరు! కమ్యూనిస్టులకు మీరు బువ్వ బెడ్తర్రా?"

అదివరకే ఇర్వై మందిదాన్క జమ[3] అయిన్రు జనం. ఎవరూ పల్కలే. పోలీసోల్లు మంచాని కటీటు నిలబడి మిట మిట చూస్తున్రు. ఐదార్గురు మంచాని కెదురుగా కూకున్న మందిల వచ్చి నిలబడ్డరు.

"ఇన్నాల్లకు మీ పని ఐతదిరా! బాడ్కావ్‌లు, మీరు సర్కార్‌తో గెలుస్తార్ర? నక్సలైట్లను పిలిపిస్తార్ర వూల్లె, మాకేలాడె"- హవల్దార్ అన్నాడు.

కూటికే సస్తుంటిమి - మాకే దిక్కు లేదాయే... నక్సలైట్ల సంగతి మాకే మెరుక..." మాంజి ఇంకేదో చెప్ప బోయిండు.

చిన్న పంతులు (హాస్టల్ వార్డన్) అటే వస్తూ ఈ మాటలు విని "హవల్

1. గుంజి కట్టి (గట్టిగా బిగించి)
2. ఊరి పెద్ద (కులపెద్ద) 3. పోగవ్వడం, కూడిన్రు.

దారుగారు నక్సలైట్లు ఈ చిన్న వూర్లకెందుకు వస్తారు? వచ్చినా పట్టుకోవల్సింది మీరు. వూరి వాల్లను ఇట్ల దబాయిస్తే ఏమన్నట్లు?" అని అడిగిండు.

కండ్లతోనే నమిలేసేటట్లు అటు జూసిండు హవ్వాల్‌దార్ "ఓ పంతులు! నీ పని ఏదో నువ్వు జూస్కో. సర్కార్ జీతం తిని ఊరోల్ల దిక్కు పల్కుతవా?- మా పనికి డిస్టబ్ చేస్తే నువ్వే నక్సలైట్లకు సాయం జేస్తున్నావని రిపోర్టు రాస్తా! ఈ ఉద్యోగం పీకిస్తా! జాగ్రత్త! చల్లగుండదలుస్తే మా డ్యూటీలో, మారెడ్‌లో ముక్కు దూర్చకు...హాఁ!"

పంతులు అక్కడ వుండలేక ఆశ్రమ స్కూలు వైపు నడిచిండు.

"హాఁ! డాక్టరు రాలేదురా బోసిడికే - మీ వూళ్ళె! సాలె సాంబయ్య వచ్చి గంటయినా కాలేదు. వాన్ని రెండేసి 'నక్సలైట్లకు క్యాంపు ఇన్‌ఫర్‌మేషన్ ఇస్తున్నావ'ని బెదిరిస్తే 'నాకేమి తెలియదు సార్, బట్టలమ్మి వూరూరు దిరిగి బత్కెటోన్ని అని పదిరూపాల మామూలిచ్చి' దంపాయ వూల్లె ఇప్పుడే డాక్టర్ను జూసినసార్ - జమదార్‌సాబ్, నన్నట కాయించకుర్రి' అని కాళ్ళమీద బడితే ఇడ్సబెట్టిన. ఇంక ఆ లం...కొడుకుపోయి అర్ధాగంట కాలేదు! వాడు వుత్త పిరికి ముండా కొడుకు - నిజమే చెప్పి వుంటడు. రాలేదురా డాక్టర్ మీ వూల్లే? ఎవలింట్ల దాచిర్రో చెప్పుర్రి బతకబుద్ధుంటే......లాభం లేదు. వీల్లట్ల జెప్పరు... సీధి వుంగ్‌లీసే ఘీనహీ[1] నికల్‌తా. ఉంగ్లీ తేడా కర్‌నా పడేగా'... నాయక్! నీ సెక్షన్‌ని అటు చెరువు కట్ట దిక్కున గుడిసెలకు 'లీడ్' చేయి! ఒక్కొక్క ఇల్లు 'సర్చి' చేసుకుంటూ రావాలి. ఆ డాక్టర్‌గాడు వుండే వుంటడు. ఇంత తొందర్లో పోలేడు — మనం టూవే - ఎన్ సర్కిల్'[2] జేసినం...పోలేడు. చీకటి కాక ముందే పట్టుకోవాలి.... దొర్కుతే మనకే 'రివార్డు' వస్తది"... "సెక్షన్ వన్! మూవ్... సెక్షన్ టూ! నాతో పాటే వుండండి" అని ఆర్డరిచ్చిండు. మంచంకాడ నిలబడ్డ జవాన్లలో ఓ పది మందిని వెంటదీస్కోని నాయక్ చెర్వు కట్టదిక్కుపోయే తొవ్వలో ఎల్లిపోయిండు.

నడిసి నందుకు అలిసిపోయిన జవాన్లలో కొందరు వూరోల్లతో కల్సి కూసు న్నోల్లు మేజర్‌వైపు విచిత్రంగా చూసిర్రు. వాళ్ళలో ఒకడు:

"మేం లేకుంటే - మాగార్డు లేకుండ దొడ్డికైనా పోడు!...వీడు నక్సలైట్లను బడ్తడట !!' ఇంకొకడితో మెల్లంగన్నడు. పక్కనే కూకున్న సర్సిగాడిన్నడు... నవ్వాపు కున్నడు.

సిగిరేటు వెలిగించిండు, ఆ ప్రయత్నంలో ఐదారు అగ్గిపుల్లలు పాడు జేస్కున్నడు 'మేజర్' ఏదో వాగుతూనే వున్నడు తనకుతానే.

---

1. చక్కగా పెట్టిన వేళ్ళకు వెన్నంటదు - వేళ్ళు వంకర చేయాలి - అనే సామెత (హిందీలో). 2. రెండు వైపులనుంచి చుట్టి వేత.

మాంజి కండ్లతోనే ఏదో సైగ జేసిండు నర్సిగానికి చుట్టూవున్న పోలీసులకు అనుమానం రానీయకుండ. నర్సిగాడు మంచినీళ్ళ బావికాడికెల్లి ఇటే వస్తున్న పుల్లైద్దుకు అడ్డందిరిగి అటే, చింతచెట్టుకేయి గెదిమినట్టు తను అటే దానెంటే పోయిండు. అటు నీళ్ళ కావడితో వస్తున్న పాపయ్య, ఇంటి గవలకాడ నిలుసున్న పెంటన్నలకు నర్సిగాడు కండ్లతోటే ఏదో చెప్పిండు. పాపయ్య బాయికాడికి వచ్చి కుండలు దించి తాడు - బొక్కెన బాయిలేసిండు. పెంటయ్య ఇంట్లకు బోయి నారేపనార[1] పట్టుకొచ్చి అటు నర్సిగాడిటు పాపయ్య కనబడేటట్టు ఇద్దరికి చెరిసగం దూరంలో కూసున్నడు. చేతుల్లో వున్న నారతో వెలుగు సవరించుకుంట కట్టుడు మొదలు బెట్టిండు.

సెక్షన్ వన్ కడ గుడిసె కాన్నించి ఒక్కొక్క గుడిసెలో దూరి వెతుక్కుంటూ మూడు బజార్లకాడి కొచ్చింది. బడి అవుతల అబ్బన్న గుడిసెలోకి పోయి బయటి కొచ్చెలోగా పాపన్న నీళ్ళకావడి బుజాని కెత్తిండు. పెంటన్న లేచి చింతచెట్టుకేయి నడిచిండు. పాపన్నతో గుసగుస ఏదో చెప్పిండు. అతని సంచందుకొని బిరబిర నడిచి ఇంటెన్క ఎన్గు దునికి కండ్ల నీరు పెట్టుకున్న అవ్వతో, తెల్లగా జూస్తున్న అంకులుతో ఏదోచెప్పి కుడిచేతితో నడుముకున్న రివాల్వర్‌ను తాకి చూసుకున్న చిన్నన్నను తనవెంట రమ్మన్నడు.

పాపన్న ఇంట్లోకొచ్చి తల్లితో ఏదోచెప్పి మందు గోలీలన్ని తీసుకొని నీళ్ళ కావడి కుండలను బడ్డిమీద బెట్టి ఉత్తకుండలు పెట్టుకొని బయటి కొచ్చిండు. అక్కడ వచ్చి నిలబడ్డ పెంటన్న చేతికి ఆ మాతర్లు ఇచ్చి ముందుకు సాగి పోయిండు. పోలీసోల్లు ఈ బజార్ల యాలమోల్ల ఇల్లు వెతికి ఇటే తన ఇంటివైపే వస్తూ ఎదురైంద్రు. పెంటన్న మల్లి ఎనుగ్క నారకట్టు కడుతున్నడు. పాపన్న పక్కకు జరిగి నిలుసున్నడు.

సెక్షన్ ఇంచార్జి అతని వైపు పురుగును చూసినట్లు చూసి దాటి పోయిండు. పాపన్న సర్కారు బాయికాడికొచ్చి మల్లి నీల్లు చేదబట్టిండు. అతని ఇల్లు 'రేడ్' అవుతుంది.

పుంచాట్ల వున్న పీనుగలాగా అంకమ్మను చూసి అసహ్యంతో మూతి మీద దస్తిగప్పి నాయక్ లోపలికి తొంగి జూసిండు. ముసలవ్వ కుండలకాడ బెదురు కండ్లతో కూకున్నది. "ఇద్దరాడోల్లే సార్" జవాన్ మాటవిని ఎన్కకి తిరిగి బయటకు వస్తూ నాయక్ నీట మునిగి తేలినోనోలే పెద్దగా ఊపిరి పీల్చుకున్నడు. ఇంకా ముందుకు సాగిండు ఈ బజార్ల మిగిలిన రెండుమూడు గుడిసెల వైపుకు— జవాన్లు వెంటరాగా.

---

1. అడివిలో వుండే పెద్దేపచెట్టు నార, తాడులాగ ఉపయోగ పడ్తుంది.

5

చిన్నన్నను తనవెంట దీసుకొని నర్సిగాడు జోన్న చేండ్లల్లపడి ఇండ్ల వెనక నడుసుకుంటూ చెర్వుబాజు కడయింటికి దళగట్లోల్లింటికి దబ దబ పోయి సంచి నడింట్ల బెట్టి ఇంటాయనతో "సమ్మన్న! పోలీసోల్లు ఇటు చూసి పోయిండ్రు.ఇప్పుడు చింతకింది గుడెంలున్నరు. మా వొడ్డు గుడానికి యిగ పోతరు. చీకటైనంక చిన్నన్నను మాదడపచేను[1]కాడ మంచెదాక నువ్వు ఎడగొట్టి రావాలి కాసేపాగి" అని చెప్పి చిన్నన్నవైపు ఒకసారిజూసి గబగబ వచ్చిన దిక్కే వెళ్ళిపోయిండు. నర్సిగాడెల్లిన దిక్కు జూస్తూ నిలుసున్న చిన్నన్నకు చీకటి ముదిరిందని నర్సిగాడు చీకట్ల కల్సిపోతుంటే అర్థమైంది.

నడింట్లో నెగడి వెలుగుతుంది. దొర చట్టపోల్లకదే దీపం. వాళ్ళు గట్టిగ నమ్మే వాటిల్లో అడివి వాళ్ళదెనన్నద దొకటి. అందుకే ప్రతిఇంట్ల నెగడివుంటుంది, దీపం వున్నా లేకున్నా. కిర్సనాయిలు బుడ్డి, లాంతర్లకు నూనె పిరమే[2] గాని అడివిలో కట్టెలకు కరువులేదు. సైకోని బయానికి మొదట దడిసినా దళం వచ్చిన కాన్నించి అడివి వాళ్ళదే అయింది.

సమ్మన్న తన ఏడాది నిండని బిడ్డ పారుతుందని[3] చెప్పిండు సన్నని గొంతుతో.సమ్మన్న భార్య ఇస్తారక్క బిడ్డను ఎత్తుకచ్చి చిన్నన్న ముంగట కూకున్నది. ఇస్తారక్క కండ్లల్ల ఆ చీకట్ల-నెగడి గుడ్డివెలుగులో కూడా మెరుస్తున్న కన్నీళ్లను చిన్నన్న చూడగల్గిండు. అందులో కదుల్తున్న రెండు మంటలు. మాటలు లేవు.

చిన్నన్న మెల్లగా మందు సీసా దీసి ఏదో మందుగోలి దంచి అందులో ఏసి-సీసను బాగ ఊపి ఇస్తారక్క చేతికిచ్చిండు. "కాపిస్క[4] తో రోజునాలుగు సుట్లు[5] గుడుపాలి[6] మందొడిసే[7] దాక"ని చెప్పిండు. అప్పుడే కొద్దిగ తన చేతులతోనే తాగించిండు.

ఇంతలో గుడిసె బయట అడుగుచప్పుడైంది. సమ్మన్న సప్పున లేచియటికి పోతూ తడక బెట్టి వాకిట్లో నిలబడ్డడు. ఇస్తారక్క లేచి సంకల బిడ్డను గడంచల[8] పండుకోబెట్టి నెగడి కట్టెలు గుంజి మంట తగ్గించింది. గుడిసెంత ఇంకా చీకటైంది. సంచిని గుడిసె ఎనక దిక్కు తడక దగ్గర బెట్టి మొగరానికి[9] కట్టిన నారకట్టు విప్పి తడక సందుజేసింది. చిన్నన్న యింటెన్కకు పెరట్లకు పోవటాన్కి దారిజేస్తూ. ఇదంతా జేయడానికి గడియ పట్టలేదు.

చిన్నన్నను అవసరమొస్తే తప్పించటాన్కి ఆమె చొరువ-ప్రయత్నం...

---

1. ఒంట్రడు మట్టి చేను 2. అధిక ధర కలది 3. విరేచనాలు 4. కొపిచుక 5. సార్లు 6. త్రాగించాలి 7. మందు అయిపోయేవరకు 8. ఒకరకం మంచం 9. నిలువుగా పెట్టిన కర్రస్థంభం.

చిన్నన్న మనుసు కృతజ్ఞతతో నిండిపోయింది. బిడ్డకన్నా ఉద్యమం ఉద్యమకారు లంటే ఇస్తారక్కకు ఎక్కువ .సదువు సాత్రములేని దోపిడికి నలిగిపోయిన ఆ గిరిజన కుగ్రామంలో పుట్టి పెరిగిన ఈ కోయతల్లి......! కాదు' వచ్చింది పోలీసులు కాదు... సమ్మన్న తమ్ముడు బొక్కన్న. సమ్మన్న లోపలికొచ్చి చెప్పిండు. ఇస్తా రక్క అంతా సదిరింది మల్లా. తడక కట్టు కట్టి నెగడి మంటజేసి బిడ్డ నెత్తుకుంది. చనుపాలు ఇవ్వసాగింది కూసోని. చీకటి బాగానే అయింది.

ఊరులోని అన్ని యిండ్లు వెతికి అలిసిపోయిన పోలీసుపార్టీ అక్కడే మకాం చేసింది ఆ రాత్రి ఆశ్రమస్కూల్లో. చెంద్రన్న వచ్చి ఈ సంగతి జెప్పిండు 'డాక్టర్ దొరకలేదని, కల్లైనా కావాలని కెంపోల్లడిగింద్రట'ని కూకొని సుట్టకాల్చుకుంటూ నెగడికాడ. సమ్మన్న ఒకచేత సంచందుకొని ముందు నడువంగ చిన్నన్న ఎంబడొచ్చిండు. జొన్నచేండ్లల్ల సరసర సప్పుడు కాంగ నిలువెత్తు చేండ్లల్ల అగుపడకుండా నడుస్తూ ఉత్తరం దిక్కు అడివి గోదావరొడ్డు కలిసేకాడ ఒర్రెదాటి దడప చేసు మంచెకాడ ఆగింద్రు. నర్సిగాడు మంచెదిగి వచ్చి సంచందుకున్నడు.

'అంతాసరిగ్గానేవుంద'ని సమ్మన్న నిలుసుంటె "నీ బిడ్డ కక్కుడు పారుడు రెండొద్దుల్లో ఆగుతది. మందు సరిగావాడాలి. నువ్వెక పోయిరా సమ్మన్న"ని పిడికి లెత్తిండు చిన్నన్న. జవాబుగా సమ్మన్నకూడా లాల్‌సలామ్‌చేసి వెనక్కు తిరి గిండు. చీకట్లకల్సిపోతున్న వైపుచూస్తూ మంచెక్కసాగిండు. చిన్నన్న, తెల్లటి గోచిగుడ్డ కట్టుకొని అదితప్ప ఆ సలికాలంల ఏబట్టలులేని సమ్మన్నను. వేగుసుక్క లాగ వెలుగుతున్నడు సమ్మన్న.

సరసర కర్రలు కదిలే సప్పుడువిని గోదారిలో వార్రెకలిసే దిక్కుచూసిండు. చిన్నన్న నెత్తిమీద సదిమూట బట్టుకొని చెంద్రయ్య మంచెకాడి కొస్తున్నడు. నర్సిగాడు "నీకు నాకు ఇక్కడే వచ్చింది చిన్నన్నసద్ది" అంటూ మంచెమించి మూటందు కొని నెగడి (మంచె మీద మట్టిపోసి తడికకాలకుండా ఏర్పాటుచేసుకొన్న నెగడు) కాడబెట్టి చెంబందుకొని బర్రెకాడికి పోయి 'చెలమ' నీళ్ళతో మొకం కడిగి చెంబులో పట్టుకొచ్చి కూకున్న ఇద్దరు; తెల్లందాక జీవరాసుల[1] తరుముకుంటూ కూసున్నరు సద్ది తిన్నంక. పక్కచేన్ల ఎవరో పాడుతున్నరు చిరుతలదరువు లో

"పల్లె సీమల దొరలభూములు
భూమిలేని వారికిచ్చి
మిక్తి ప్రాంతం నిలుపుకుంటూ
పట్నాలను చుట్టుముట్టి

1. అడివి జంతువులు

అంతిమంగా గెలుచుకోరన్న...
అనుమాన పడక ప్రజలరాజ్యం నిలుపుకోరన్న!!
ముక్తిపోరుల ముందుకురకన్న!!
శత్రుబలమూ క్షుద్రమేరా
చీలిపోయి వున్నరయ్యో
ఏకమయ్యీ పేదలంత
కొత్తదెబ్బ కూల్చడయ్యా
ఎర్రదండుతో కలిసికదలన్న
అనుమాన పడక ముక్తిపోరుల!!
అటు దూరంగా-ఊరిదిక్కు నుండి
"గార్డ్ హోశియార్!
...థమ్ కౌన్ ఆతాహై...! వినబడ్తుంది పోలీసుల కేక.

మంచె దిగి అడివిదిక్కు నడువసాగిండు చిన్నన్న. గోదావరిలో అప్పు డప్పుడు చాపలెగరంగ 'బుడుక్' మనిసప్పుడు వినబడ్తుంది.

వేగుచుక్క బారెడెక్కింది.

బోనస్

పులుగు శ్రీనివాస్

ఆ రాత్రి...గాఢమైన చీకటి రాత్రి...

దట్టమైన నల్లని పొగమంచు, ఆకాశాన్నంతా కప్పుకు పోయినరాత్రి...

ఎక్కడో దూరాన ఓ కుక్క 'బోరు'న ఏడుస్తోంది ఫ్యాక్టరీ ధ్వనుల్ని చీలుస్తూ చుక్కలు - చెమర్చిన కన్నీటి చుక్కల్లా మెరుస్తూ మిణుకు మిణుకు మంటున్నాయి. అక్కడక్కడ గుడ్డిగా వెలుగుతున్నయి లైట్లు దీనంగా.

ఆకాశం నించి - ఏ ఆశా పొందలేని దిక్కులు, చీకట్లతో బావురు మంటు న్నాయి.

భూమి - తన ప్రకృతి ధర్మాన్ని నిర్దేశిస్తోంది. మనుషుల్లో - క్రూరత్వాన్నీ తారతమ్యాన్నీ, మోసాల్నీ, అన్యాయాల్నీ కసిగా ఉసిగొల్పుతోంది.

భయంకరమైన చీకటి సత్యాల్ని నిర్దయగా కాలరాస్తోంది.

వణికిస్తున్న ఆ చల్లని గాలిలో ... ఎవరూ లేని ఆ రోడ్డుమీద ... అంత రాత్రి...పిచ్చిగా పరుగులుతీస్తున్న అడుగులు... శారీరక బలాన్నీ, మానసిక స్తిమితాన్నీ కోల్పోయి, గుక్క తిప్పుకోలేని వెక్కిళ్ళతో, కన్నీళ్ళతో - చంకలో పాపతో, పిల్లలతో—చొక్కిపోతూ, సోలిపోతూ, ఊగిపోతూ—పిచ్చిగా...పిచ్చి పిచ్చిగా...పరుగులు తీస్తున్న స్త్రీ అడుగులు-

'దబ్...దబ్...దన్...దన్...' ఫ్యాక్టరీలమోత.

నల్లత్రాచు లాంటి గొట్టాల్లోంచి వెలువడే పొగ – నాలుకలు చాచి విషం కక్కుతూ చీకట్లో కలిసి పోతోంది.

ట్యూబులైట్ల వెల్తుర్లో మిలమిల మెరుస్తున్న "విజయా కేబుల్స్ (ప్రయివేట్) లిమిటెడ్" బోర్డుముందు - ఒక్కసారి... అణుచుకున్న వుద్వేగమంతా పేలిపోయినట్లు, గేటు చువ్వల్లోంచి ఏడుస్తూ, వూపుతోందా స్త్రీ.

చంకలోంచి పాప ఎలా జారిపోయిందో—కిందబడి ఏమైందో తెలీనట్లూ... మిగిలిన పిల్లలు తన్నుచూసి ఎలా భయపడి భయంకరంగా అరుస్తున్నారో పట్టనట్లు...ప్రతిసారీ...వొంగి వొంగి...వూడ్చి వూడ్చి దుమ్మెత్తి పోస్తోంది. అర్థం కాని ఆవేశంతో. తన్నింత వరకూ పట్టించుకోని మనుషుల్ని అసహ్యించు కుంటోంది. బూతులు తిడుతోంది నిస్సహాయంగా.

"మీ మీన మన్నుబొయ్యరో..."

"మీ దినాలు, వారాలు గానురో..."

"మిమ్ముల్నెత్తుక, కట్టుక బోనురో..."

"ఓర్ లంజకొడుకుల్లారో!...తలుపుల్దియ్యుర్రో..."

ఒకటే అరుపులు.

2

"చంద్రంసాబ్!..."అన్నాడు అటెండర్. 'చంద్రంగారూ! మిమ్మల్ని మేనేజర్గారు పిలుస్తున్నారు.' అన్నట్లు.

"నన్నా" అన్నాడు చంద్రం ఆశ్చర్యంగా.

"హా"నంటూ వెళ్ళిపోయాడు అటెండర్

ఆశ్చర్యంనించి తేరుకుని, ఆలోచన్లో పడ్డాడు చంద్రం.

"మర్లేమైనా తప్పుడు సాక్ష్య మిప్పించి, ఎవర్నైనా పన్లోంచి తీసెయ్యడు గదా! ఏ చిక్కుల్లోకి తోయడు గదా!!

పాపం! కరీం కెంత అన్యాయం జరిగిందని!. ఆ రోజు ... గుండెలవిసేలా బాధపడ్డాడు. "తనకేం తెలీదనీ, తన్ను తీసెయ్య కండనీ" మేనేజర్ కాళ్ళపైబడి

గొంతుపగిలేట్టు ప్రాధేయ పడ్డాడు.

"అతన్ని ఊస్ట్ చేసిన రోజున— తనావిషయం పూర్తిగా తెలిసికోక ముందే, మేనేజ్‌మెంట్ తొందర పెట్టడంవల్లా, ఆ ఇద్దరి నాయకులపై నమ్మకంవల్లా, ఏం చేయలేక తలూపాల్సొచ్చింది.

"వరుసగా నాలుగు మిషన్స్‌లో పి.వి.సి. ముక్కలతో కలిపి మేకులు వేశా డనీ, అవెందుకూ కొరగాకుండా పోయాయనీ, ... అంత నష్టాన్ని తెచ్చిన మోస గాణ్ని - మరీ పన్లోకెక్కించుకుని, వ్యాపారాన్ని చెడగొట్టుకోకుండా, వెంటనే తీసే స్తున్నాననీ—....గొంతుచీలేలా, ఆగకుండా అరగంటసేపు అరుస్తూ యెగిరెగిరి పడ్డాడు మేనేజర్.

"కానీ—నిజం ఆలస్యంగా తెలిసింది. కరీం చెల్లి—ఫోర్‌మన్ డబ్బుకి లొంగలేదనీ...అతని పశుత్వంపైకి చెప్పు విసిరిందనీ...ఆ రోజునించి అసలు విష యం ఎవరికీ చెప్పకుండా పని మానేసింది. ఫోర్‌మనే మనుష్యులతో చిన్న మేకులు వేయించీ, రెండ్రోజులు మిషన్స్ ఆపు చేయించీ, పెద్దగా గొడవలేపాడు. బెంగు ళూరు నించి స్పెషల్ మెకానిక్‌లను పిలిపించాననీ, అన్నీ కొత్తపార్ట్స్ వేయించాననీ, అందుకు చాలా డబ్బు ఖర్చయిందనీ-నానా అబద్దాలాడాడు.

దీని వెనుక మేనేజర్ హస్తం వుండకుండా వుండదని అన్పించింది. తన భార్య కమలకీ విషయం చెప్పినప్పుడు, ఆమెకళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. జరి గిన యీ అన్యాయానికి ఎంతగా అంగలార్చిందనీ "తమ బతుకులు కూడా ఎప్పుడో ఒకప్పుడు అలాంటి అన్యాయానికి గురై చితికి పోవాల్సిందేకదా? "అని ఎంతగా కుమిలిపోయిందని.........!"

ఒక్కసారి భారంగా నిట్టూర్చాడు చంద్రం.

"అయ్యో! వెళ్ళాలికదా?" అనుకుని, తన మిషన్నొక మారు చూసుకు న్నాడు-బాగానే నడుస్తుంది... ఇప్పుడే టిగేం ఐపోదు......

"అరే రంగా! మాల్ (పి.వి.సి. ముక్కలు) ఐపోంగనే మళ్ళనింపు. జాగర్తగా సూత్తుండు...జెప్పునమల్లొత్తగనీ...ఆఁ...." అంటూ తన హెల్పర్‌కి చెప్పి వెళ్ళిపోయాడు చంద్రం.

మేనేజర్ గది ముందుకెళ్ళి, తలుపు అద్దంలోంచి చూశాడు లోపలికి. "నీ కోసమే చూస్తున్న!" అన్నట్లు తలనొకమారు ముందుకు కదిలించాడు మేనేజర్.

స్ప్రింగ్ డోర్‌ని నెమ్మదిగా నెట్టుకుని లోపలికెళ్ళి-వినయంగా నమస్కరించి నించున్నాడు చంద్రం.

మేనేజర్ - చూడ్డానికి సన్నగా, పొడుగ్గా అందంగా వుంటాడు: కళ్ళ

ల్లోంచి వచ్చే చూపుల్ని తీక్షణంగా ఒకే దగ్గర ప్రసరిస్తే-యెదుట నించున్న మని షికి తేళ్ళూ, జెర్రులూ పాకినట్లుంటుంది.

అతడి నోటినించి వచ్చే ప్రతీమాటా దాదాపు 420 కిలోవాట్స్ శక్తితో-360 క్వింటాల్స్ బరువుతో మీద బడినట్లుంటుంది.

కానీ-అతడి అవసరాన్నిబట్టీ, ఎదుటి మనిషి భీరుత్వాన్నిబట్టీ ఫాటిసుపయో గిస్తూ వుంటాడు.

చిన్నగా నవ్వుతూ— "ఏం లేదురా చంద్రం! ఈ సంవత్సరం బోనస్ విషయం మాట్లాడుదామని పిలిపించాను. ఈ షిఫ్ట్ లీడర్‌వి. నీతో చెప్పాలికదా?... ఇంతకుముందే మన సేట్ ఫోన్ చేశారు. —'బోనస్ 10%ఇవ్వమని' లాస్టియర్ చెప్పాంకదూ? ఈ ఏడు యివ్వలేక పోతున్నా మళ్లీ వచ్చేఏడు తప్పకుండా20% ఇస్తామని" కాని ఇవ్వలేక పోతున్నందుకు విచారిస్తున్నాంరా! ఎంత ప్రయత్నించినా కుదర్లా. అంతగా లాభాలురాలా, నష్టాల్లోనే నడుస్తుంది ఫ్యాక్టరీ. అలాంటప్పుడు మేంవేం చేయగలం చెప్పు?... మీరుబాగా కష్టపడి పంచేస్తే వచ్చే సంవత్సరం తప్పకుండా యిస్తాం. ఈ విషయం అందరికీ చెప్పి, మళ్లీ సాయంత్రం కన్పించు..." అంటూ మేనేజర్ తన పైళ్ళ అడివిలోకి దూరిపోయాడు పులిలా. ఏం తోచని చంద్రం—మళ్ళీ తిరిగి రావాల్సిన అవులా వెళ్ళిపోయాడు.

తన మిషన్ దగ్గరకెళ్ళి తడిమి చూసుకున్నాడు చంద్రం సాలోచనగా. బాగుంది...ఒక్క వైర్ కట్టవుతే, తనచేతినరం తెగినంత బాధ పడుతాడు. ఏ పనైనా మనస్ఫూర్తిగా చేస్తాడు. "మనం చేసే ప్రతీపనికీ న్యాయం చేకూర్చాలం" టాడు అమాయకంగా.

చంద్రం ఆలోచనలు—తన పెద్దకూతురివైపు మళ్ళాయి. "పెద్దదయి నాలు గేళ్ళయిండె. ఆడపిల్లల్ని ఎక్కువకాలం ఇంట్లో వుంచుకోవడం అంత మంచిది కాదంటారు. దాని పెళ్ళి చేసి పంపిస్తే తన నెత్తిమీద బరువు సగం దిగిపోయి నట్లవుతుంది. చివరిదాని పెళ్ళికిప్పుడేం తొందరలేదు. చాలా చిన్నపిల్ల. మిగిలి నిద్దరూ మగపిల్లలు. వాళ్ళెలాగూ బతగ్గలరు, ఏ కూలోనాలో చేసుకుని. "ఇప్పుడు దొరక్కదొరక్క మంచి సంబంధం దొరికింది. అది తప్పిపోకుండా యీ ఆషాడ మాసంలోనే పెళ్ళిచేయాలని నిశ్చయించుకున్నాడుకూడా." ఐతే...తన వూహలు నిలువునా కూలి పోయాయి.

3

"గిర్.......ర్.......ర్" న బెల్ మోగింది.

లంచ్ టైమ్.

అందరూ— పంపు దగ్గర చేతులు కడుక్కుంటున్నారు.

చంద్రం–కొంచెం ఆలస్యంగా బయటికొచ్చాడు.

మొహం విచారంగా వుంది.

"యేంభాయ్! అట్లున్నవ్? మేనేజర్ పిల్సినట్టుంది. యేం జెప్పిండేంది?" అంటూ అందరూ చుట్టుముట్టారు.

ఉలిక్కిపడిన చంద్రం తేరుకుని, "యేం లేదు భాయ్ మనందరం ఆశపడ్డదంతా వొట్టిదేఐంది. "సరింగ లాబాలు రాలేదనీ, ఈ యేడుగూడా 10%బోనసే యిత్తాననీ–యింగేం మాట్లాడకుంట దీసుకుని, ఇగనుంచైనా కస్టపడి పంజేత్తే–వొచ్చే యేడు ఎక్కువిత్తననీ"...సెప్పిండు. అంతే..." అన్నాడు ఓ విధమైన చిరాకుతో.

"ఇగనుంచైనా కష్టపడాలంటే...మనఁవీ సమచ్చరం కస్టపల్లేదనా వీసత్తం? యేఁవైనా యీతాప వీసంతుసూడాలింగా." అన్నాడు జాన్ కోపంగా.

"పెతీయేడు యేవో తాంపులుజెప్పి తప్పిచ్చుకుంటాడు. నేనిన్నేండ్లాయెగాని పంజేయబట్టి. ఒక్కతాపగూడ పిడికెడు పైసల్దీసుకోలే వీంతాన. ఈ తాప మాత్తరం వూరుకునేది లేదు..." అన్నాడు మల్లయ్య బొంగురుబోతున్న కంఠంతో.

"యేంది! వీనింట్లకెల్లిత్తాండట్నా? యేకుపుగొట్టు లంజ కొడుకు! సమచ్చరమంతా కస్టపడి లచ్చలరూపాయల్లాభం దెత్తే-వీడిచ్చేది 10% బోనసట్నా? సీ సిగ్గులేదు వుండకోరు ముండకొడుక్కు......అరే! వీని కూకుంటాంటె బాగ లాగఁవైతాందిరో!......" అన్నాడు రాజన్న. ఆవేశాన్నింకా ముందుకుతీసికెళ్ళి మండిపడ్తూ.

"ఇగో! సెంద్రన్నా! నువుగనక దానికొప్పుకుంటే- మమ్ముల్నందర్నీ అన్యాయం జేసినోనివైతవ్. మనం నిజంగా రాత్రనకా పగలనకా కష్టపడతలేఁవా? మీఘుగ్గురు లీఢర్లు గట్టిగ నిలబడుండ్రి; ఎనుకమేఁవుంటంగని. అక్కెరైతే స్రైకుజేసి పని మానేద్దాం, గని-మీరు పట్టు సడలింద్రో... మేఁవంతా వుత్తోల్లఁవైతం, "మేమంతా వొప్పుకుంటలేఁవనీ, తప్పకుంటా 20% బోనసియ్యవల్సిందేననీ, ముందటిడోలె యీయేడేం జాగదనీ... గట్టిగజెప్పుబోయి......" అని తుది నిర్ణయమిచ్చాడు జోగులు, పక్క కంపెనీలో మొదలైన స్రైకును గుర్తుచేసుకుంటూ.

ఇలా తలా వొక మాటలో-తమ తమ కోపాల్నీ, అవసరాల్నీ, దీనత్వాల్నీ బాధల్నీ...తెలియజేశారు.

చంద్రం సాంతంగా విన్నాడు. విని అర్థం చేసుకున్నాడు. తన బతుక్కంటే వాళ్ళవేం మెరుగ్గాలేవన్న సంగతి అతనికి తెలుసు. పట్టుదలగా పిడికిళ్ళు బిగించి, యేదోస్థిరంగా నిర్ణయించుకున్న వాడిలా ఒక్కడుగు ముందుకేసి "నేను

గప్పే అనుకున్న. ఈ యేడు వీంతో తాడో పేడో తేల్చుకోంది యిడిసిపెట్టేదిలేదు. నేనిప్పుడే బోయి సెప్పొత్త. మీరు తిని మీపండ్లోకి మీరు బోండ్లి. వాడినకుంటె యెనుకసీరి సూద్దంగని......" అంటూ చెంద్రం గబగబా వెళ్ళాడు మేనేజరు గదివేపు.

4

"ఈరోజు సాయంత్రం 5 గంటల 30 ని॥లకు ఆఫీసు గదుల వెనుకున్న పార్కులో మీటింగుంటుంది. మేనేజరుగారు మాట్లాడుతారు... మీరంతా హాజరు కావాలి!!..." అని ప్రకటించారు, ప్రతీ సెక్షన్‌లోని సూపర్‌వేజర్లు.

బోనస్ గురించే మాట్లాడతాడన్న విషయాన్ని అందరూ వూహించగలిగారు. ఎవరి ఆలోచనల్లో వాళ్ళు మునిగిపోయి, వారి వారి పనుల్లో నిమగ్నులయ్యారు.

చంద్రం ఆలోచనలు తీవ్రరూపం దాల్చాయి. అతడి కళ్ళు ఏకదీక్షగా తన మిషన్ని పరిశీలిస్తున్నాయి.

తీగ-ఒకగిట్ట (తీగ చుట్టబడిన పరికరం) నించి వెలువడుతూ, ఎర్రగా కాలే మిషన్‌లో, చిక్కని ద్రవంగా వున్న ప్లాస్టిక్‌ని పూసుకుని, చల్లని వాటర్‌ట్యాంక్‌లో గట్టిపడి, రెండోగిట్టకి చుట్టుకుంటోంది ఇన్సూలేషన్ వైర్‌గా.

పక్కమిషన్-ప్లాస్టిక్ పౌడరుని పి. వి. సి. ముక్కలుగా తయారుచేసి, దీనికి సరఫరాచేస్తోంది. ముందుసెక్షన్‌లో-పూర్తిగా తయారైన వైర్‌ని ఆడవాళ్ళు ప్యాకింగ్‌చేసి లారీవాళ్ళ కందిస్తున్నారు.

వెనక సెక్షన్స్‌లో—తీగను శుభ్రం చేయడం, ట్విస్టింగ్‌చేయడం, గిట్టలకి చుట్టడం జరుగుతోంది.

కరెంటు ఆధారంతో నడిచే మిషన్లూ-మీటలకలవాటుపడ్డ చేతులూ, బరువుల కలవాటుపడ్డ తలలూ, మాటలకలవాటుపడ్డ మనసులూ, అనుకోకుండానే ఆలోచన లేకుండానే పనులని నిర్వర్తిస్తున్నాయి, ఉత్పత్తులు పెంచేస్తున్నాయి.

అక్కడ-మిషన్లకీ, మనుష్యులకీ తేడా కన్పించదు.

వాళ్ళు మరమనుష్యులు, వాళ్ళవి యాంత్రిక జీవితాలు.

5

సాయంత్రం-

కార్మికులందరూ పార్కులో గుమిగూడారు, కాసేపు మిషన్స్ ఆపు చేసి. పార్కుని దూరం నించి చూడ్డమే తప్ప, వాళ్ళు సామాన్యంగా అందులోకెళ్ళరు. వెళ్ళాలని కోరికున్నా తీరికుండదు. తీరికున్నా అర్హతుండదొక్కోసారి! దాన్ని మధ్యనే అభివృద్ధి చేశారు. చుట్టూ ముళ్ళ కంచె... ఒక క్రమంలో క్రోటన్స్ మొక్కలూ, మధ్యలో గరికా, చెట్లూ- అందంగా వుంది.

కార్మికులంతా గరికపై కూర్చున్నారు. మేనేజర్- బాదం చెట్టు కానుకుని నించున్నాడు...ఒక్కసారి కళ్ళజోడు సరుకుని, చేతులు కట్టుకున్నాడు యెంతో సంస్కారంగా.

వాతావరణం- తుఫాను ముందున్న ప్రశాంతంలా మారింది.

"కార్మికులారా! మిమ్మల్నందర్నీ సమావేశపర్చిందేమంటే...ప్రధానంగా... ఈ సంవత్సరం వచ్చిన లాభనష్టాల గురించి చెప్పి, మీ బోనస్‌ని డిక్లేర్ చేయడమే. నేను చెప్పబోయే విషయాలన్నీ మీకు తెలిసినవే. ఐనా నా బాధ్యతగా మళ్ళీ చెబుతున్నా...ప్రతీ సంవత్సరం లాగే యీ సంవత్సరం కూడా మీ పనుల్లో ఏమీ అభివృద్ధి లేక పోగా... కొందరి కక్ష్యామోసాలతోనూ, అసమర్ధతతోనూ నాలుగు మిషన్స్ పాడయ్యాయి. దీనికి ఉదాహరణగా... మీ సోదరుడు కరీం- రన్నింగులో ఉన్న మిషన్స్‌లో దొంగచాటుగా మేకులు వేసి, బోల్డంత నష్టాన్ని తెచ్చి, ఈ మధ్యనే ఊస్ట్ ఐన సంగతి మీకందరికీ తెలిసిందే...

"అంతే గాకుండా యీ యేడు లాభాల కంటే, నష్టాలే ఎక్కువగా కన్పిస్తున్నాయి. మన సేటు గారి కుటుంబం విదేశ యాత్రలు బోవడం, వారి పెద్ద కూతురి వివాహం జరగడం యీ యేడు ఖర్చే. ఈ పార్కు వేయించడం, మీకు షెడ్ వేయించడం, ఆఫీసు గదుల్ని ఎయిర్‌కండీషన్డ్‌గా మార్చడం, మూడు కొత్త మిషన్స్ తెప్పించడం కూడా ఈ యేడు ఖర్చే.

"ఇలా ఏదో రకంగా మీకూ, ఫ్యాక్టరీకే వుపయోగిస్తున్నాం వచ్చే ఆదాయాన్నంతా. బోనస్ ముందేడు మీకు 20% ఇస్తామన్నా- యీ యేడు ఎంత ప్రయత్నించినా 10% కంటే ఎక్కువియ్యలేక పోతున్నాం. కాబట్టి...మీరు మా ఇబ్బందుల్నీ, కష్టాల్నీ అర్థం చేసుకుని, మాతో సహకరించి, ఈ బోనస్‌తోనే సంతృప్తి చెందుతారనీ, ఎంత చెట్టుకంత గాలి వుంటుందన్న విషయాన్ని గుర్తిస్తారనీ ఆశిస్తున్నా...

"పక్క కంపెనీలో కార్మికులూ, దుందుడుకు వాదులూ- ఎవరైనా మన సామరస్యాన్ని చెరపాలనీ ప్రయత్నిస్తే- మీరు వాళ్ళకి వ్యతిరేకంగా వుంటూ- మీ పనులు మీరిలాగే కొనసాగించి ముందుకెళ్ళాలనీ, వచ్చే యేడు తప్పకుండా 20% బోనసిస్తామని నమ్ముతున్న-

"ఈ వారం రోజుల్లో మీ జీతాలతో పాటు బోనస్ కూడా యివ్వడం జరుగుతుంది. ఇక మీరే రకమైన గొడవలు చేయకుండా- నిశ్చింతగా- మీ మీ పనుల్లోకి వెళ్ళొచ్చు..." అంటూ వలని గప్పున పైన విసిరిన వేటగాడిలా, స్పీడుగా నిట్టూర్చాడు మేనేజర్.

కార్మికుల్లో కలకలం బయలు దేరింది.

"మేం కష్టపడి పంజేయకుంటె యీయనేవన్నా జేత్తాండా?" అన్నా రొకరు.

"పెతి సమ్మచ్చరమున్న బారతంవే గతి, యీ యేడేం కొత్తా? ఈ తాపేం పూరునేది లేదని, సెప్పండ్లహాం..." అన్నారు మరొకరు.

"ఇప్పుడు మా అందరి తర్ఫు నుంచి సెంద్రన్న మాట్లాడాలే..." అంటూ అందరూ కేకేశారు. వాళ్ళ ప్రోద్బలం, అవసరం, ఆతృతా-తన బాధ్యతా ముందుకు నెట్టాయతన్ని.

చంద్రం లేచి నించున్నాడు. అతడిలో శాంతీ, ఓపికా పూజ్యమై ఆవేశం, అసహనం ప్రత్యక్షమయ్యాయి.

"అయ్యా! తంవరు పెతి సమ్మచ్చరం ఇట్నే అంటాంద్రు గానీ...మా కొక్కసారి గూడా 20% బోనసియ్యలే. నస్టం...నస్టం...అంటనే...కొత్త మిసన్లూ, తోటలూ, పెండ్లిండ్లూ, తీర్థాలూ, బంగ్లాలూ...లచ్చల రూపాయల కర్సుతో శేత్తారు. మరవన్ని మా కస్టంతో వొచ్చిన రూపాయలూ...లాబాలూ...గాకుంటే యెక్కడియంటరు? మాట వరసకంటా... సేటు బిడ్డ పెండ్లికి బెట్టిన రొండు లచ్చల రూపాయలు గూడా మా కస్టమ్మిన్నే యేత్తే...మేం బతకాల్నా? సావాల్నా? ఆఁ...

"కరీం- అన్యాయం జేసిండనీ, మోసం జేసిండనీ...మిసిన్లో మొలలేసిండనీ... సెప్పింద్రు. మరి కరీం సెల్లెందుకు పన్లెకొత్త లేదో సెప్పండ్లి జరా? మీకు దయిర్నం వుంటే... పోరుమన్ను బిలిచి... యేదీ మా ముంగట గట్టిగడుగుండ్లి? నిజం గక్కుతడు... మీరు మా కండ్లనెన్ని దినాలో మొయ్యలేరు సారూ!... ఈ యేడు బోనస్‌తో తాడో పేడో తేల్సుకుంటం. రేపటి దాకా జూసి, మీరిట్నే అంటే... అందరం పనూకొని... స్ట్రయికు మొదలెడతం ఈ తాప మాతరం భయపడి, మీ మాటలు నమ్మి... ఇంగ ఊకోదల్సుకోలే..." అంటూ కచ్చితంగా చెప్పేశాడు చంద్రం ఆవేశంగా.

అందరూ చప్పట్లుకొడుతూ, చంద్రాన్ని కొనియాడుతూ, నవ్వుతూ, కేకలేస్తూ......వెళ్ళిపోయారు వారివారి పనుల్లోకి.

మేనేజర్-ఎంతో అవమానంగా ఫైల్లై బుసలుకొడ్తూ వెళ్ళిపోయాడు.

6

రాత్రి పదిగంటలు.

చంద్రానికి పిలుపొచ్చింది మేనేజర్ నించి.

ఈసారి మేనేజర్ దగ్గర కెళ్ళడానికి కాస్త జంకాడు చంద్రం, సాయంత్రం తను ఆవేశంగా మాట్లాడిన మాటలు గుర్తొచ్చి. ఐనా పూర్తిగా తేల్చుకునే వరకతనికి శాంతిలేదు.

మేనేజరు గదిలో-రమేశ్, నజీర్ నిలబడివున్నారు. వాళ్ళిద్దరూ మిగతా షిఫ్ట్ నాయకులు. వాళ్ళనెంత సేపాయనో అక్కడికి పిలిపించి. లావా దేవీలన్నీ పూర్తయినట్లున్నాయి. ప్రస్తుతం ఎంతో సిన్సియర్‌గా నించున్నారు, రాబోయే మనిషికి కించిత్తుగూడా అనుమానం రాకుండా.

చంద్రం వెళ్ళి వాళ్ళపక్కనే నించున్నాడు.

మేనేజర్ తలెత్తి తీక్షణంగా చూస్తున్నాడు. ఆ చూపుల్ని తట్టుకోలేక తల దించుకున్నాడు చంద్రం. కాస్త చిరాకూ్కడా వేస్తోంది.

"యేరా చంద్రం! ఉపన్యాసం భలేగా దంచేశావే.... నీ సోదరులు బాగా మెచ్చుకున్నారనుకుంటాను!..." వ్యంగ్యంగా అని "మాకో పెద్ద తలనొప్పిపయ్యే పన్నమాట!" అన్నాడు తలూపుతూ చిన్నగా.

తొందరగా మేల్కొన్నట్లు "ఆఁ...అదిసరే! మీ ముగ్గుర్ని పిలిపించింది వొక అతిముఖ్యమైన పనికి. లాభాలగురించి నన్నేం అడుగొద్దు..."ఎక్కువబోనస"ని వూసే ఎత్తొద్దు...వర్కర్స్‌నించి నాకెలాంటి గొడవలూ రావొద్దు. మీరు ముగ్గురూ వొప్పుకుంటే... ఆ వెధవలేం చేయలేరు. దానికిగానూ...మీ ముగ్గురికి తలా రెండు వేల రూపాయలిస్తా. ఇవి తీసికుని యింతటితో యీగొడవను నొక్కెయ్యండి..." అంటూ సొరుగులోంచి కరెన్సీనోట్లకట్టలు తీసి టేబిల్‌పైనేశాడు మేనేజరు.

అందరి కళ్ళు 'జిగేల్'మన్నాయి ఆ వెలుగుల్లో.

ఆశల నెమళ్ళు పురివిప్పి నాట్యమాడాయి.

వాళ్ళిద్దరూ వెంటనే ఆ రూపాయల్ని తీసుకున్నారు ఆత్రంగా.

చంద్రానికి తన బిడ్డ పెళ్ళిప్పుడే జరిగిపోతున్నట్లు, తనవసరాలన్నీ తీరిపో తున్నట్లూ, కష్టాలన్నీ కడతేరుతున్నట్లూ......కన్పించాయి. కాని ఆ వెంటనే... ఆ నోట్లకట్టలే తోటి కార్మికుల్ని నాగుపాములై కాటువేసినట్లు బాధపడ్డాడు.

"రెండు సంవత్సరాలనించి అల్సర్‌వ్యాధొచ్చి బాధపడుతున్న తన భార్యని-ఈ సంవత్సరమైనా బాగుచేయించి, ఆమె ప్రాణాన్ని కాపాడుకోవాలని......" చూసే జాన్ కళ్ళల్లోని 'ఆతృత' గుర్తొచ్చింది.

"రోజూ వానలో తడుస్తూ...చలిలో వణుకుతూ...కాలం గడుపుతూ, ఈ యేడైనా గూడుకట్టుకోవాలని..." చూసే మల్లయ్య 'దయనీయత' గుర్తొచ్చింది.

"పెళ్లైనప్పట్నించీ-ఇప్పటివరకూ తీరనికోరికగా మిగిలిన- భార్యకి చీరా, పిల్లలకి గౌన్లూ కుట్టించి, దూరంగావున్న తన భార్య పుట్టింటికి పంపించాలని..." కాంక్షగా చూసే గంపెడు పిల్లల్ల రాజన్న 'దీనత్వం' గుర్తొచ్చింది.

"ఇక నీవే నాకు శరణ్యం! అప్పిచ్చినోడు రెండ్రోజుల్లో నా గుడిసెను

తెల్ల పందుల దొడ్డిగా మార్చుకోబోతున్నాడని......" చేతులెత్తి వున్న జోగులు 'నిస్సహాయత' గుర్తొచ్చింది.

మానవత్వం వున్న చంద్రం మనసు చలించిపోయింది.

బాధలూ, కష్టాలూ తనొక్కడికే కాదు, ప్రతీకార్మిక సోదరుడికీ వున్నాయన్న సంగతి అతన్ని హెచ్చరించింది.

చంద్రం కళ్ళకి—మల్లెచెండులో బాంబుని కప్పిస్తున్నట్లూ... వెండిచెంబులో విషాన్ని దాచిస్తున్నట్లూ... కన్పించాడు మేనేజర్ కూర్మిరంగా.

ఒక్కసారి తలపైకెత్తి-"సార్! పైసలతో నా నోరుమూయించి నా తమ్ముళ్ల కడుపులు గొట్టాల్సని సూత్తానవ్. గానీ... జాగర్తసార్! పచ్చిగడ్డితినే పసుని గాదు..." అంటూ గిర్రున వెనక్కి తిరిగి విసురుగా వెళ్ళిపోయాడు చంద్రం.

నిశ్చేష్టులయ్యారు మిగిలిన ముగ్గురు.

7

చంద్రం—నిలకడలేకుండా అటూయిటూ తిరుగుతున్నాడు, తన మిషన్ దగ్గర. తలంతా బద్దలయ్యేలా సమ్మెట్లతో కొడుతున్నట్లూ...మండుతున్న పెనంపై వేసి, దిక్కుతోచనియకుండా దొర్లిస్తున్నట్లూ—బాధపడుతున్నాడు.

గిట్ట ఐపోవస్తోంది. మళ్ళీ గిట్ట దొరకాలంటే పూర్తి ఇంటరెస్ట్ ఆపరేటర్‌దే బొంది. తీగస్టాక్‌లో లేదు. ఓల్డ్‌స్టాక్ లో వెతకాలి. ఆ తుప్పుపట్టిన తీగనంతా యాసిడ్‌లో శుభ్రంచేసి గిట్టకు చుట్టించాలి. అప్పుడది తనకవసరం.

హెల్పర్—రంగడికోసం చూశాడు చంద్రం.

రంగడు—ట్యాంక్‌లోవున్న వెచ్చని నీటిలో మోకాలానిస్తూ—బాధనుపశమనం చేసుకుంటున్నాడు—నిన్న—15 కిలోల రాగి బెండల్ (తీగచుట్ట) ని యెత్తుకుని, హీటర్ బావిలోంచి పైకొస్తుంటే...మెట్లుజారి కిందబడ్డాడు. అదృష్టవశాత్తు ఆ ప్రమాదం తప్పిపోయింది. ఆ బెండల్ మోకాలుపైబడి లావుగావాచి, నడవడానికి ఇబ్బందిగా వుంది. డ్యూటీకి రాకుండా పస్తులైనా పడుకుందామంటే...కొత్తగా పనికెక్కిన తన్ను నిర్దాక్షిణ్యంగా పన్లోంచి తీసేస్తాడనే భయంతో వచ్చాడు.

అతడి అసహాయతనిచూస్తే జాలేసింది చంద్రానికి—ఈ పరిస్థితిలో అతడు 10 కిలోల రాగితీగను లేపడమసాధ్యమన్న విషయాన్ని గ్రహించాడు.

మిషనాగిపోకుండా చూడమని చెప్పి, తనే బయలుదేరాడు చంద్రం. లోపలిరూంలోకెళ్ళి ఓ తుప్పుపట్టిన రాగిబెండల్‌ని భుజానికెత్తుకున్నాడు. మెట్లని బలవంతంగా ఎక్కి- "అపాయం" అని ఎర్రగారాసున్న రూం తలుపునెట్టుకుని లోపలికెళ్ళాడు.

అందులో ఎవరూలేరు-భుజమ్మీది బెండల్‌ని కిందేశాడు. రూంమధ్యలో, భూమిలోపలిగా అరేంజ్ చేసిన ట్యాంక్‌లో యాసిడ్ బుస బుస పొంగుతోంది.

ఇనుపకడ్డీ కొక్కానికి బెండల్‌ని తగిలించి, ట్యాంక్‌పై అటోకాలు ఇటో కాలు వేసి, బెండల్‌ని జాగ్రత్తగా యాసిడ్‌లోకి దించాడు. 'బుస్సు'న పొంగుతూ రాగితీగకున్న మురికినంతా తినేస్తోంది.

మెల్లగా డోర్ తెరుచుకున్న చప్పుడైంది.

కాళ్ల మధ్యనించి చూచిన చంద్రం ఆశ్చర్యపోయాడు! మేనేజర్!!

"యేం! హెల్పరేమయ్యాడు?" చిన్నగా నవ్వుతూ అడిగాడు మేనేజర్ ముందుకొస్తూ.

"వానికి నొప్పిలేసింది." ఆశ్చర్యంనించి తేరుకుని అన్నాడు చంద్రం, కొంచెం నిర్లక్ష్యంగా తన పని చేసుకుంటూ.

"ఆఁహా! అలాగా?..." అంటూ ఏం తోచక అంతటితో ముగించి, 'పర ధ్యానం'గా ముందుకెళ్ళి కరెంట్ ఫ్యూజుల డబ్బాని తెరిచి, యేదో సర్దినట్లుగాచేసి, మళ్ళీ మూసేశాడు.

వెనుదిరిగి-"తెల్లగా కడుగు! లేకుంటే ప్లాస్టర్ తొందరగా పూడి పోతుంది..." అంటూ చంద్రం వెనక్కొచ్చాడు.

చంద్రానికీసారి జవాబే యివ్వాలన్పించలా.

కాసేపు తటపటాయించాడు మేనేజర్.

చంద్రం-అలాగే వొంగి బెండల్‌ని జాగ్రత్తగా యాసిడ్‌లో దొర్లిస్తున్నాడు. రాగితీగ బంగారంలా మెరుపుకొస్తోంది.

మేనేజర్-ఒక్క వుదుటున ముందుకొచ్చి, బూటుకాలితో గట్టిగా తన్నాడు. చంద్రం ముందుపాదాన్ని.

8

అరుబయట-పోలుకింద......

తడితడిగా చీము నెత్తుర్లతో తడిసి, భయంకరంగా, పోల్చలేకుండా...... చంద్రం శవం...శవంచుట్టూజనం. అంతులేని ఆవేదనా...అర్థంకాని ఆలోచనా...

చాలసేపైంది. ఒకరితో ఒకరుమాట్లాడం లేదు.

ఎవరికి వారు-కంటతడితో...రక్తం చుక్కలేని మొహాలతో... కొంతమంది నిలబడి వుండిపోయారు. కొందరు కూర్చుండి పోయారు దిక్కుతోచక.

వెక్కిళ్ళ చప్పుళ్ళు...దూరాన మెల్లని ఫ్యాక్టరీల ధ్వనులు తప్ప-భయంకర నిశ్శబ్దం.

ఎందుకో- 'కెవ్వున' ఫ్యాక్టరీ అదిరేలా కేకవేసి, పిచ్చిగా కుంటుకుంటూనే పరుగుతీసిన రంగడు తప్ప-అందరూ రాత్రి 11 గంటలుదాటి 12 ఔతున్నా అలాగే వుండిపోయారు.

మేనేజర్-శవాన్నొకమారు పరీక్షగా చూసి, కొంచెం ఎడంగా వెళ్ళి నించున్నాడు విచారంగా. చివరిగేటు ముందున్న స్త్రీ ఆర్తనాదం-అతన్నప్పుడు చుట్టుముట్టింది. అప్పుడే వచ్చిన రంగడు బయట్నించి గేటెక్కడానికి ప్రయత్నిస్తున్నాడు.

"అయ్యో!... చంద్రం భార్య...గేటు తియ్!..." అన్నాడు మేనేజర్ ఆత్రంగా.

డ్యూటీని మర్చిపోయి- ఎంతో దీనంగా, బాధగా అక్కడే కొయ్యబారి చూస్తూ వుండిపోయిన వాచ్‌మన్- ఒక్కసారిగా పరుగుతీశాడు గేటు వేపు కంగారుగా.

ఆలోచనల్నించీ, దుఃఖాల్నించీ తేరుకున్న తలలు అన్నీ ఒకేమారు గేటు వేపు తిరిగాయి.

సిగ వూడిపోయిన వెంట్రుకలూ, ఎర్రగా కందిపోయిన ముఖమూ, గేటు నూపుతున్న చేతులూ... మట్టిలో దొర్లుతూ ఏడుస్తున్న పిల్లలూ, పిచ్చిగా కేకలూ, వెర్రిగా అరుపులూ, నిస్సహాయమైన బూతులు.

అవి అందరి గుండెల్లో సూటిగా తాకాయి. ఒక్కొక్కరి కళ్ళల్లోంచి రక్తం ద్రవంగా ప్రవహిస్తోంది.

పక్కసున్న వెల్తుర్లో- ఆవిడ గేట్లోంచి విసురుతున్న మట్టిలోంచి పొగలు లేస్తున్నాయి. మండినట్లు మెరుస్తున్న ఆ మట్టిలోంచి పొగలు - గాలికి చువ్వలు దాటి ఫ్యాక్టరీలోకి వీస్తున్నాయి.



నవల—సీరియల్

చౌలి_పో

రెండవ భాగం

(గత సంచిక తరువాయి)

15

'తు' చిన్న భూస్వామి కాబట్టి అతన్నింతవరకు ఎవరూ పట్టించుకోలేదు. పూరి పరిస్థితులు బాగా తెలిసిన కువో కూడా అతన్ని పట్టించుకోలేదు. కాని దుష్ట త్రయపు 'తు' వుంగరాలు యీ 'తు' భార్య దాచే సరికి అందరికి కోపం, అనుమానం ఎక్కువయేయి. ఈ సంగతి చర్చించేందుకు ఆక్టివిస్టులు చాలా సార్లు సమావేశమయేరు. ఇంతవరకు కాంవందుల బంధువులను, స్నేహితులను సోదా చేయలేదు కనక యిప్పుడా పథకం చేబట్టాలని అందరూ ఒప్పుకున్నారు. ఆరిపోతున్న అగ్ని మళ్ళీ రగులుకుంది. ఈ మారు కాంవందుల బంధువుల మీదికి, తొత్తుల మీదికి మంటలు లేచేయి. ఇన్నాళ్ళు వీళ్ళందరు కాంవందుల తరఫునఏవేవో పుకార్లుపుట్టిస్తూండేవారు. ఇప్పటికి భూస్వామ్య విధానపు మూల స్తంభాలు కూలి పోయేయి. కాని ఆ విధానపు గోడలు, దూలాలు, తలుపులు, కిటికీలు యింకా విరగలేదు. ఇప్పుడు వాటి పనే పట్టాలి.

సంవత్సరాది నాడు కూడా మీటింగులు జరుగుతూనే వున్నాయి. ఈసారి పోరాటంలోని రాజకీయ, ఆర్థిక విధానాల గురించి చర్చించుకున్నారు. ఆరు గ్రూపులుగా విడిపోయి వివరంగా మాట్లాడుకున్నారు. ఆరు చోట్ల ఆరు పెద్ద లాంతర్లు పెట్టేరు. ఆ లాంతర్లన్నీ పొడుగు కాళ్ళ 'హా'వి. ఇంతకు ముందు అతను కూడా నిరుపేద. అతనన్ని చోట్లకీ తిరుగుతూ, లాంతర్లవత్తులు సరిచేస్తూ, "సీ, ఈ లాంతర్లు పెద్ద బావుల్లాగ నూనంతా మింగేత్తుండాయి" అని గొణుక్కున్నాడు.

పథకం అమలు జరిపినా ఆయుధాలు దొరకలేదు. కొంత వెండి, బంగారం,

బట్టలు దొరికేయి కాని అన్నీ శిథిలావస్థలో వున్నాయి. అవన్నీ కాలం నాటి తవ్వ కాల్లో దొరికిన వస్తువుల్లాగా బాగా పాతబడి పోయేయి. నిద్రచాలక జనం మీటింగుల్లో కునికేరు. కొందరు కాంగ్ మీద పడి గురక పెడితే, మరికొందరు అటు యిటు పచార్లు చేసేరు. మూడు గ్రూపుల్లో నైతే పిల్లలే మిగిలేరు. "ఈమీటింగులేటో గాని నూనంతా కరుసయి పోనాది" అన్నాడు హా.

"ఇదేటిది, ఏటీదొరకదు. సారంలేని పిప్పునింకా పిండితే ఏటొత్తాది?" అన్నాడు ఓల్డ్‌సన్. ఇదంతా చూసి సాంచియాకి మనిషిని పంపి సియావో ఏఁవంటాడో కనుక్కురమ్మన్నాడు కువో.

సియావోకి చాలా వూళ్లనించి ఇలాంటి రిపోర్టులొచ్చేయి. పని దండగ తప్ప, ఏఁవీ దొరకడంలేదు. "సారంలేని పిప్పుని పిండితే ఏటొస్తాది?" ఓల్డ్‌సన్ మాటతో సియావో ఏకీభవించేడు. అతనికి ఎవరో అన్నది గుర్తొచ్చింది- "లీడరన్నవాడు అందరి మాటలు వినాలి, అన్నీ చూడగలగాలి. ఒకోసారి తెలివితక్కువ వాళ్ళనే మాటల్లోకూడ నిజఁవుంటుంది. "సారంలేని పిప్పుని పిండడం" అన్న మాటలో అతనికి నిజం కనిపించింది. ఈ బండివాడు చాలా సరదాగా మాట్లాడతాడని అతనికి తెలుసు. ఓల్డ్‌సన్ 'పులి-ఎలుగుబంటి' కథకూడా గుర్తుంది సియావోకి. ఈ బండివాడివన్నీ కట్టుకథలే అయినా ఈ మాటమాత్రం నిజం. లీడర్లు యీ పథకం మార్చాలి. పోరాటం క్లిష్టమైనదైనా చాలా మంది తేలిక దోవకోసం వెదుకుతున్నారు. అందుకే పరిస్థితులను సరిగ్గా అవగాహన చేసుకోవడం లేదు.

సియావో ఏ సమస్యనైనా మావో ఆలోచనావిధానానికి అన్వయించి చూస్తాడు. ప్రతి విషయం బాగా పరిశీలించి దాని ముందు వెనకలాలోచించి, ఆ విషయం గురించి ఆసక్తితో జనాన్ని, తన కింద ఆఫీసర్లని సంప్రదిస్తాడు. ఇప్పుడు కూడ అలాగే సమాచారఁవంతా సేకరించి రాష్ట్ర పార్టీకమిటీకి ఓరిపోర్టు రాసేడు. జిల్లా పార్టీ కమిటీలోని ఇద్దరు కామ్రేడ్స్‌కి వుత్తరంరాసేడు. ఆ రిపోర్టు వుత్తరం వాన్‌కిచ్చి పంపేడు. వాన్ గుర్రంమీద బయల్దేరేడు. తర్వాత యువాన్‌మావో జిల్లాలోని వూళ్లకి అయిదుగురు సైనికులను పంపి, మర్నాడు సాంచియాలో ఆఫీసర్ల మీటింగుందని చెప్పమన్నాడు.

మర్నాడు జిల్లా ఆఫీసర్లు, గ్రామాల ఆఫీసర్లు చాలా వూళ్లనుంచి వచ్చేరు— కొందరు గుర్రాలమీద, బళ్లమీద మరి కొందరు నడిచి వచ్చేరు. సియావో ప్రత్యేకాహ్వానంమీద ఓల్డ్‌సన్ కూడా వచ్చేడు.

మీటింగు మొదలెట్టేలోపల కొంతవ్యవధి వుండడంవల్ల సియావో వూళ్ళోకి వెళ్ళి జనాభిప్రాయం సేకరించేడు. కొందరు మాత్రం యింకా ఆ పథకం కొన

సాగించాలనీ, చిన్న భూస్వాములు కొందరి దగ్గర యింకా సొమ్ము మూలుగుతోం దనీ అన్నారు. ఎక్కువమంది యీ పథకం వల్ల లాభంలేదనీ, కాలాన్ని వృథా చేయడమవుతుందనీ అభిప్రాయపడ్డారు. ఆ శ్రమని కాంగ్‌చాపలు అల్లేందుకు, కట్టెలు కొట్టేందుకు, ఎరువుల బుట్టలల్లేందుకు-వుత్పత్తిలో వినియోగిస్తే మంచిదని చెప్పేరు.

ఓ మధ్య తరగతి రైతు ఇంట్లో మీటింగు జరిగింది. మీటింగులో కూడా కొందరు పథకాన్ని కొనసాగించాలనీ, మరికొందరు వెంటనే రద్దుచేయాలనీ వాదించేరు. ఓల్డ్‌సన్ కూడా కల్పించుకుని చేతులు తిప్పుతూ ఏదోచెప్పేడు. అతను చెప్పినదాంట్లో కూడా కొంత నిజంవుంది కాని, ఎక్కువగా అతను అందర్నీ నవ్వించేందుకు మాట్లాడేడు.

కాంగ్ మీద కూర్చుని, ఎవరయినా మంచి విషయం చెప్పినపుడల్లా దాన్ని పుస్తకంలో రాసుకున్నాడు సియావో. కొంచెమాగి అతనో ప్రశ్న వేసేడు.

"మనం భూస్వామ్య విధానాన్ని ఎందుకు మట్టుపెడుతున్నాం?"

"మన బాదలు తీరడానికి." "బుగతల్ని మట్టుపెట్టేందుకు" అని సమాధానాలొచ్చేయి.

"సరే, అయితే మనం కాఁవందుల్ని ఎందుకు ఖతం చెయ్యాలి?" అని అడిగేడు సియావో.

"దోపిడి అంతం సెయ్యడానికి"

"దున్నేవోడికి బూఁవి రాడానికి"

"ఎచ్చగా కాంగుమీద తొంగోడానికి, మంచి తిండి, సంవత్సరాదికి బూరెలు తినడానికి" అన్నారెవరో. జనం గొల్లుమన్నారు.

"నిజఁవే మంచి జీవితం కోసఁవే మనం పోరాడుతున్నాం. కానిమనఁవనుకున్నది ఎలా సాధిస్తాం?" అని మళ్ళీఅడిగేడు సియావో.

గదిలో రెండు కాంగ్‌లు వెచ్చగావున్నాయి. గది మధ్యలో ఓ కుంపటికూడా వుంది. మొత్తానికి గది వేడెక్కింది. 'చు' లేచి కళ్ళు తుడుచుకుని, చలికోటు విప్పేసి-

"బూఁవి, ఇళ్లు, నాగలి నాగేందుకు గుర్రాలు బూఁవి సాగుసేసేందుకు పనిముట్లువుంటే మరేటక్కర్నేదు" అన్నాడు.

"ఇంకేటొద్దా? నీకు బుర్ర నేదు. పొలంలో జల్లేందుకు గింజలొద్దా?" అన్నాడు చాంగ్ చింగ్-షి.

"మనకి బల్లు కూడా కావాల. దాన్యం నూర్సేసేక కుప్పలు పోత్తారు. బండి

నేకుంటే ఆ కుప్పలింటికెలా తీసుకుపోతారు?" అన్నాడు బండి మనిషి ఓల్డ్‌సన్.

"బల్లు కావాలంటే, యింకా శానా కావాల. మరిగానసగొద్దా?" అన్నాడు 'చు'.

"బండే ముందొత్తాది" అన్నాడు ఓల్డ్‌సన్

"నేదు, ముందు గానగే వుండాల" అన్నాడు 'చు'.

"నీకు గుర్రంవుండి బండి నేప్పోతే ఏటి నాబం?"

"నీకు గుర్రం వుండి గానగ నేప్పోతే ఏటి నాబం?"

సియావో లేచి 'నిశ్శబ్ద' మని బల్ల గుద్దేడు. అందరూ వాదన లాపేక తను మాట్లాడనారంభించేడు.

"మనకి గానుగలు, తిరగళ్ళు కావాలి. బళ్ళు కావాలి. ఉత్పత్తి సాధనాలన్నీ కావాలి. ఇప్పటి వరకు అవన్నీ కావందుల దగ్గరుండేవి. ఇప్పుడవి మన చేతుల్లో కొచ్చేయి గాబట్టి మనం నిలబడగలిగేం. ఇప్పుడు మనం పెద్దెత్తున వుత్పత్తి సాగించ గలం. కాని మన జిల్లాలో కావలసినన్ని సొమ్ములు★, గుర్రాలు లేవు. మనం స్వాధీన పరచుకున్న వెండి, బంగారంతో వాటిని కొనుక్కోవాలి."

"యువాన్ మావోకి మరో ఏభై, అరవై సొమ్ములు గాని, గుర్రాలు గాని వుంటే సరిపోతాది. అప్పుడందరికి సొమ్ములుంతాయి" అన్నాడు కువో, పైపు కాలుస్తూ.

సొమ్ములు, గుర్రాలు వుంటే దున్నడం, గానుగ తోలడం, బండితోలడం- అన్నీ సులువవుతాయి. మనం జప్తుచేసుకున్న భూమి, సొమ్ము వెంటనే పంచితే గింజలు చల్లొచ్చు. మళ్ళీ మంచు కరిగితే కష్టమవుతుంది. కాలం ఎవరికోసమూ ఆగదుకదా! కొందరు కావందుల దగ్గర ఇంకాకొంచెం ఆస్తులు మిగిలివుండొచ్చు. కాని వాళ్ళు మనల్ని ఎదిరించలేనంతవరకు ఫర్వాలేదు" అన్నాడు సియావో.

"అల్లకాడ మిగిలింది కూడా శానా తక్కువ" అన్నాడు కువో.

"మనం ముందుగా ఏవి చేద్దామంటారు?" అని అడిగేడు సియావో.

ఇంతలో రాష్ట్రపార్టీనుంచి ఓ మనిషి ఉత్తరం తెచ్చేడు. కువోని మీటింగు నడపమని, తను ఉత్తరం చదువుకున్నాడు. రాష్ట్ర పార్టీ కమిటీ ఆదేశాలు: భూసంస్కరణ కార్యక్రమంలో అందరిమీద ఒకేలా దాడిచేసేరు. కాని ఇప్పుడా దాడిని పరిమితంచేసి, మధ్యతరగతి రైతుల్ని వదిలెయ్యాలి. దాడుల వలన స్వాధీనమయిన సొమ్ము, భూమి పంచి, వుత్పత్తి పెంచే పథకం కింద వెంటనే గింజలు

★ పశువులు

చల్లే ఏర్పాటు చూడాలి. 'ఈశాన్య చైనా దినపత్రిక'(The Northeast China Daily)లో 'క్లిష్టసమయం-నాయకత్వం' అన్న సంపాదకీయం ప్రతి వర్కరు చదవాలి-ఇది ఆ వుత్తరం సారాంశం.

సియావో దానికి జవాబురాసేడు. ఉత్తరం తీసుకొచ్చిన మనిషిని వాన్ కనిపించేడేమో అడిగేడు.

"నేదు, నేను యువాన్ మావో మీదగా వచ్చేను. అతను వూచియా మీదగా ఎల్లుంతాడు" అన్నాడు.

సియావో అతన్ని పంపేసేడు. అందరూ ఏవో నెక్కలేస్తున్నారు. మొత్తం మీద ఎనభై శాతంమంది కామందులకు వ్యతిరేకంగా పోరాడేరు. మరి మిగిలిన ఇరవై శాతం ఎవరు? పార్టీఇచ్చిన లెక్కలప్రకారం కామందులు, పెద్దరైతులుకలిసి ఎనిమిదిశాతం. మిగిలిన పన్నెండుశాతంలో సగం మధ్యతరగతి రైతులు—వాళ్ళని ఎదిరించే ఆలోచనేలేదు. మరి మిగిలిన ఆరుశాతం ఎవరు?

"అల్లు దేంటోనూ వుండరు. వాంగ్ బార్యనే చూసేంకదా, ఆవిడ లాంటిదే· యువాన్ మావోలో ఒక్క మీటింగుకి రూడారానేదు" అన్నాడు కువో.

"ఆవిడెలాటి మనిషి?" అని అడిగేడు సియావో.

"ఆవిడా కూటికి గతిలేనిదే. ఆవిడ కొడుకులకు ఎవలూ పిల్లను కూడా యీయలేదు"

ఓల్డ్‌సన్ కల్పించుకుని, "ఎవులాలు? తూరుపుదిక్కునుంతారు, ఆ వాంగ్ లేనా? అల్లు అయిదుగురూ పేదోల్లే. ఆల బాబు సచ్చిపోతే శవపేటిక కొనేందుకు డబ్బునేక సాపలో సుట్టి పాతెట్టేసినారు. కాని యీ మద్దినే ఒక కొడుకు పెల్లయి నాది" అన్నాడు.

"మరి అతనేం చేస్తున్నాడు?"

"ఆడు సెప్పులు కుడతాడు. ఆడిపెల్లానికి అదేదైర్నం. ఆడి అన్నకి మూడు పదుల వయసుంతాది. ఆడికి పెల్లికానేదు, మరెంకెవులూ పిల్లనివ్వరు కూడాను"

"వాళ్ళేవన్నా తప్పులు చేసేరా?" అని కువోని అడిగేడు సియావో.

"నేదు. అలు మంచోల్లే. కాని దేనికీ ముందుకిరారు. ఆరోనంబరు హాన్‌కి సుట్టాలే. కాని ఆడు యీల్లని సిన్నసూపు సూత్తే, వాంగ్‌పెల్లాంకి పేదోల్లంతే సిన్నసూపు!"

"మనిసి పేదది గాని, మనసు వున్నోళ్ల మనసు" అన్నాడు ఓల్డ్‌సన్.

"మిగతా పల్లెల్లో కూడా అలాంటి వాళ్ళున్నారా?" అని అడిగేడు సియావో.

"శానా మంది వున్నారు" అన్నారందరు.

సియావో కాసేపు ఆలోచించి, "ఇక మీటింగు ముగిసింది. ఇక నుండి మధ్య తరగతి రైతుల్ని ఎదిరించకండి. అది చాలా పొరపాటు. వెనకబడి వున్న వాళ్ళని జాగ్రత్తగా పనుల్లోకి దించండి. విప్లవంలో పాల్గొనే వాళ్ళశాతం తొంభై రెండుకి పెంచండి. ఇంకా పాత భావాలు ఒదలని పెద్ద కాంవందులను తప్ప అందరినీ రైతుసంఘంలో చేర్చుకోండి. వెనకబడిన వాళ్ళని కూడదీసి వాళ్ళుకూడా వుత్పత్తిలో సాయపడేలా చూడండి. ప్రస్తుతం అదే ముఖ్యమైన పని. నేను యువాన్ మావోలో వెళ్ళి ఏంవి చేయగలనో చూస్తా"నన్నాడు.

ఓల్డ్‌సన్ ఆనందం పట్టలేకపోయేడు. ఎడం కన్ను చికిలించి మళ్ళీ తన వాగుడు మొదలెట్టేడు. "మంచిది సియావో బాబూ. తప్పకుండారావాల. ఈ ఇల్లు ఎలకబొక్కలాగున్నాది. గాని మా ఆఫీసు పెద్దగా, ఎచ్చగా వుంతాది. నా స్లెడ్జిలో ఎక్కినావంటే నువ్వురెండు పైపులు కాల్చేలోపలే యువాన్ మావోలో వుంతావ్".

"ఏయ్, నువ్వు కాసేపు నోర్మూయ్" అన్నాడు 'చు'. "సియావో బాబూ, ఉల్ఫాగాళ్ళని కూడా కలుపుకోమంతావా?"

"ఆఁ, కలుపుకోవాలి. వాళ్ళు నెమ్మదిగా మారతారు" అన్నాడు సియావో.

అందరూ ఎవరివాళ్ళు వాళ్ళు వెళ్ళిపోయేరు. సియావో సామాను తీసుకుని ఓల్డ్‌సన్ స్లెడ్జి ఎక్కేడు. రైతు సంఘం ఆఫీసులో దిగేడు. వెనకబడిన వాళ్ళని ఎట్లా కూడదియ్యాలన్న విషయంమీద సియావో, కువో చాలసేపు మాట్లాడు కున్నారు. వాళ్ళపేర్ల లిస్టు తయారుచేసేరుకాని, వాళ్ళని ఏమి చెయ్యాలి? కాంగ్ మీద పడుకున్నా సియావోకి నిద్రపట్టలా. ఆ ముందురోజు 'ఈశాన్య చైనా దినపత్రిక' తీసి చదివేడు. అందులో లాలిన్ జిల్లాలో వెనకబడిన వాళ్ళని ఎలా కూడదీసేరో రాసేరు. సియావో వెంటనే కువోని లేపి ఆ వార్త చదివేడు. ఆ వార్త ఆధారంగా వాళ్ళు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఓ పథకం తయారు చేసేరు. మర్నాడుదయమే పని మొదలెట్టాలని నిశ్చయించేరు.

రెండో అధ్యాయం

మానవ పూర్వ చరిత్ర

భౌతికవాదదృక్పథం : మానవచరిత్ర కంతటికీ నిర్ణయాత్మకమైన అంశం ద్విముఖమైనది. మానవజాతిని నిరంతరం చెయ్యడం కోసం సంతానాన్ని ఉత్పత్తి చేయడం మొదటి ముఖం అనుకుంటే ప్రాణపోషణకు అవసరమైన ఆహారాన్ని ఉత్పాదన చేయడం రెండవ ముఖం అవుతుంది. భౌతికవాద దృక్పథమంటే ఇదే.

మానవుని పరిశ్రమాభివృద్ధి దశను బట్టే సాంఘిక వ్యవస్థ నిర్ణయమౌతుంది. ఆదిమ కాలంలో మానవుని పరిశ్రమ ఉన్నత దశకు చేరుకోలేదు. మొత్తం ఉత్పాదన చాల కొద్దిగాఉండేది. సమాజసంపద కూడా అంతే. అందుచేత సాంఘిక వ్యవస్థ ఎక్కువగా లైంగిక సంబంధాల మీదనే ఆధారపడి ఉండేట్లు కనిపించేది. అయితే పోను పోను ఆస్తి వ్యవస్థకూ కుటుంబ వ్యవస్థకూ మధ్యవెనుకటి సామరస్యం తగ్గుతూ, ఘర్షణ ఎక్కువ కాసాగింది. దీని పర్యవసానంగా చివరకు ఆస్తి వ్యవస్థలో వచ్చిన పెను మార్పులు కుటుంబ వ్యవస్థలో పెనుమార్పులను తెచ్చిపెట్టాయి. కాబట్టి కుటుంబమనేది నాటినుంచి నేటిదాకా ఒకే లాగున లేక రకరకాల పరిణామాలకు లోనైంది.

మూడు దశలు : మానవ పూర్వ చరిత్రా క్రమాన్ని (ప్రి-హిస్టరీ) మోర్గన్ మూడు ముఖ్యమైన దశలుగా విభజించాడు: మొదటిది ఆటవిక దశ (సేవేజరీ), రెండవది బర్బర దశ (బార్బరిజం), మూడవది నాగరిక దశ (సివిలైజేషన్) ఈ మూడింటిలోనూ స్థాయీ భేదాలు-ప్రాథమికం, మాధ్యమికం, ఉన్నతం-ఉండేలా మోర్గన్ చిత్రించాడు. నాగరిక దశ ఇటీవలి చరిత్రకు సంబంధించింది. మొదటి రెండు దశలనూ, రెండవదానికీ చివరి దానికీ గల పరివర్తన దశను మోర్గన్ వర్ణించాడు. ఒక దశను మరొక దశ నుండి వేరు చేసేది, ప్రాణపోషక వస్తు ఉత్పాదనలో మానవుడు సాధించిన ప్రగతి మాత్రమే అని కూడా మోర్గన్ భావించాడు.

1. ఆటవిక దశ

ప్రాథమిక స్థాయి : మానవజాతి శైశవం. మానవుడింకా అరణ్య జీవి. కొంతవరకైనా వృక్షాలపై నివసించే వాడు. ఘాతుకమృగాల బారి నుండి ఇలాగే తప్పుకో గలిగాడు. అతని ఆహారం పళ్ళు కాయలు, వేళ్ళు. స్పష్టమయిన మాటలు ఇప్పుడే అలవడ్డాయి. కొన్ని వేల సంవత్సరాల పర్యంతం సాగినా దీని గురించి సాక్ష్యాధారాలు మనకు లభించవు.

మాధ్యమిక స్థాయి : చేపలను ఆహారంగా వాడగలగడంతో ఈ స్థాయి మొదలౌతుంది. చేపలు, పీతలు, ఇతర జల జీవులు తిండికి పనికి వచ్చేవి. చేప

లను తినడానికి నిప్పు అవసరం. కాబట్టి నిప్పు చెయ్యగలగడం కూడా ఈ ఉప దశకు మరొక ముఖ్య లక్షణం. ఈ ఆహారం మనిషిని శీతోష్ణస్థితికీ ప్రాదేశిక పరిమితికీ దాస్యం చేసే అవస్థ నుండి తప్పించింది. నదులనూ, సముద్ర తీరాలనూ పట్టిపోతూ ప్రపంచ మంతటా మనిషి వ్యాపించ గలిగాడు. ప్రాతర్జాతియుగపు పనిముట్లు ఈ స్థాయికి చెందినవే. ఇవి అన్ని ఖండాలలోనూ బయల్పడుతున్నాయి. నిప్పును వాడుక చేయగలిగినందు చేత, కందమూలాలను భుజించడం సాధ్యమైంది. వేట మూలంగా లభించే ఆహార పదార్థాల విషయం ఎప్పుడూ తన ఆధీనంలో ఉండని విషయం కాబట్టి మనిషి ఇతర మనుషులను చంపి నరమాంస భక్షణకు గూడా దిగవలసి వచ్చింది. ఆస్ట్రేలియన్ నీగ్రోలూ, పాలినీషియన్లూ నేటివరకూ ఈ దశలోనే ఉంటున్నారు.

ఉన్నత స్థాయి : ఈ స్థాయి విల్లునమ్ములను కనుగొనడంతో ప్రారంభమౌతుంది. అరణ్య జంతువులిప్పుడు నిత్యాహారం కాగలిగాయి. వేట మామూలు వ్యవహారమైంది. విల్లునమ్ములను చేసుకొన్నాడంటే మనిషి మనోశక్తులు ఎంతో అనుభవాన్నీ కౌశలాన్నీ సమకూర్చుకున్నాయన్న మాట. ఈ స్థాయిలో మనుషులు ఊళ్ళు నెలకొల్పుకోవడం మొదలైంది. ప్రాణపోషక వస్తు ఉత్పాదన పైన కొంత అదుపు కలిగింది. కొయ్య పాత్రలు, పనిముట్లు, మగ్గాలు లేకుండా చేతివేళ్ళతోనే నూలు వడకడం, తట్టా బుట్టా అల్లడం వగైరా పనులు ఈ స్థాయిలోనే మనిషికి అలవడ్డాయి. నిప్పూ, రాతిగొడ్డలీ సాయంతోటి వృక్షాలను తొలిచి తెప్పలు నిర్మించుకోవడం ఇంటి కట్టుబడికి కలపనూ, చెక్కలనూ వాడుకోవడం కూడా సాధ్యమైంది. వాయవ్య అమెరికాలోని రెడ్ ఇండియన్లకు ఇవన్నీ తెలుసు గాని కుండలు చేసుకోవడమే తెలియదు. కాబట్టి కుండలు చెయ్యడం అనే విద్య ఆటవిక దశను బర్బర దశనుండి వేరు పరిచేదిగా మోర్గన్ నిర్ణయించాడు.

2. బర్బర దశ

ప్రాథమిక స్థాయి : తట్టలకూ, బుట్టలకూ, కొయ్యపాత్రలకూ బంక మన్ను దట్టంగా పట్టించి, నిప్పంటుకోకుండా చెయ్యడం ఎలాగో నేర్చిన మనిషి, ఆ బంక మన్నునే కుండలుగా మలచుకోవడం ఎలాగో అచిరకాలంలోనే నేర్చుకున్నాడు.

ఈ కాలంలో పూర్వార్థ గోళమూ, పశ్చిమార్థగోళమూ భిన్నమార్గాలు పట్టిపోసాగాయి. బర్బర దశకు ముఖ్యమైన లక్షణం జంతువులను మచ్చిక చెయ్యడం, మొక్కలను పెంచడం. పూర్వార్ధగోళంలో మచ్చిక పడగలిగిన జంతువులన్నీ, ఒక్కటి తప్ప తక్కిన ఆహార ధాన్యాలన్నీ లభిస్తాయి. పశ్చిమార్థగోళంలో 'ఇలామా' అనే ఒకే ఒక జంతువు మచ్చికకు యోగ్యమైనది-అదీ దక్షిణభాగంలోనే. ఇక్కడ వ్యవసాయానికి యోగ్యమైన ఒకే ఒక పంట జొన్న. సహజ పరిస్థితు

లలో గల ఈ వ్యత్యాసం వల్ల రెండు ఉపఖండాలూ వేర్వేరు తెన్నులు పట్టి ముందుకు పోక తప్పలేదు.

మాధ్యమికస్థాయి : పూర్వార్ధ గోళంలో జంతువులను మచ్చిక చెయ్యడంతోటీ, పశ్చిమార్ధగోళంలో నీటి పారుదలద్వారా తినడానికి తగిన మొక్కల పెంపకంతోటీ, కట్టడాలకు అడోబ్‌లూ (ఎండ కెండిన ఇటుకలు), రాళ్ళూ వాడకంతోటీ ఈ స్థాయి మొదలౌతుంది. యూరపియన్లు ఈ అర్ధగోళాన్ని ఆధునికయుగ ప్రారంభంలో జయించేంత వరకు పశ్చిమార్ధగోళ ప్రజలు ఈ స్థాయిదాటి ఎంతో ముందుకు పోలేదు. మిసిసిపీ నదికి తూర్పున నివసిస్తూవచ్చిన ఇండియన్లు బర్బర దశ ప్రాథమిక స్థాయినుంచి ఆట్టే బయట పడలేదు. జొన్నలనూ, గుమ్మడి కాయలనూ, పుచ్చకాయలనూ తోటల్లో పండించు కొనేంతవరకూ వచ్చారు. కొయ్య ఇళ్ళలో, చుట్టూ మేకులు పాతిన ఊళ్ళలో నివసించేవారు. ఉత్తర అమెరికా పశ్చిమ భాగంలో కొలంబియా నదీప్రాంతంలో ఉండిన ఇండియన్లు ఆటవిక దశ తాలూకు ఉన్నతస్థాయి దాటి బయటపడలేక, కుండలు చేసుకోవడంగానీ, మొక్కలు పెంచడంగానీ తెలియకుండా ఉండేవారు. న్యూమెక్సికో లోని ప్యూబ్లో ఇండియన్లూ, మెక్సికన్లూ, మధ్యఅమెరికాలోని ఇండియన్లూ, పెరూదేశస్తులూ బర్బర దశలో మాధ్యమిక స్థాయిని చేరుకుని ఉండేవారు. రాతితోనో, అడోబ్‌లతోనో కట్టిన కోటల్లాంటి ఇళ్ళలో ఉంటూ, కృత్రిమంగా నీరు పారించిన తోటల్లో జొన్న వగైరా ఆహారోచితమైన మొక్కలను పెంచుతూ, కొన్ని జంతువుల్నీ పక్షుల్నీ మచ్చిక చేసుకొని ఉండడమేగాకుండా, ఇనుము తప్ప తక్కిన అన్ని లోహాలనూ తవ్వి తీయగలిగి ఉండేవారు.

పూర్వార్ధ గోళంలో బర్బరదశ తాలూకు మాధ్యమిక స్థాయిలో పాలూ, మాంసం ఇచ్చే జంతువులను మచ్చిక చెయ్యడం మొదలైందిగాని తృణధాన్యాల పెంపకం మరి చాలకాలం వరకుమొదలుకాలేదు. పశువుల పెంపకం, పశుగణ పాలనం విరివిగా సాగి, ఇతర బర్బరుల నుండి ఆర్యులనూ సెమైట్‌లనూ వేరు పరచింది. యూరప్, ఆసియా ఖండాల ఆర్యులకు అనేక జంతువుల గురించిన మాటలుఉభయ సాధారణం; సస్యాల విషయం సంపూర్ణ భిన్నం. సెమైట్ ప్రజలేమో టైగ్రిస్–యూఫ్రటిస్ నదీప్రాంతంలోను, ఆర్యులు ఆక్సస్ - జక్సార్టెస్ నదీ ప్రాంతం, డాన్, నీపర్ నదీప్రాంతం, సింధు-గంగ నదీప్రాంతాలలోని పచ్చిక బయళ్ళకు ఎగబడివచ్చి పశుపాలన ప్రధాన వృత్తిగా చేసుకున్నారు. మొదట్లో పశువుల మేత కోసమే తృణ ధాన్యాల పెంపకం మొదలై తదనంతరకాలాన మానవ దేహపోషణకు ఉపయోగపడి వుంటుంది.

ఉన్నతస్థాయి : ఇనుము రజాన్ని భూగర్భంనుండి వెలికి తీయ గలగడం తోటి ఈ స్థాయి మొదలై ఉంటుంది. నాగరికతను చేరుకొనేందుకు వర్ణమాలనూ లేఖనాన్నీ,

ఉపయోగించుకోవడం అవసరమైంది. పూర్వార్ధ గోళంలోని ప్రజలు ఈ స్థాయిలో అపూర్వమైన విధంగా వస్తూత్పాదన చేయగలిగారు. ఈ స్థాయికి చెందినవారే వీర యుగం నాటి గ్రీకులూ, రోమ్‌నగర స్థాపన పూర్వపు ఇటాలియన్ జాతులూ, టేసిటస్ నాటి జర్మన్లూ, వైకింగుల కాలపు నార్మన్‌లూ. ఈ స్థాయిలో ఇనుప కర్రుగల నాగలి వాడకం ముఖ్యమైనది. వ్యవసాయం ఇప్పుడే సాధ్యమైంది. ప్రాణ పోషకాహార రాశి అపారంగా వృద్ధిచెందింది. అరణ్యాలను నిర్మూలించడం ఇనుప గొడ్డలీ, పారలతో సాధ్యమైంది. ఇలా వ్యవసాయయోగ్యమైనభూమి ఎక్కువైంది. జనాభా వృద్ధి పొందింది. కొన్ని కొన్ని స్థలాలలో జనసాంద్రత చిక్కబడింది. కొలిమి, చేతి మర, కుమ్మరి చక్రం, శకటాలు, రథాల నిర్మాణం, నౌకానిర్మాణం, చుట్టూ గోడలు, ప్రాకారాలు, బురుజులు గల నగరాల నిర్మాణం- ఇవన్నీ మనిషికి ఈ స్థాయిలో సాధ్యమయ్యాయి.

*

మోర్గన్ సూత్రీకరించిన దశాభేదాలను టూకీగా చెప్పవలెనంటే

ఆటవిక దశ : చేతికందే సహజసిద్ధమైన వస్తువులను సేకరించుకోవడం;

బర్బర దశ : పశువుల పెంపకం, భూమి సాగుదల, మానవుని క్రియా శక్తి మూలంగా ప్రకృతికి గల ఫలోత్పాదన శక్తిని పెంపొందించడం;

నాగరిక దశ : సహజసిద్ధమైన వస్తువులను మరింత ఉపయోగ పరచుకోవడం గురించి జ్ఞానం వృద్ధి చెందడం, పరిశ్రమ అనేది, కళ అనేది ఏర్పడడం.

* * *

ఫ్రెడరిక్ ఎంగెల్స్ రచన 'కుటుంబం, వ్యక్తి ఆస్తి, రాజ్యం పుట్టుక'కు కె. వి. రమణారెడ్డి చేసిన సంక్షిప్తానువాదంలో మొదటి అధ్యాయం సృజన లోగడ సంచికలో ప్రచురించబడింది.

"జనగీతం" పాడదలచుకున్న కవికి ముందుబాట చూపించని ముందుమాటలు

కత్తి పద్మారావు రాసిన పదిహారు కవితల సంపుటి 'జనగీతం'. ఈ కవిత లకి ముగ్గురు ముందు మాటలు రాసారు. మొదట 'నాదొక మాట' పేరుతో సంజీవ దేవ్ రాసాడు. ఈనాటి సాహిత్యంలో అందరికీ తెలిసిన విషయాల్ని ఎవరికీ అర్థం కాకుండా రాయటానికి సంజీవదేవ్ ప్రయత్నం చేశాడు. "కవితను కవి మాత్రమే రాస్తాడు" ఒకడు కవిత్వం రాసి కవి అవుతాడా, ఒకడు కవి అయిన తర్వాత కవిత్వం రాస్తాడా? కవి అనే ఒక ప్రత్యేక లక్షణాలుగల మనిషి సమా జంలో వుండడు. వడ్రంగం చేసే మనిషిని వడ్రంగి అంటాం. కానీ అతడు వడ్రంగం మాత్రమే కాక ఇంకా చాలా పనులు చేస్తాడు. వడ్రంగం చెయ్యని మనిషిని వడ్రంగి అనం కానీ వడ్రంగం చేసే మనిషిని వడ్రంగి అని మాత్రమే అనటం మనిషిని ఒక వృత్తి చట్రంలో బిగించి వేయటం అవుతుంది. మనిషిలో మానవత్వం కంటే అతని వృత్తికి ప్రాధాన్యం ఇవ్వటం అతని వృత్తితోనే అతణ్ణి పిలవటం వర్గ సమాజ లక్షణం. ఎవరైనా కవిత్వం రాయవచ్చు. సాధనాలూ సాధనా వుంటే ప్రతి మనిషీ అనేక పనులు చేయవచ్చు. కవి అనే వృత్తిని సూచించే మాటతో కవిత్వాన్ని వివరించటానికి పూనుకోవటానికి సామాజికంగా విషయాల్ని పరిశీలించలేక పోవటమే కారణం.

"ప్రజలంటే విశేషులు కాని సామాన్య మానవులని అర్థం" అంటున్నాడు సంజీవదేవ్. మానవుల్ని ఏ ప్రమాణంతో విశేషులనీ, సామాన్యులనీ విభజించ దలుచుకున్నాడు సంజీవదేవ్. మానసిక, శారీరక బాధలు పడేవాళ్ళు సామాన్యులు. పడనివాళ్ళు విశేషులు. మానసిక, శారీరక బాధలు అందరూ పడుతూనే వుంటారు. దేశసంపద మీద యాజమాన్యపు హక్కు వుండి, దోపిడీ చేసేవాళ్ళు దోపిడీ దారులు, భూస్వామ్య వర్గం, పెట్టుబడిదారీ వర్గం. శ్రమను అమ్ముకొని బతికే, పీడించబడేవాళ్ళు ప్రజలు, రైతాంగం, కార్మికులు. ఇందులో పెట్టుబడిదారులు విశేషులూ, ప్రజలు సామాన్యులూ ఎలా అవుతారు? వర్గ దృక్పథం లేని వాక్య తర్కం చేస్తే ఇలాంటి అభిప్రాయాలే వస్తాయి.

కవిత్వం "అందరికీ అర్థం కావాలనే" వాంఛ సంజీవదేవ్ భావించినట్టు "వుదార వాంఛ" కాదు. ప్రాచీన యుగాల్లో కంటే మధ్య యుగాల్లో, మధ్య యుగాల్లో కంటే ఆధునిక యుగంలో కవిత్వం ఎక్కువ మందికి అర్థం అయ్యే క్రమంలోనే అభివృద్ధి పొందుతూ వుంది. ప్రజల్ని గురించి, ప్రజలకోసం రాస్తూ ప్రజల్ని సమీపించే క్రమంలో ప్రజలకి అరం అయ్యే కవిత్వం చెప్పొచ్చు. ప్రజ లందరికీ కవిత్వం అర్థం అయ్యే దశ చారిత్రికంగా అనివార్యంగా వస్తుంది. ఆ

క్రమంలోనే చరిత్ర ముందుకు పోతున్నది. విశేషులూ సామాన్యులూ మానసిక బాధలూ శారీరక బాధలూ అనే తర్కంతో ప్రజా కవిత్వం అంటే బాధల్ని గురించే రాసే కవిత్వం అని సంజీవదేవ్ నిర్వచిస్తున్నాడు. పైగా బాధల్ని గురించి మాత్రమే కాక "ఆనందాన్ని గురించి కూడా కవితలల్లాలట" అల్లుకోవచ్చు. ఇంతకీ ఆనందం దానంతటది కవిత్వానికి వస్తువు ఎట్లా అవుతుంది ? చందమామ సంజీవ దేవ్‌కి ఆనందం కలిగించవచ్చు. మరొకడికి కురుపు దురదను గోక్కుంటూ వుంటే ఆనందం కలగవచ్చు. తన ఆనందాన్ని చెప్పటానికి కవి ఏదో ఒక వస్తువుని ఎన్నుకోక తప్పదు. భావాలు లేకుండా ఎవడూ కవిత్వం రాయలేడు. కవిత్వంలో వ్యక్తం అయ్యే కవి వైఖరిని బట్టి అది ప్రజాకవిత్వం అవునా కాదా అనేది నిర్ణయించబడుతుంది. సగం కప్పు కూలిపోయిన గుడిసెలోని ప్రమిదలో గుడ్డి వెలుతురుని ఇచ్చే దీపకళికని ఒకడు పరంజ్యోతి అనీ పరమాత్మ అనీ వర్ణించవచ్చు. చందమామను గురించి "కంట తడి పెట్టకే, చందమామా, కడనాన కన్నీరు తగదు వినవమ్మా" అని పోరాట కవిత్వం చెప్పవచ్చు. బాధల్ని గురించి చెప్పాలన్నా, ఆనందాల్ని గురించి చెప్పాలన్నా కవిత్వంలో ప్రకృతినో, సామాజిక జీవితాన్నో ఆశ్రయించి చెప్పాల్సిందే. కాబట్టి కవిత్వంలో పరిశీలించవల్సింది బాధలూ, ఆనందాలూ కావు. వర్గ దృక్పథం. కవి జీవిత వైఖరి. కవి ప్రాపంచిక దర్శనం. కవిత్వం ప్రజా కవిత్వమా, పాలకవర్గ కవిత్వమా అనే విషయాన్ని నిర్ణయించే గీటురాయి ఇదే. బాధలూ ఆనందాలూ అంటూ సంజీవదేవ్ "కవిత అంటే రక్తాన్ని సిరాగా మార్చే బాధ" అనే టి. ఎస్. ఇలియట్ నిర్వచనం సముచితంగా వుందని సంతృప్తిని వ్యక్తం చేశాడు. ఇలియట్ ప్రాపంచికదృక్పథానికి ఇలియట్ కవిత్వ నిర్వచనం పరిమితంగా వుంటుందనేది సంజీవదేవ్‌కి తట్టలేదు. ఏమిటి ఇలియట్ దృష్టిలో బాధ? గ్రీక్, రోమన్ పురా సంస్కృతులు కాల గర్భంలో కలిసిపోయినందుకా బాధ? మత కవచాన్ని విసరి పారేసి ప్రజాతంత్ర భావాల్లోకి ఆధునిక మానవ జాతి అడుగు పెడుతున్నందుకా బాధ? వర్గ ఘర్షణ నుంచి వికసించ బోతున్న నవతను గుర్తించలేక నైరాశ్య పడటమా బాధ? కవిత్వం రాయటానికి కవి పడే సొంత కష్టమా ఈ బాధ? సాధ్యం కానిచోట నిర్వచనాలు ఎందుకు ? అన్ని కాలాలకీ వర్తించే కవిత్వ నిర్వచనాలు వుండవు. ఒక కాలంలో కూడా వర్గ నిర్వచనాలే వుంటాయి. ఇలియట్‌ని ఆశ్రయించినా, జగన్నాథుడిని ఆశ్రయించినా అన్ని కాలాలకీ, అందరికీ వర్తించే నిర్వచనం సంజీవదేవ్‌కి దొరకదు. ఇలియట్ కవిత్వం రాయటానికి పడ్డ బాధకంటే కవిత్వం రాసి జనాన్ని పెట్టిన బాధ ఎక్కువ. ఇలియట్ నిర్వచనాల్తో సంజీవదేవ్ బాధపడి పాఠకుల్ని బాధ పెట్టడం అనవసరం.

''మానవ జీవితంలోనే కాదు, ప్రతి ప్రాణి జీవితంలో కూడా స్వేచ్ఛకు ప్రత్యేక స్థానం వున్నది" (సంజీవదేవ్) మానవేతర జంతు ప్రపంచానికి స్వేచ్ఛ

అనే భావన (Concept) వుండదు. జంతువులు మచ్చిక అవుతాయి. పరిస రాలకి అలవాటుపడి బతుకుతాయి. స్వేచ్ఛా భావన మనుషులకి మాత్రమే సంబం ధించింది. వర్గ సమాజంలో వర్గ స్వేచ్ఛ వుంటుంది. వర్గ దృక్పథం లేకపోతే పోనీ కానీ సంజీవదేవ్ మనిషికీ జంతువుకీ తేడా గుర్తించవలసిన అవసరం కూడా లేదనుకుంటున్నాడా?

2

"రెండో ముందుమాట 'అహంనుంచి యదార్థంలోకి' అనే పేరుతో నిఖిలేశ్వర్ రాసాడు. అహం అంటే నేను అని అర్థం. పద్మారావుకి ఇంకా 'ప్రబంధాల భాషా భేషజం' వుంది. భాషలో లాగానే అవగాహనలో కూడా ప్రాథమిక స్థాయిలో వున్నాడు. ఈ స్థితిని అహం అంటున్నాడు నిఖిలేశ్వర్. నిజానికి నేను అనే మాటకి అర్థం లేదు. "నేను" అనేవాడు సమాజంలో వుండడు. ప్రతి వ్యక్తీ ఒక బృందంలో ఒక వర్గంలో వుండే నేను అవుతాడు. పాండిత్యం సంపాదించుకోవటం, కవిత్వం రాయటం కూడా కాస్త లోతుగా ఆలోచిస్తే "నేను" ఒకడు సాధించేదికాదు. ఒక బృందంలో వుండి ఆ బృందంతో కలిసి సాధించేది. "నేను" అంటే 'అహం' చేయగలిగిన పని ఒక్కటి కూడా లేదు. "నేను" అని కాక "మనం" అనేదే వుంటుందని ఆలోచించటం శాస్త్రీయం అవుతుంది. పద్మారావు ప్రబంధాల్ని చది వినా, చావు కంపు కొట్టే పద జాలంతో కవిత్వం రాసినా, హేతువాదిగా ఎదిగినా, అభ్యుదయ కవిత్వం రాసినా నలుగురితో కలసి ఒక బృంద పరిసరాల్లో బతుకుతూ చేయవల్సిందే. చేసిందీ, చేస్తున్నదీ కూడా అదే. "ఎంతటి మహనీయుల గురించి మనం రాసినా అవి ఏవో కీర్తనలలాగా, స్తుతిమాలలాగా మారితే ఎబ్బెట్టుగా వుంటాయి" (నిఖిల్) 'మహనీయులుగా' కొందరిని అంగీకరించిన తర్వాత వాళ్ళ మీద రాసేది కీర్తనలాగానే వుంటుంది. కొందరు 'మహనీయులు' వుంటారని భావించి కవిత్వం రాయటం ప్రారంభిస్తే వచ్చేది జనగీతంకాదు, భజనగీతం. వాళ్ళను వాళ్ళసమాజం నుంచీ, ఆశయాల పునాదులనుంచీ వేరుచేసి అతిశయోక్తుల్లోనూ, అద్భుతోక్తుల్లోనూ కీర్తించటంతో జాషువా, కోవూరుల మీద రాసిన గీతాలు భజనగీతాల స్థాయికి దిగజారిపోయాయి!

"కేవల అనుభూతివాద శుద్ధ కళాత్మక జీవులముతా"ని నిఖిలేశ్వర్ ఏ "ఒంటరి గదుల్లో" చూశాడు. అనుభూతివాదులు కూడా మన పక్కనే వున్నారు. కేవల అనుభూతివాదం శుద్ధ కళాత్మకవాదం వాదాలవరకే కానీ ఆచరణలో అంటే వస్తువులో వాళ్ళు బూర్జువా వాస్తవికతను చిత్రిస్తూనే వున్నారు. ఈ రకం కవుల కవిత్వాన్ని విశ్లేషించి, ఆ కవిత్వంలోని వర్గముద్రని ఎత్తి చూపాలి. అది ఏ విధంగా ప్రజలకు అపకారం చేసే కవిత్వమో బహిర్గతం చెయ్యాలి. అప్పుడే అనుభూతి వాద కవులు తమ దారిని గురించి ఆలోచనలో పడే అవకాశం వుంటుంది. హేతు

వాదులు మారతారనీ అనుభూతి వాదులు మారలేరనీ చెప్పటానికి ప్రమాణం లేదు. అందరిలోనూ మారే గుణం వుంటుంది.

"ఇటీవల కొందరు మిత్రులు తెలుగులో వచనకవితకు భవిష్యత్తు లేదని వాదిస్తున్నారు" అంటూ వచన కవితకు భవిష్యత్తు వుందని చెప్పటానికి నిఖిలేశ్వర్ తంటాలు పడ్డాడు. భవిష్యత్తు వుందా లేదా అనే దానికోసం తలకాయలు పాడుచేసుకోవటం అనవసరం. దశాబ్దం తర్వాత వచనకవిత్వ అవసరం లేకపోతే పోతుందిదానికోసం ఇప్పుడు మనం విచార పెడటం ఎందుకు? ఇప్పుడు వచన కవిత్వం వుంది. ఒక ప్రక్రియగా దాన్ని నిరాకరించవలసిన అవసరం లేదు. మధ్య తరగతి పాఠకులకి వచన కవిత్వం అందుతుంది. అయితే వేల్చేరు నారాయణరావు చెప్పినట్టు వచనకవిత్వం లిఖితకవిత్వ జాతికి మాత్రమే చెందింది. యువ కవుల్ని ఈ ప్రక్రియ బాగా ప్రలోభ పెడుతుంది. మౌఖిక స్వభావం గల ప్రజా కవిత్వం వైపు నుంచీ దృష్టి మళ్ళిస్తుంది. మౌఖికత మీద వచన కవిత్వం బాగా దెబ్బ తీస్తుంది. పాట చొచ్చుకొని పోయినంత శక్తివంతంగా వచనకవిత్వం చొచ్చుకు పోలేదు. రూప రీత్యా వచన కవిత్వం శిష్ట బృందానికి సంబంధించిందే. పాట శిష్ట పంజరంలో నుంచీ కవిత్వాన్ని ప్రజల్లోకి తీసుకుపోగలదు. ప్రజల్నే కవులుగా చేయ గలదు. గద్దర్ ఈ సత్యాన్ని నిరూపిస్తున్నాడు. 'విప్లవ వాస్తవికత'ని చెప్పటానికి గద్దర్ పంథా ప్రజల పంథా. కవిత్వాన్ని కానీ కథల్ని కానీ మౌఖికంగా చెప్పటానికి విప్లవ రచయితలు అభ్యాసం చెయ్యాలి. నాటకాల్ని కూడా ఒక పథకం సిద్ధం చేసుకొని స్థానిక సమస్యల్ని అప్పటికప్పుడు ప్రదర్శించేటట్టు నటులు అభ్యాసం చెయ్యాలి. ఈ మౌఖిక సంప్రదాయాన్ని అభివృద్ధి చేసుకోవలసిన సమయంలో వచన కవిత్వం గురించీ, దాని భవిష్యత్తుని గురించీ విచారిస్తూ నిఖిలేశ్వర్ లాంటి వాళ్ళు కాలాన్ని వృథా చేసుకోవటం అనవసరం. ఆ పని కుందుర్తి ఆంజనేయులు లాంటి వాళ్ళకి వదలి వేయవచ్చు. పాటలు రాసే ధోరణిలో పద్మారావు పడుతున్నప్పుడు వచన కవిత్వానికి కూడా భవిష్యత్తు వుందని చెప్పటం దేనికి ?

3

మూడవ ముందుమాట "జనగీతంలో చైతన్య జ్వాలలు" అనే పేరుతో జ్వాలాముఖి రాసాడు. సామాజిక భౌతిక పరిస్థితులకీ సాహిత్యానికీ సంబంధాన్ని విశ్లేషిస్తూ, భూమికోసం భుక్తికోసం జరిగే జనతా ప్రజాస్వామిక విప్లవం గురించి పద్మారావుని చైతన్యవంతం చేయటానికి జ్వాలాముఖి ప్రయత్నంచేశాడు. ఇది ప్రశంసించదగిన ప్రయత్నమేకానీ తన చమత్కార లంపటత్వంతో, పరిశోధనాపునాదిలేనితప్పుడు ప్రతిపాదనల్తో అశాస్త్రీయమైన సిద్ధాంతాలు అనేకం చేశాడు. పద్మం ప్రాచీనకవి సమయాన్ని స్ఫురింప చేస్తోందనీ, కత్తి అన్యాయాన్ని ప్రతిఘటించే మహత్తరశక్తిని గుర్తుకుతెస్తోందనీ కవి నామసార్థక్యాన్ని నిరూపించాడు జ్వాలాముఖి. కత్తిపద్మారావుతో కత్తి ఇంటిపేరు. పద్మారావు పేరు. ఈ రెండూ కవి తానుగా పెట్టుకున్నవి కావు.

కత్తిఇంటిపేరుగావున్నవాళ్ళు మతసంస్థల్లో వుండకూడదనే నియమం ఏమీలేదు. పద్మారావు పేరుగలవాళ్ళు గణితశాస్త్ర పరిశోధనలు చేయకూడదనీ చెప్పలేం. పేరుకీ, ఇంటిపేరుకీ కవిత్వానికీ ఏమి సంబంధం? పద్మారావు భీముడులాగా పురాణపాత్రకాదు. చమత్కార వ్యామోహం శాస్త్రీయ వివేచనకు పనికిరాదు.

"ప్రబంధ సాహిత్యాన్ని ఒక కలంపోటుతో కొట్టి పారేశాడు" (జ్వాల పే. ii) కలంపోటుతో కానీ మరొక పోటుతోకాని రాయలకాలంనాటి ప్రబంధ సాహిత్యాన్ని ఎలా కొట్టివేయగలం? గత కాలపు కవిత్వాన్ని ఇప్పుడు ఎలా లేకుండా చేసేది? ఎందుకు చేసేది? ప్రబంధ కవిత్వాన్ని కానీ, పురాణ కవిత్వాన్ని కానీ చారిత్రక భౌతికవాద దృష్టితో గతితార్కికంగా పరిశీలించాలి కానీ వాటిని లేకుండా చెయ్యాలనే ఆలోచన రావటమే అరాచకం. ఇంతకీ ప్రబంధాల్తో జ్వాలాముఖికి పేచీ ఎక్కడ? ప్రబంధాల్లో స్త్రీ శరీర సౌందర్యం అతిగా వర్ణించారట. నిజమే అనుకుందాం. ఎందుకు ప్రబంధకవులు స్త్రీ సర్వావయవ వర్ణన చేశారు. పురాణాల్లో స్త్రీకి మాతృత్వ స్థానాన్ని కూడా నిరాకరించిన సందర్భాలు వున్నాయి. చాలా మంది పురాణపురుషులు అయోనిజులు. అంటే వాళ్ళు స్త్రీలకి పుట్టలేదు. ప్రబంధాల్లో పుత్ర జన్మావధికంగా స్త్రీ శరీర సౌందర్యాన్ని చిత్రించటం స్పష్టంగా ఒక ముందడుగు. స్త్రీ పురుష సంబంధాల్లో వచ్చిన మార్పుని ప్రబంధస్త్రీ వర్ణన సూచిస్తుంది. ఇంతకీ ప్రబంధాల్లో వున్నది స్త్రీ శరీర సౌందర్య వర్ణన మాత్రమేకాదు. అధ్యయన అలసత్వం వల్లా, గతానుగతిక ఆరోపణలవల్లా అవగాహనలో జడత్వం వస్తుంది. ప్రబంధాల్ని ఆనాటి సమాజం అనే ఒక మొత్తంలో భాగంగా పరిశీలన చెయ్యాలి. స్వర్గవర్ణనకయినా జీవిత వాస్తవాలే పునాదులు. మతం అనే మంచు తెరను తొలగించి చూస్తే ప్రబంధాల్లో ఆనాటి సామాజిక స్థితిగతులు స్పష్టంగా కనిపిస్తాయి. స్త్రీ స్థానంలో వచ్చిన పరిమాణాత్మక మార్పు మనోరమ, ప్రభావతుల్లో కంటే వరూధిని రంభల్లో ఎక్కువ కనిపిస్తుంది. ఆనాటి సంప్రదాయానికి విరుద్ధమైన మార్పుల్ని చెప్పటానికి ప్రబంధ కవులకి జ్వాలాముఖి 'దేవవేశ్య'లని భ్రమ పడుతున్న పాత్రలే ఎక్కువ దోహదం చేశాయి. కలభాషిణి అభినవ కౌముదికంటే మానవతా స్ఫూర్తిగలపాత్ర. పురాణాల్ని గురించీ ప్రబంధాల్ని గురించీ చెప్పక పోతే జ్వాలాముఖిని అడిగేవాడు ఎవడూలేడు. కానీ విశ్లేషించే వోపిక లేనప్పుడు, చరిత్రను పారతోసూ, గునపంతోనూ తవ్వి చెప్పలేనప్పుడు గతితార్కిక భౌతిక వాదాన్ని గురించి చెపుతూకూడా ఈ తప్పుడు సూత్రీకరణలు చెయ్యడం సమంజసం కాదు. ఈ నిహిలిస్టు మూర్ఖత్వం వల్ల అభ్యుదయ వుద్యమానికి చాలా నష్టం వుంది.

"అనుభవానికి అందని అనుభూతిని, అర్థంలేని శబ్దసౌందర్యంతో మురిపించే"ది ప్రబంధ ధోరణి అని పద్మారావు అంటే దాన్ని సమర్థించటానికి జ్వాలాముఖి ప్రయాసపడడం అర్థరహితం. సారాంశాన్ని అనుభవంలోకి ఆవిష్క-

రించుకోవాలి. 'శబ్ద సౌందర్యం' ఏమిటి? అర్థంలేని మాటలు ఎక్కడ ఎలా వుంటాయి? ప్రబంధాల్లో ఎక్కడా అస్పష్టతలేదు. రాజుల, సంపన్న ప్రభువుల అనుభవాల్నే ప్రబంధకవులు రాసారు. ఆంధ్రప్రాంతం లోని ఫ్యూడల్ యుగ చరిత్రని బహుముఖాలుగా పరిశీలించాలి. ప్రపంచ చరిత్ర అంతటా ఫ్యూడల్ యుగం ఒకే రూపంలో వుండదు. భూస్వామ్య చరిత్ర సంకీర్ణక్రమాలు ప్రబంధాల్లో నిలువుటద్దంలో మనిషి ప్రతిబింబంలా స్పష్టంగా కనిపిస్తాయి. వైష్ణవ, శ్రీవైష్ణవమతాలూ, రాజకీయ వ్యవస్థ, సంపన్నవర్గాల జీవితం, విద్యావిధానం మొదలైన భూస్వామ్యవ్యవస్థ లక్షణాలకి అనుగుణ్యమైందే ప్రబంధరూపం. భూస్వామ్య సాహిత్యవ్యతిరేకపోరాటం అంటే రాయలకాలంలో భూస్వామ్య సాహిత్యం మీద పోరాటంకాదు. ఈనాటి భూస్వామ్య వర్గాన్ని సమర్థించే సాహిత్యవ్యతిరేక పోరాటం. వాల్మీకి రామాయణాన్నీ, తులసీదాసు రామాయణాన్నీ విశ్వనాథ రామాయణాన్నీ ఒకే ప్రమాణంతో చూసేవాళ్ళు భూస్వామ్య వ్యవస్థ చరిత్రను చారిత్రికంగానూ, గతి తార్కికంగానూ అవగాహన చేసుకోవటంలో విఫలమైనవాళ్ళే. భారతదేశచరిత్రలో మార్పులేదనీ, దానిక్కారణం వర్ణ వ్యవస్థ అనీ సామ్రాజ్య వాద చరిత్రకారులు రాస్తే జ్వాలాముఖి దాన్నే పునరుద్ఘాటిస్తున్నాడు. వర్ణవ్యవస్థ మార్పుల్ని నిరోధించలేదు సరికదా వర్ణవ్యవస్థే మారుతూ వచ్చింది. బ్రాహ్మణ వర్ణంలోనూ పంచముల్లోనూ ఎక్కువ మార్పు రానట్టుపైకి కనిపిస్తుంది. అదికూడా పూర్తినిజం కాదు. గణాలు వ్యవస్థలోసంలీనం అయ్యే క్రమంలో ఈ రెండు కులాల్లో కూడా మార్పులు వచ్చాయి. గ్రామాలు లేదా జనపదాలు పరస్పర సంబంధం అంతగా లేకుండా వున్నంతకాలం మార్పులు నత్తనడక మీద వచ్చాయి. వర్ణవ్యవస్థ అనేది ఒక స్థిరవిధానంకాదు. చరిత్రలో అనేక మార్పుల్ని పొంది ప్రస్తుతం కులతత్త్వంగా మిగిలివుంది. భూస్వామ్య సామాజిక విధానం మీద పోరాటం చేయటం అంటే ఈ కులతత్త్వం మీద పోరాటం చెయ్యటమే కాని ఇప్పుడు లేని వర్ణవ్యవస్థ మీద మండిపడటంకాదు. నిర్దిష్ట విశ్లేషణ లేకుండా సాంస్కృతిక పోరాటం అయినా ముందుకు పోదు.

"ఓహోహో మన సంస్కృతి

మలిన జీవుల గత సంస్కృతి"

అని పద్మారావు రాస్తే "...గతాన్ని కవి చీల్చి చెండాడుతాడు" అని జ్వాలాముఖి వ్యాఖ్య. 'మలిన జీవులు' అంటే ప్రాచీన కాలంలో పంచములని అర్థం. గురజాడ "మలిన జీవులు మాలలనుచును" అన్నాడు. వాళ్ళ సంస్కృతి ఏమన్నా వుంటే దాన్ని చీల్చి చెండాడటం చేయవల్సిన పని కాదు. లేక పోతే మన గత సంస్కృతి అంతా మలిన జీవుల సంస్కృతే అని సామాన్యార్థంతో తీసుకోవాలి. అదీ

ముఖి నవరించాలి. అంతే కానీ జ్వాలాముఖే ఈ విధ్వంసన వాదాన్ని ప్రస్తుతించటం అర్థరహితం. విప్లవ సాహిత్య వుద్యమంలోకి ఇలాంటి దుర్బోధల్ని ప్రవేశ పెట్టటం చేయవల్సిన పని కాదు. యువ రచయితల్ని తప్పుదోవ పట్టించటం సాహిత్య బాధ్యతా రాహిత్యం.

"నాస్తిక హేతువాదాలు ప్రజలకు చాలా దూరంగానూ మేధావుల పండిత చర్చగానూ మిగిలి పోయాయి" (జ్వాలాముఖి) ఇవి రెండూ కూడా సిద్ధాంతాలుగా వుండవల్సిందే కానీ ఆచరణ తత్త్వ శాస్త్రంలో భాగాలు కాలేవు. దేవుడు లేడని చెప్పటం వల్లా, విగ్రహారాధన మానేయటం వల్లా తద్దినాలు పెట్టక పోవటం వల్లా సంఘంలో ఏం మార్పు వస్తుంది? మూఢ విశ్వాసాల మీద ఎన్ని పుస్తకాలు రాస్తే మాత్రం వచ్చే ప్రయోజనం ఏముంది? తప్పుడు సిద్ధాంతాలకు కూడా హేతువులు చూపించవచ్చు. హేతువే హేతువాద తీరం. ఆచరణ సంగతి ఎలా వున్నా ఈ రెండు సిద్ధాంతాలూ బూర్జువా వర్గ ప్రయోజనాలకి బాగా పనికొస్తాయి. శాస్త్రీయ దృక్పథం అంటే అశాస్త్రీయ దృక్పథాల్ని ఖండించటం మాత్రమే కాదు. శాస్త్రీయ దృక్పథం వుండటం. అది ఆచరణ తత్త్వశాస్త్రంగా వుండటం. ప్రజల పోరాటాల్తో అన్వయించకుండా, ప్రజల విప్లవ కార్యాచరణలో భాగంగా చేసుకోకుండా ఒక దృక్పథంగా వుంచుకుంటే గతితార్కిక భౌతికవాదం వలన కూడా ఏమీ ప్రయోజనం వుండదు. ప్రాచీన సాహిత్యం మీదా, గత సంస్కృతి మీదా వర్ణవ్యవస్థ మీద జ్వాలాముఖి వైఖరి నాస్తిక, హేతువాద విధ్వంసనవాద వైఖరే. "చార్వాకులు చచ్చిన చోటే నేటి హేతువాది, నాస్తికుడు ప్రదక్షిణం చేస్తే పాత ఛాదస్తం పోయి కొత్త ఛాదస్తం వచ్చినట్లవుతుంది" (జ్వాలాముఖి) చార్వాకుల విషయంలో 'చచ్చిన' అనే నిరసన పదాన్ని ప్రయోగించటం దురావేశం. భారతీయ తత్త్వశాస్త్రంలో చార్వాకులు అమరులు. వాళ్ళు లోకాయతులు. భౌతికవాదులు. ఈనాటి మన నాస్తికుల్లాగా, హేతువాదుల్లాగా చార్వాకులు కుర్చీ కూనిరాగాలు తీసిన వాళ్ళు కాదు. వాళ్ళు తమ అభిప్రాయాల కోసం ప్రాణాల్ని ఇచ్చారు.

"ఈ దేశంలో వళ్ళమ్ముకోవటం కూడా ఒక వృత్తి. దానికి మన సంప్రదాయం ఒక కులాన్ని కూడా కేటాయించింది. ఇంతటి నీచానికి దిగిన సంప్రదాయం మరెక్కడా లేదు" ఇది జ్వాలాముఖి వేశ్యావృత్తిని గురించి చెపుతూ చేసిన వ్యాఖ్య. అన్ని దేశాల్లోనూ వేశ్యావృత్తి వుంది. ఇంతకీ మన సంప్రదాయంలో వేశ్యావృత్తి చేసే కులం పేరు చెప్పలేదు జ్వాలాముఖి. వర్ణాలూ కులాలూ జాతులూ గణాలూ ఎలా ఏర్పడినవో, వాటికి నిర్దిష్ట కాలంలో నిర్దిష్ట అర్థం ఏమిటో తెలుసుకోవటం అవసరం. వేశ్య, భోగం స్త్రీ, కులట, సాని, ముండల వంటి మాటల వెనక సామాజిక చరిత్ర వుంది. వేశ్యావృత్తి చేసే కులం ఒకటి లేదు. అన్ని కులాల వాళ్ళూ ఈ వృత్తి చేశారు. భూస్వామ్య వ్యవస్థలో 'వుంచుకోవటం' అనే పద్ధతి వుండేది.

దాన్నించీ కుటుంబాలు ఏర్పడి భోగం వాళ్ళు అనో మరొకటనో అనటం జరిగింది. పతివ్రతలనబడే వాళ్ళకంటే చరిత్రలో వేశ్యలే కాస్త స్వేచ్ఛని అనుభవించారని పిస్తుంది. వేశ్యావృత్తికి వివాహం కారణం. ఆధునిక వేశ్యావృత్తికీ ప్రాచీన కాలంలో వేశ్యావృత్తికీ చాలా తేడా వుంది. ఒకడితో కొంతకాలం మరొకడితో మరి కొంత కాలం వుండే వేశ్యను వ్యభిచారిణి అనరు. ఆమెకూ పతివ్రతకీ తేడా ఏమీ లేదు. లాడ్జింగ్ అమ్మాయిలు రోజుకి నలుగురయిదుగురికి శరీరాన్ని అమ్ముకొని బతకాలి. మధురవాణి, రామస్వామి వంటి వేశ్యలకీ లాడ్జింగ్ అమ్మాయిల జీవితానికీ చాలా తేడా వుంది. ఆ వేశ్యలకున్న భద్రత ఈ అమ్మాయిలకి లేదు. అందుకే వేశ్యలకి లైసెన్సులు ఇవ్వాలి అనే ఆలోచన వచ్చింది. గూండాల చేతుల్లో, పోలీసుల చేతుల్లో లాడ్జింగ్ యజమానుల చేతుల్లో పడుతున్న క్రూరమైన హింస నుంచీ ఈ లైసెన్సులు కొంతవరకు లాడ్జింగ్ అమ్మాయిల్ని కాపాడతాయి. అరెస్టులూ అవహేళన, బహిరంగ అవమానాలూ తగ్గుతాయి.

ఈ ముందుమాటలో 'మన సంప్రదాయం' అని చాలాసార్లు వాడాడు జ్వాలాముఖి. ఏమిటి దాని అర్థం. ఎవరి నుంచీ ఎవరిని వుద్దేశించి 'మన సంప్రదాయం' అంటున్నాడు. వైదిక సంప్రదాయం, బౌద్ధ జైన సంప్రదాయాలు, లోకాయత సంప్రదాయం, వీరశైవ, శ్రీ వైష్ణవ సంప్రదాయాలు, మహమ్మదీయ, క్రైస్తవ సంప్రదాయాలూ, ఇంకా అసంఖ్యాకమైన గణ సంప్రదాయాలూ భారత దేశంలో వున్నాయి. వీటిల్లో జ్వాలాముఖి చెప్పే 'మన సంప్రదాయం' ఏది?

త్రిపురనేని మధుసూదనరావు

జనగీతం- కె. పద్మారావు కవితా సంకలనం. పేజీలు. 36 + XIII + 8 వెల రు. 3. ప్రతులకు : కె. పద్మారావు, ఎస్. బి. ఎస్. సంస్కృత కళాశాల పొన్నూరు, గుంటూరు జిల్లా 522 124.

"లక్ష్యం తెలియని బాణం"

నాగలి పట్టినవాడు (సీరపాణి) అనే పేరుతో బలరామనాయుడు కలం పట్టి కవిత్వం రాస్తున్నాడు. "తుమ్మచెట్టులు నరకి, తుప్పలన్నీ పెరికి/రంకెవేసే నదుల వంకరలు తీర్చేసి, పాతాళగంగకు ఏతాము లెత్తించి" బంగారు పంటలు పండిస్తున్న మనిషికి భూమి లేదని తెలుసుకున్నవాడు ఈ కవి. "ప్రకృతి మనకిచ్చేటి బంగారు సిరులన్ని/ ఏ ఇనుప పెట్టెలో ఇరుకుకున్నాయి?/ ఎవరి సొంతం గాలి? ఎవరి సొంతం నేల?" అని ప్రశ్నిస్తున్నాడు. "కదిలించే ఇమోషన్" కవితకు ఉండాలని గుర్తించినవాడు.

అయితే, తానే 'స్రాంతివాద'లో అన్నట్టు, "లక్ష్యం తెలియని బాణంలా

నిరీక్షిస్తోంది పెన్ను" అయనది. "స్వతంత్ర సమర మహారథి గాంధీ/ త్యాగ శీలమును మరిచావా?/ శత్రుహృదయమున శతఘ్ని పేల్చిన/ బోసు కేసరిని మరిచావా?/ భరత ధాత్రికై ప్రాణములిచ్చిన భగత్సింగునే మరిచావా?" అని లాల్ బహదూర్ శాస్త్రిలాగా 'జై జవాన్' అంటున్నాడు సీరపాణి. ("కొత్తతరం అభ్యుదయకవుల్లో ప్రముఖుడు" ఈయన అని అనిసెట్టి అంటున్నాడు.) "అయినవారు లేనినాడు ఆదరిస్తే పునాది"— ఇది మంచి పద్ధతి— అని అంటున్నాడు సీరపాణి. ("సమత ఇతని కవితకు ప్రాణం. అది ముందుతరాల కోసం కవి ఇచ్చే గోదానం"— అని "కాళయుక్తి విజయదశమి" రోజున ఆరుద్ర సర్టిఫికెట్ ఇచ్చాడు.) అభ్యుదయ రచయితల సంఘం ఏ సామరస్య ధోరణికి 'బలి' అయిందో సీరపాణి కూడా దానికే 'బలి' అయ్యాడు.

పహ్నికుధర కుహరం, క్షుభిత మానవుల అశ్రువార్నిధులు, శోక తిమిర సంఛన్న జగతిలో, నవ మధూదయ స్వర్ణరాగ సంకీర్ణమై, గలిత పాదప శుష్క పత్ర సంరంభమై, హిమాలయ భూదరోత్తుంగ శృంగమై......ఘోరచటులోద్భట ఘటానీ కార్భటమ్ములె—కవితా సంపుటి నిండా. సంస్కృతం చదువుకున్న వాడని తెలుస్తున్నది. ఇట్లాంటి పదాలతో ప్రజలకు దగ్గరగా ఎట్లా పోతావయ్యా? అని మందలించడంపోయి 'భాషా ప్రావీణ్యం' ఉన్నదని ఆరుద్ర మెచ్చుకుంటున్నాడు. అంతేకాదు, గురజాడను సీరపాణి వెనుక నిలుచో బెట్టాడు.

క్రూర దానవుల ఘోర యాగాలు, నవతాక్రతుకుండం, విప్లవ హవనాగ్ని, అమృతం, హాలాహలం, శాపాలు, పాపాలు, ధూపాలు, అథఃపాతాళానికి త్రొక్కబడిన బలీంద్రుడు, స్వర్గాల ద్యుతులు, మహాప్రభో!—ఇట్లాంటి ప్రయోగాలెందుకు ఇంకా అభ్యుదయ కవికి— "ప్లాట్‌ఫారంలాంటి బ్రతుకు" అనిచక్కగా అనగలుగుతున్నప్పుడు? (పే. 34)

పక్కదారులు వెతికి, బానిసలుగా బతకడం తగదని 'అగ్నిగీతం' వినిపిస్తున్న సీరపాణి, "ప్రవచనాలు వల్లించుట/ పెద్దమనుషులకు ఫ్యాషన్" అని గుర్తించిన వాడే. "అమ్మయ్యో! అభ్యుదయం!! తలచుకుంటే ఒళ్ళంతా జెర్రు ప్రాకు జలదరింపు" (కాళోజీ) అనిపించేలా కాకుండా కవిత్వం రాస్తేచాలు, గొప్పవాడే.

—జీ.డి.

డమరుధ్వని (కవితా సంకలనం)- సీరపాణి
ఏరువాక ప్రచురణలు, మద్రాసు. పేజీలు 48, వెల రు. 3.
ప్రతులకు : నవోదయా పబ్లిషర్స్, విజయవాడ-2
రచయిత, ఎం. సీతారాంపురం
(శ్రీకాకుళం) 532461

రెండో ముద్రణ వెలువడింది

జనం చిన్నాలు

చిన్నాలు సంస్మరణ

రాడికల్ యువజన సంఘం పైడిపల్లి ప్రచురణ

వెల : రు. 1-00

ప్రతులకు :- సృజన, హనుమకొండ, వరంగల్ - 506001.

వెలువడింది

సృజన ప్రచురణ

మార్క్సిజం, లెనినిజం

మన సూక్ష్మదర్శినీ, దూరదర్శినీ

మార్క్సిస్టు తత్వ శాస్త్రం : ప్రధానాంశాలు

వెల : 0-50 పైసలు

ప్రతులకు :- సృజన, హనుమకొండ, వరంగల్ - 506001.

త్వరలో

సృజన ప్రచురణగా

కరీంనగర్ ఆదిలాబాద్ రైతాంగ పోరాట పాటలు

ఇదివరలో సృజన ప్రచురించిన రెండు సంకలనాలలోని పాటలతో పాటు సోదర పత్రికలలో వచ్చిన, అముద్రిత పోరాట పాటలు కూడా కలిపిన దాదాపు 40 పాటల సంకలనం

SRJANA, Telugu Monthly Jan. '81 H/WL-10
Regd. No. with Registrar of Newspapers 10953/67.